
అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 12-6-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 9 | సంచిక : 111 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50



బడులు బాగుపడేనా!

నేటి నుంచి పాఠశాలలు... సమస్యలు యథాతథం..

- ప్రారంభం రోజు పుస్తకాలు, యూనిఫామ్స్ కష్టమే..!
- నత్తనడకన మన ఊరు మన బడి పనులు

నవతెలంగాణ - మొఫిసిల్ యంత్రాగం

వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలో సోమవారం నుంచి పాఠశాలలు పున:ప్రారంభం అవుతున్నాయి. ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందించుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం రోజే పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్‌తో పాటు టై, బెల్ట్, షూస్ విద్యార్థులకు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. సమస్యలు లేకుండా స్కూళ్లను ప్రారంభించాలని, విద్యార్థులకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని సూచించింది. కానీ ఎప్పటిలాగే ఈ ఏడాదీ అరకొర వసతులతోనే ప్రభుత్వ బడులు ప్రారంభం కాబోతున్నాయి. మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ విద్యా వ్యవస్థకు దీటుగా తీర్చిదిద్దేందుకు మన ఊరు మనబడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినా పనులు నత్తనడకన నడుస్తున్నాయి. పనులు పూర్తయిన చోట స్కూల్స్ మెరుగుపడ్డాయి. టీచర్ల ఖాళీలు షరామామూలే.. స్కూల్స్ ప్రారంభం నాటికే ఖాళీ పోస్టుల్లో విద్యావాలంటీర్లను నియమిస్తామని చెప్పినా ఇప్పటివరకు ఏర్పాట్లు జరగలేదు. బడిబాట ఈ నెల 17 వరకు కొనసాగనుంది. అన్ని పాఠశాలల్లో కంప్యూటర్ విద్య నేటికీ హామీగానే మిగిలి ఉంది. మరోవైపు ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఈ ఏడాది ఫీజులమోత మరింత భారీగా మోగుతోంది.



భారీగా ఉపాధ్యాయ ఖాళీలు.. వాలంటీర్ల నియామకానికి డిమాండ్

కనిపించని 'స్వచ్ఛ'త..

రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 1.06 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో 60 లక్షల మంది విద్యార్థులుంటే.. ప్రభుత్వ స్కూళ్లలోనే సుమారు 26 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా, గతంలో రాష్ట్రంలో 16 వేల మంది దాకా ఉన్న స్వచ్ఛ కార్మికులు ప్రస్తుతం లేరు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ కార్మికులు పాఠశాల పరిసరాలను మాత్రమే శుభ్రం చేస్తున్నారు. తరగతి గదులు, స్టాఫ్‌రూమ్‌లు, మరుగుదొడ్లను మాత్రం శుభ్రం చేయడం లేదు. ఉదాహరణకు జీహెచ్ఎంసీ పరిధిలో 690 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. పాఠశాలలో 40మందిలోపు విద్యార్థులు ఉంటే ఒకరిని రూ.2వేలు, అంతకంటే ఎక్కువ విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులకు రూ.2,500 చొప్పున వేతనంతో నియమించారు. ఉన్నత పాఠశాలల్లో వందలాది మంది విద్యార్థులకు వీరి సేవలు కీలకంగా

...2లో



ఆ బడుల్లో నీటి సమస్య

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2, 400 ప్రభుత్వ పాఠశాలలుండగా 80% మౌలిక వసతుల లేమితో ఉన్నాయి. మిషన్ భగీరథతో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పినా నేటికీ కనెక్షన్లు ఇవ్వలేదు. రంగారెడ్డి జిల్లాలోని శివరాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1600 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వాటర్ తాగితే యూరిన్‌కి వెళ్లాలని నీళ్ళు కూడా సరిపడా తాగట్లేదు. 'మన ఊరు-మన బడి' కింద ఎంపికైన పాఠశాలల్లో కొంత మేర మౌలిక వసతులు కల్పించారు. నిధుల లేమితో నూతన భవనాలు పూర్తి కాలేదు.



టార్గెట్ ఈటల?

ఒంటరిన్నిచేసే యత్నం...

- గ్రూపులుగా చీలిన ఈటల, బండి
- మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఇంట్లో పలువురు నేతల భేటీ
- కొండా, విజయశాంతి, వివేక్, విఠల్, బూర తదితరులు హాజరు
- ఈటలకు ప్రమోషన్ ప్రచారంపై పెదవివిరుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో పదవుల మార్పు అంశం చిచ్చు రేపుతున్నది. కొంత కాలంగా నడుస్తున్న అంతర్గపోరు పీక్‌స్టేజీకి చేరుతున్నది. మొన్నటిదాకా బండికి వ్యతిరేకంగా వీచిన గాలి ఇప్పుడు ఈదురుగాలై ఈటల వైపు మళ్లింది. ఈ రాజకీయ తుఫాన్ బీజేపీలో కల్లోలం సృష్టించేలా కనిపిస్తున్నది. ఈ విషయంలో జాతీయ నాయకత్వం ఎత్తులు జిత్తులు కూడా పనిచేయట్లేదని తెలుస్తున్నది. ఆ పార్టీలో ఇన్నాళ్లు ఈటల రాజేందర్ పాట పాడినోళ్లంతా ఇప్పుడు బండి రాగం ఎత్తుకోవడం కొత్త పరిణామాలకు దారితీస్తున్నది. ఇప్పుడు ఈటలే టార్గెట్‌గా తతంగం నడుస్తున్నది. అందులో భాగంగానే తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసి ఇప్పుడు బీజేపీలో ఉన్న నేతలంతా ఉన్న ఫలానా మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఇంట్లో భేటీ కావడం కాక పుట్టిస్తున్నది. ఆ సమావేశంలో విజయశాంతి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, విఠల్, బూర నర్సయ్యగౌడ్, రవీంద్రనాయక్, వివేక్, మహేశ్వర్‌రెడ్డి, తదితర నేతలంతా పాల్గొన్నారు. బీజేపీలో చీలిక తెచ్చేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నాడంటూ సమావేశం అనంతం మీడియాకు చెప్పినప్పటికీ.. బీజేపీలో ఈటలకు ప్రమోషన్‌పైనే ప్రధానంగా చర్చ నడిచిందని తెలుస్తోంది. ఈ ప్రమోషన్‌పై ఆ నేతలంతా ఈటలకు వ్యతిరేకంగా మారి బండికి అనుకూలంగా మారారని ప్రచారం జరుగుతున్నది. తాము ఉద్యమకారులమే...తమకూ ప్రజల్లో పేరుంది...మమ్ముల్ని అధిష్టానం ఎందుకు పట్టించుకోవట్లేదు? అనే కొత్తపల్లవి ఎత్తుకున్నట్టు తెలిసింది. పార్టీ కార్యాలయం కేంద్రం కాకుండా రోజుకో చోట నేతలు సమావేశాలు

...9లో

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష



హైదరాబాద్: తెలంగాణ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పరీక్ష రాసిన అభ్యర్థులు మాట్లాడుతూ.. గత గ్రూప్ 1 పరీక్ష కంటే ఈసారి పేపర్ సులభంగా ఉందని చెప్పారు. ఔటాఫ్ సబ్జెక్ట్ ప్రశ్నలు రాలేదన్నారు. పరీక్ష హాల్లో కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారని

...9లో

అదానీ, మోడీ కవలలు

మోడీకి 30 మంది కార్పొరేట్ దత్తపుత్రులు

- దేశంలో ఆర్థిక నేరస్తులకు ప్రతినిధి మన ప్రధాని
- ముత్తయిదువు కాదుకాబట్టే పార్లమెంట్ ప్రారంభానికి రాష్ట్రపతికి ఆహ్వానం లేదు
- మోడీ గడ్డంతో పాటు గ్యాస్, పెట్రోల్ ధరలు పెరుగుతున్నాయి : సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

వివరాలు 2లో





అమిత్ షా గో బ్యాక్

తొమ్మిదేండ్ల విద్రోహ పాలనపై వామపక్షాల నిరసనలు

- ఏపీకి ద్రోహం చేసిన బీజేపీకి పాడెకట్టండి : సీపీఐ(ఎం)ఏపీ కార్యదర్శి వి శ్రీనివాసరావు
- దేశానికి, రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీలేదు : సీపీఐ ఏపీ కార్యదర్శి కె రామకృష్ణ

విశాఖ: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాకను నిరసిస్తూ రాష్ట్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఆదివారం ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. 'అమిత్ షా గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం

...9లో



సామరస్యానికి తెలంగాణ ప్రతీక

మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ

- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రవీంద్రభారతిలో ఘనంగా సాహిత్యోత్సవం

నవతెలంగాణ-కల్చరల్

తెలుగు, ఉర్దూ భాషలు తెలంగాణ ప్రాంతంలో పాలు నీరులా కలసి ఉంటాయని, గంగాజమునా కా తెహజీబ్‌కు ప్రతీక తెలంగాణ రాష్ట్రమని మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా సాహిత్య అకాడమీ, బాషా సాంస్కృతిక శాఖ నిర్వహణలో సాహిత్యోత్సవంగా ఉర్దూ తెలుగు కవులు సమ్మేళనం జరిగింది. ఉర్దూ భాషా కవులు, తెలుగు భాషా కవులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో రవీంద్ర భారతి ఆడిటోరియంలో పండుగ వాతావరణం కనిపించింది. హోం మంత్రి మహమూద్ అలీ కవి సమ్మేళనంను ప్రారంభిస్తూ మాట్లాడారు. తెలంగాణలో ఉర్దూ ప్రాధాన్యత రాష్ట్ర ఆవిర్భావం తరువాత పెరిగిందన్నారు. గత ముఖ్యమంత్రులు పీవీ, చెన్నారెడ్డిలకు తప్ప ఎవరికి ఉర్దూ రాదని, ఇప్పుడు కేసీఆర్‌కు భాషపై పట్టు ఉందన్నారు. ఉర్దూ తెలిసిన అధికారులకు ప్రాముఖ్యత ఇస్తున్నారని తెలిపారు. ఉర్దూ, తెలుగు కవులు ఒకే వేదికపై కవిత్వం చదవటం అరుదైన సంఘటన అన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. 33 జిల్లాల్లో కవి సమ్మేళనం జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రజలది కలసి మెలసి జీవించే సంస్కృతి అని, దర్వాజ, పరార్, చౌరస్తా వంటి ఉర్దూ పదాలు తెలుగులో మిళితమైనాయని వివరించారు. చివరి నైజాం కాలంలో కొంత ఇబ్బంది పడ్డా మంచి కూడా ఎక్కువ జరిగిందన్నారు. సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాక ముందు కన్నీళ్లు, నెత్తురుతో నేల తడిసిందని, రాష్ట్రం వచ్చినక నీళ్లు చెరువులతో కళకళ లాడుతోందని అన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మెన్ ముజిబుద్దీన్ మాట్లాడుతూ.. ఉర్దూ కవులకు ముగ్దుమ్ మోహినుద్దీన్ పేరిట అవార్డ్స్ ఇస్తున్నామని తెలిపారు. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న మాట్లాడుతూ.. మంచి చేసే ప్రభుత్వాలకు కవులు ప్రచారం చేయాలని, ఇలా చైనాలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో అధికార భాష సంఘం చైర్మెన్ మంత్రి శ్రీదేవి, గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్, మైనార్టీ కమిషన్ చైర్మెన్, సలహాదారు ఏ.కె.ఖాన్, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ పర్యవేక్షణ చేశారు. ఉర్దూ ముషాయిరా, ఖవాలీ, తెలుగు పద్య, వచన కవిత్వంతో తెలంగాణ సంస్కృతి పరిమళించింది.

నాలుగో క్లాస్ పాస్..నకిలీ డిగ్రీ

ఇది రాజు గారి పాలన

- కేంద్ర ఆర్డినెన్స్‌కు వ్యతిరేక ర్యాలీలో కేజ్రీవాల్



న్యూఢిల్లీ: కేంద్రంలోని నియంతృత్వ ప్రభుత్వాన్ని దేశం నుంచి తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆదివారం ఢిల్లీలో ర్యాలీ నిర్వహించింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ ఈ రోజు ఢిల్లీకి ఈ ఆర్డినెన్స్ వచ్చింది, రేపు ఇతర రాష్ట్రాలకూ వస్తుంది. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ను తరిమికొట్టేందుకు రాంలీలా మైదాన్‌కు వచ్చాం.అని చెప్పారు.

,సుప్రీంకోర్టుపై నాకు నమ్మకం లేదని దేశ ప్రధాని

...9లో

కండ్లల్లో పొడిచి..కత్తితో దాడి చేసి..

యువతి దారుణ హత్య

- వికారాబాద్ జిల్లా పరిగిలో ఘటన

నవతెలంగాణ-పరిగి



(ఫైల్)

యువతి దారుణ హత్యకు గురైన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాడ్లాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పరిగి ఎస్ఐ విట్టల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాడ్లాపూర్ గ్రామానికి చెందిన శిరీష(17)వికారాబాద్‌లోని హాస్పిటల్‌లో నర్సుగా విధులు నిర్వహిస్తోంది. కాగా, తల్లి అనారోగ్య సమస్యల కారణంగా శిరీష.. ఇంట్లో ఉంటుండగా.. శనివారం ఇంట్లో వంట చేయలేదు. దాంతో ఆమె తమ్ముడు శ్రీను వాళ్ల అక్క జుట్టు శారద భర్త అయిన బావ అనిల్‌కుమార్‌కు ఫోన్ చేసి శిరీష అన్నం

...9లో

ఒత్తిడిలో రెజ్లర్లు

రాజీ కోసం బెదిరింపులు

- లేదంటే 40 లోక్‌సభ, 160 అసెంబ్లీ స్థానాలలో బీజేపీకి షాక్..



లోక్‌సభ ఎన్నికల్లో జాట్ ఓట్ల కోసం ముందుచూపు

లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహిస్తున్న మహిళా మల్లయోధులపై రాజీ చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం నుండి తీవ్రమైన ఒత్తిడి వస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లలో జాట్ కులానికి చెందిన వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. జాట్ల ప్రాబల్యం కేవలం హర్యానాకే పరిమితం కాదు. పశ్చిమ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌తో పాటు ఢిల్లీలో కొంతమేర వీరు నిర్ణయాత్మక శక్తిగా కొనసాగుతున్నారు.

న్యూఢిల్లీ : ఈ నాలుగు రాష్ట్రాలలోని 40 లోక్‌సభ స్థానాలలో, వాటి పరిధిలోని 160 అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థుల జయాపజయాలను తారుమారు చేసే బలం వీరి సొంతం. కర్నాటక ఓటమితో దక్షిణాది రాష్ట్రాలపై పూర్తిగా పట్టు కోల్పోయిన బీజేపీ, ఉత్తరాదిలోనూ వ్యతిరేకతను మూటకట్టుకుంటోంది. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో విజయం సాధించాలంటే తక్షణమే రెజ్లర్లను భయపెట్టో లేక బతిమాలో దారికి తెచ్చుకోవడం మినహా మరో మార్గం లేదని ఆ పార్టీ నిర్ణయానికి వచ్చింది. ఆ క్రమంలోనే రాజీ ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది.

ఈ నేపథ్యంలోనే నిరసన విరమించాలని, రాజీ చేసుకోవాలని రెజ్లర్లకు బెదిరింపులు వస్తున్నాయి. బ్రిజ్ భూషణ్‌పై తొలుత ఆరోపణలు చేసిన మైనర్ రెజ్లర్ ఆ తర్వాత మాట మార్చడానికి ఈ ఒత్తిడే కారణమని ఒలింపిక్ కాంస్య పతక విజేత

...9లో

ఆధారాలు ఇవ్వండి

- రెజ్లర్లకు నోటీసులు ఇచ్చిన ఢిల్లీ పోలీసులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌పై కేసును నమోదు చేసిన ఇద్దరు మహిళా రెజ్లర్లకు ఢిల్లీ పోలీసులు సమన్లు పంపించారు. సింగ్ పై లైంగిక ఆరోపణలు చేస్తూ కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో సీఆర్పీసీ సెక్షన్ 91

...9లో

నవతెలంగాణ

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో దిగజారిన ఐఐఎఫ్‌టీ ప్లేస్

- మూడు స్థానాలు దిగజారి 27వ ర్యాంకుకు పడిపోయిన వైనం



న్యూఢిల్లీ : వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) ర్యాంకు పడిపోయింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ 2023లో మేనేజ్‌మెంట్ విభాగంలో మూడు స్థానాలు దిగజారి 27వ స్థానానికి చేరుకున్నది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) కింద ర్యాంకింగ్‌ను హెచ్ఆర్డీ మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసింది. గతేడాది ర్యాంకింగ్‌లో, ఐఐఎఫ్‌టీ 24వ స్థానంలో ఉండగా.. 2021లో 25వ స్థానంలో ఉన్నది. 2020లో 26వ స్థానంలో, 2019లో 31వ స్థానంలో ఉన్నది. ఎన్ఐఆర్ఎఫ్ 2015లో దేశంలోని ఉన్నత విద్యాసంస్థలకు ఆబ్జెక్టివ్ ప్రమాణాల ఆధారంగా ర్యాంక్ ఇవ్వడానికి అటువంటి సంస్థలలో పోటీ నైపుణ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రారంభించబడింది.

అదానీ, మోడీ కవలలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కొత్తగూడెం:

అదానీ-ప్రధాని నరేంద్ర మోడీ కవలపిల్లలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. దేశంలో ఆర్థిక నేరస్తులు, దోపిడీదారులకు ప్రతినిధి మోడీ అని ఆరోపించారు. మోడీకి ఈ రకమైన కార్పొరేట్ దత్తపుత్రులు 30 మంది వరకూ ఉన్నారని వ్యాఖ్యానించారు. మోడీ కేబినెట్‌లో 24 మంది క్రిమినల్స్ ఉన్నారని, వీరిలో హోం మంత్రి అమిత్‌షా ప్రముఖుడని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ ప్రజాగర్జన సభలో నారాయణ మాట్లాడారు. ముత్తయిదువు కాదు కాబట్టే రాష్ట్రపతి ద్రౌపదిముర్మును నూతన పార్లమెంట్ భవన ప్రారంభానికి బీజేపీ ఆహ్వానించలేదని వ్యాఖ్యానించారు. ప్రధాన మోడీ పాలనలో న్యాయవ్యవస్థ, సీబీఐ, చివరికి ఎలక్షన్ కమిషన్ కూడా దిగజారాయన్నారు. 26 రాష్ట్రాల్లో ఉన్న సీపీఐకి గుర్తింపు రద్దు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశస్థాయిలో బీజేపీ వ్యతిరేక కూటమిలో కేసీఆర్ చేరాలని, లేదంటే అనుమానాలొస్తాయని వ్యాఖ్యానించారు. రేపిస్టులు, క్రిమినల్స్‌ను కాపాడేది బీజేపీ ప్రభుత్వం అన్నారు. అందుకే రేజ్లర్లు నెలల తరబడి ఆందోళన చేసినా బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌శరణ్ సింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఒకప్పటి గంజాయి స్మగ్లర్ అదానీకి ఎయిర్‌పోర్టులు, పబ్లిక్ సర్వీసులు అమ్మేస్తున్నారని ఆరోపించారు. సంపన్నులపై పన్ను తగ్గించి సామాన్యులపై పన్ను భారం మోపుతున్నారని, మోడీ గడ్డం పెరిగినట్లే గ్యాస్, పెట్రోల్, నిత్యావసరాల ధరలు పెంచుతున్నారన్నారు. పోడుభూములను ఖాళీ చేయించి కేంద్రం కార్పొరేట్లకు అప్పగించాలనే కుట్ర చేస్తుందన్నారు. పోడుదారులందరికీ కేసీఆర్ పట్టాలిచ్చి కేంద్రం ఆగడాలను అడ్డుకోవాలని కోరారు. ఎన్ని ఓట్లు ఉన్నాయని కాదు.. బీజేపీని వ్యతిరేకించే శక్తి లెఫ్ట్ పార్టీలకే ఉందని స్పష్టంచేశారు. ఓట్లు కాదు.. రాజకీయ ఐక్యత కీలకమన్నారు. కర్నాటకలో కులమతాలను రెచ్చగొట్టి, సీబీఐని ఉసిగొల్పి లబ్ది పొందాలని చూసిన బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, అక్కడ పోగొట్టుకున్న సూదిని తెలంగాణలో వెతుక్కోవాలనే భావనతో బీజేపీ ఉందన్నారు. పొంగులేటి ఎవరు? డబ్బుల అహంభావంతో వస్తున్న అవకాశవాద రాజకీయ నాయకులను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అలా అని సీట్ల కోసం లక్ష్మణ రేఖ దాటాల్సిన అవసరం కమ్యూనిస్టులకు లేదన్నారు. కేసీఆర్‌కు అతి తెలివి తేటలు ఎక్కువని, రాజకీయాల్లో విమర్శలు సహజం.. వాటిని సద్విమర్శలుగా స్వీకరిస్తే బాగుపడతారని వ్యాఖ్యానించారు. రూ.10 లక్షల దళితబంధు స్కీంలో రూ.రెండు, మూడు లక్షలకు మించి లబ్ధిదారులకు అందడం లేదన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఏమైందని ప్రశ్నించారు. అందరూ కలిసి వస్తేనే తెలంగాణ కల సాకారమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బాధల్లో ఉన్నవారిని కేసీఆర్ ఓదార్చాలని సూచించారు. మిగతా పార్టీలు ఉంటాయో.. లేదో తెలియదు కాని సృష్టి ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా అస్వస్థత కారణంగా ఈ సభకు రాలేకపోయారని తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు మనీష్ కుంజం తదితరులు మాట్లాడారు. అంతకుముందు కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సభలో మాజీ శాసన సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, మౌలానా, దండి సురేష్ తదితరులు పాల్గన్నారు.

ఒకప్పుడు పెన్నూ పేపర్‌కే డబ్బుల్లేవు..

ఇప్పుడు మన పోలీస్ స్టేషన్లలో అన్ని వసతులు, సౌకర్యాలు...

- కేవలం ఆరేండ్లలోనే అద్భుత ప్రగతి..
- పోలీసు సంస్కరణల్లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శం 'పంజాగుట్ట పీఎస్‌కు సర్వత్రా ప్రశంసలు'
- కేసీఆర్ దూరదృష్టి వల్లే ఇదంతా సాధ్యం
- 'నవతెలంగాణ'తో తెలంగాణ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్



తెలంగాణ సిద్ధించిన తర్వాత ఎన్నో ఆటుపోట్లు, ఒడిదుడుకులు ఎదుర్కొని తొమ్మిదేండ్లను పూర్తి చేసుకున్నామని రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ తెలిపారు. వాస్తవానికి రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదేండ్లు పూర్తయినా.. మొదటి ఏడాది ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు, సర్దుబాట్లతోనే సరిపోయిందని ఆయన చెప్పారు. ఆ తర్వాత కరోనా వల్ల రెండేండ్ల విలువైన సమయాన్ని కోల్పోయామని గుర్తు చేశారు. ఇవిపోను మిగిలిన ఆరేండ్ల వ్యవధిలోనే రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని వివరించారు.

ఒకప్పుడు పోలీస్ స్టేషన్లలో పెన్నూ పేపర్ కూడా ఉండేది కాదనీ, కానీ ఇప్పుడవి సకల హంగులు, వసతులు, సౌకర్యాలతో దర్జాగా ఉన్నాయని తెలిపారు. ఇదంతా సీఎం కేసీఆర్ పరిపాలనా పటిమ, దక్షత, దూరదృష్టితోనే సాధ్యమయ్యాయని చెప్పారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 'పోలీస్ పరుగు'ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దామోదర్... నవతెలంగాణ ప్రతినిధి బి.వి.యన్.పద్మరాజుతో ప్రత్యేకంగా ముచ్చటించారు. రాష్ట్రంలో పోలీస్ సంస్కరణలు, జిల్లాలు, మండలాల్లో నూతన పోలీస్ కార్యాలయాలు, స్టేషన్లు, వాటి నిర్వహణ తదితరాంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

అప్పుడలా.. ఇప్పుడిలా...

'ఉమ్మడి రాష్ట్రంలో అన్ని రంగాల మాదిరిగానే పోలీసులనూ, ఆ శాఖను ఆనాటి పాలకులు పట్టించుకోలేదు. పోలీస్ స్టేషన్ల నిర్వహణకు కూడా డబ్బులుండేవి కావు. ఎవరైనా ఒక ఫిర్యాదు రాయటానికి వస్తే... పెన్నూ, పేపర్ కూడా బయటి నుంచే కొనుక్కోవాలంటూ చెప్పే దుస్థితి. కానీ తెలంగాణ వచ్చాక పోలీస్ స్టేషన్ల ఆధునీకరణ, నిర్వహణలో గణనీయమైన మార్పులను తెచ్చాం. సీఎం కేసీఆర్ ప్రత్యేక జీవోను విడుదల చేయటం ద్వారా గతంలో రూ.375 కోట్లను పోలీస్ శాఖలో మౌలిక సదుపాయాల కోసం విడుదల చేశారు. మరో రూ.500 కోట్లను నూతన వాహనాల కొనుగోలు కోసం కేటాయించారు. తద్వారా గతంలో ఎన్నడూ లేనంతగా అత్యాధునిక వసతులతో కొత్త స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాం. ఈ రకంగా రూపొందించిన హైదరాబాద్ పంజాగుట్ట స్టేషన్ అత్యద్భుతంగా ఉంది. దాన్ని ఇతర రాష్ట్రాలకు చెందిన సీఎంలు, ఉన్నతాధికారులు సందర్శిస్తున్నారు.. ప్రశంసలు కురిపిస్తున్నారు. గతంలో ఒక్కో పోలీస్ స్టేషన్ కేవలం 600 చదరపు అడుగుల్లో ఇరుకిరుగా ఉండేవి. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆ విస్తీర్ణాన్ని 15 వేల చదరపు అడుగులకు పెంచాం. మరోవైపు పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో మహిళలకు 30 శాతం అవకాశమిస్తున్నాం. షీ టీమ్‌ల నిర్వహణ కోసం హైదరాబాద్‌లో నెలకు రూ.75 వేలు, జిల్లా కేంద్రాల్లో రూ.50 వేలు, మండలాల్లో రూ.25 వేలు కేటాయించటం ద్వారా ఎన్నో ఫలితాలను సాధిస్తున్నాం. మరోవైపు కొత్తగా ఏర్పాటు చేసిన ప్రతీ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్లకు సొంత భవనాలను నిర్మించబోతున్నాం. హైదరాబాద్‌లో నిర్మించిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ దేశం మొత్తం మన వైపు చూసేలా చేసింది...'

ఒకప్పుడు వెలవెల.. నేడు జలకళ...

'మా స్వస్థలం రామగుండం. ఉమ్మడి రాష్ట్రంలో అక్కడి నుంచి హైదరాబాద్‌కు వస్తుంటే ఎక్కడ చూసినా వెలవెల బోతున్న చెరువులు, కుంటలు.. నెర్రెలు బారిన నేలలు కనబడేవి. కానీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయతో చెరువులకు జలకళ వచ్చింది. రైతు బంధు, రైతు బీమాతో అన్నదాతలకు భరోసా వచ్చింది. ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేకుండా అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డులు, రివార్డులే ఇందుకు నిదర్శనం. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణను కొంగు బంగారమైంది. కొంతమంది ఆధునిక సాంకేతికత వల్ల అన్ని చోట్లా అభివృద్ధి సాధ్యమైందని అంటున్నారు. అలాంటి వారు పక్కనున్న మహారాష్ట్రతోపాటు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలను తెలంగాణతో పోల్చి చూస్తే వాస్తవం బోధపడుతుంది. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు నచ్చి... మహారాష్ట్రకు చెందిన ప్రజలు తమ ప్రాంతాలను తెలంగాణలో కలపాలంటూ కోరుతున్నారు. ఈ క్రమంలో మనం సాధించిన అభివృద్ధిని చూసి ప్రతీ ఒక్కరూ గర్వపడాల్సిందే...'

పండుగలా జరుపుకుందాం...

'సంక్షేమ, అభివృద్ధి రంగాల్లో శరవేగంగా దూసుకుపోతున్న తెలంగాణ ప్రగతిని దశ దిశలా చాటి చెప్పేందుకే రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోంది. తెలంగాణలోని ఇంటింటికీ పథకాలు, ప్రయోజనాలు అందుతున్న ప్రస్తుత తరుణంలో మనం ఈ ఉత్సవాలను పండుగలా జరపుకుందాం. వీటిని జయప్రదం చేసేందుకోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలి...'

బడులు బాగుపడేనా..!

(మొదటిపేజీ తరువాయి)

మారాయి. కానీ రెండేండ్ల క్రితం ప్రభుత్వం సర్కారు బడుల్లో స్కావెంజర్లను తొలగించడంతో సుమారు 821 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. స్కావెంజర్ల వ్యవస్థ పునరుద్ధరణ అంశం ప్రభుత్వ పరిధిలో ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఉపాధ్యాయులు సొంత డబ్బులతో కార్మికులను నియమించుకుని పారిశుధ్య పనులను చేయిస్తున్నారు. బాలికల పరిస్థితి వర్ణనాతీతం. ఈ విద్యాసంవత్సరమైనా స్వచ్ఛ కార్మికులను నియమిస్తారా? అన్నది తేలలేదు.

'మనబడి'కి నిధుల లేమి..?

మన ఊరు- మనబడి, మనబస్తీ-మనబడి పథకాన్ని ప్రభుత్వం గతేడాది జనవరిలో ప్రారంభించింది. రూ.7వేల కోట్లతో 26 వేల బడుల్లో 12 రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. మొదటి విడతలో రూ.3,497 కోట్లతో 9,123 బడుల్లో చేపట్టింది. బడుల ప్రాంగణం, తరగతి గదులకు రంగులు, కిచెన్‌షెడ్ల నిర్వహణ, డిజిటల్ తరగతి గదుల నిర్మాణం, తాగునీరు, నిరంతర నీటితో కూడిన టాయ్‌లెట్ల నిర్మాణం వంటి వసతులు కల్పించడం ఈ పథకంలో ప్రధాన విధి. మొదటి విడతలో సగం స్కూళ్లలోనే పనులు పూర్తి అయ్యాయి. మిగతా వాటిని షెడ్యూల్ ప్రకారం చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ గడువు పెట్టుకోలేదు. నిధుల లేమితో పనులు జరగడం లేదని తెలుస్తోంది.

భారీగా ఖాళీలు..

అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 21 వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదనపు పోస్టులు, రిటైర్‌మెంటు, ప్రమోషన్లు, బదిలీలు, తదితర కారణాలతో మొత్తంగా 28 వేల పోస్టులు ఖాళీ ఉన్నట్లు ఉపాధ్యాయసంఘాలు వెల్లడిస్తున్నాయి. స్కూల్ అసిస్టెంట్‌లు 7,111, ఎస్‌జీటీ 6,975 పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. 484 ఎంఇఓ పోస్టులకు గాను 467 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనైతే ఏ ఒక్క మండలానికి ఎంఈవో లేరు. పీజీ హెచ్ఎం గ్రేడ్-2 1947, గ్రేడ్-1 పోస్టులు 16కు గాను 15 , ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు 2,043 ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ డీఈవో పోస్టులు 62కు గాను 58, పీఈటీ పోస్టులు 99 ఖాళీగా ఉన్నాయి. సంస్కృతంలో 23 పోస్టులుంటే మొత్తంగా ఖాళీనే. ఆర్ట్ డ్రాయింగ్ 331, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ 443 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

జిల్లాల వారీ ఖాళీలు..

జిల్లాల వారీగా చూస్తే ఖమ్మం జిల్లాలో 5,759 ఉపాధ్యాయులకు గాను 4,702 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇంకా 1,057 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అత్యధికంగా ఎస్జీటీ తెలుగు 342 ఖాళీ ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,372 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఎస్‌జీటీలే 816 భర్తీ చేయాల్సి ఉంది. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 803 ఖాళీలకు గాను స్కూల్ అసిస్టెంట్ 187, ఎస్జీటీలు 616 వరకు, ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,499 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో మొత్తం ఉపాధ్యాయుల పోస్టులు 3,174 ఉంటే ప్రస్తుతం పని చేస్తున్న వారు 2,689. పెద్దపల్లిలో 168 పోస్టులు, జగిత్యాలలో 666, రాజన్నసిరిసిల్లలో 338 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 11,484 మంది ఉపాధ్యాయులు ఉండగా 991ఖాళీలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు.కామారెడ్డిలో 1,119 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

స్కూళ్లకు చేరని పుస్తకాలు, యూనిఫామ్స్

ఉమ్మడి మెదక్ జిల్లాలో 3,582 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. సిద్దిపేటలో తొలి విడత మన ఊరు..మన బడి కింద 343 స్కూల్స్ ఎంపిక చేయగా 100 బళ్లలోనే పనులు పూర్తయ్యాయి. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ స్కూళ్లల్లో 1,07,885 విద్యార్థులకు 5.19 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరముండగా 5.13 లక్షల పుస్తకాలు వచ్చాయి. దుస్తులు మాత్రం ఇంకా రాలేదు. ఇప్పటి వరకు బడిబాట కింద జిల్లాలో 5,612 మందిని నమోదు చేయించారు. మెదక్‌లో 97 స్కూల్స్‌లోనే పనులు వంద శాతం పూర్తయ్యాయి. మిగతా స్కూల్స్‌లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 4.60 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరముండగా ఇప్పటికే 3.75 లక్షల పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. సంగారెడ్డిలో 158 స్కూల్స్‌లో పనులు పూర్తయ్యాయి. జిల్లాకు 10.38 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరముండగా ఇప్పటికి 4.32 లక్షల పుస్తకాలు మాత్రమే మండలాలకు చేరాయి. స్కూల్స్ ప్రారంభంలోనే పుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తామని అధికారులు చెప్పినా వరంగల్ జిల్లాలో ఆ ఏర్పాట్లు జరగడం లేదు.

మరమ్మతులకు నోచని పాఠశాలలు

కనీస మరమ్మతులకు నోచని పాఠశాలలూ చాలానే ఉన్నాయి. జిల్లా, పట్టణ కేంద్రాల్లోనూ ఇలాంటి సమస్యలున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ నెంబర్ 1పాఠశాలలో సుమారు 500పైగా విద్యార్థులు ఉన్నారు. బడిలో మౌళిక సదుపాయాలు మాత్రం లేవు. ప్రస్తుతం ఈ పాఠశాలలో కిటికీలు ఊడిపోవడం, బేస్మెంట్ పగుళ్ళు తేలి ప్రమాదకరంగా మారాయి. ఇలా అనేక పాఠశాలలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతుండగా నేటి నుంచి పున:ప్రారంభం కానున్నాయి.

అమరవీరుల స్మారక చిహ్నం పనులు

- పరిశీలించిన మంత్రి వేముల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అమరవీరుల స్మారక చిహ్నం నిర్మాణ పనులను రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. అదే విధంగా నిమ్స్ శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు. హుస్సేన్ సాగర్ తీరాన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం పనులను పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు.

మధ్యప్రదేశ్ బీఆర్ఎస్ సమన్వయకర్తగా బుద్ధసేన్ పటేల్

- సీఎం సమక్షంలో పలువురు చేరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మధ్యప్రదేశ్ రాష్ట్ర బీఆర్ఎస్ సమన్వయకర్తగా బుద్ధసేన్ పటేల్‌ను కేసీఆర్ నియమించారు. ఆదివారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో కేంద్రంలోని సర్కారు తన లక్ష్యాన్ని విస్మరించిందని చెప్పారు. దశ దిశ లేని పరిపాలన దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా మారిందని విమర్శించారు. రానున్న రోజుల్లో చైతన్యమై, పార్టీలను కాకుండా తమ ఆకాంక్షలను గెలిపించుకోవాల్సిన అవసరమున్నదని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో చాంద్వాడా జిల్లా, జున్నార్ దేవ్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే రామ్ దాస్, యికే సర్వజన్ కళ్యాణ్ పార్టీ జాతీయ అధ్యక్షులు సంజయ్ యాదవ్, గోండ్వానా పార్టీ అధ్యక్షులు శోభారామ్ బాలావి, భువన్ సింగ్ కోరం, లక్ష్మణ్ మస్కోలేతోపాటు దాదాపు 200 మంది సీనియర్ నాయకులు, ప్రజా సంఘాల నేతలు, మేధావులు తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శంకరన్న దోంగ్డే, మాణిక్ కదమ్, హిమాన్షు తివారీ, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, మెట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జులైలో మహాపడావ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలైలో మహాపడావ్ నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి. ఆదివారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నేత చంద్రయ్య అధ్యక్షతన కార్మిక సంఘాల సన్నాహక సమావేశం జరిగింది. కార్మిక సంఘాల నాయకులు చంద్రశేఖర్, బాల్‌రాజు, భూపాల్, జె. వెంకటేష్, ఈశ్వర్ ప్రసాద్, ప్రసాద్, అనురాధ తదితరులు మాట్లాడుతూ గత తొమ్మిదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మిక హక్కులను హరిస్తున్నదని చెప్పారు. రైల్వే రక్షణ, ఫార్మా, సింగరేణి తదితర సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదన్నారు. ధర పెరుగుదలను అదుపు చేయకపోవడంతో కార్మికుల కొనుగోలు శక్తి క్షీణిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

పెన్షన్ నిధులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వినాశకర చర్యలను ప్రతిఘటిస్తూ దేశ వ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ, సంఘాల అధ్వర్యంలో దేశ వ్యాప్త సమ్మెలు, ధర్నాలు, నిరసనలు జరుగుతున్నాయని చెప్పారు. జూలై, అగస్టు నెలల్లో మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రచార క్యాంపెయిన్‌తోపాటు 48 గంటల రిలే దీక్షలు చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో చంద్రశేఖర్ (ఐఎన్‌టీయూసీ), బాలరాజు, నర్సింహా (ఎఐటీయూసీ), భూపాల్, జె.వెంకటేష్, కె.ఈశ్వర్ రావు (సీఐటీయూ), ఈశ్వర్ ప్రసాద్ (హెచ్ఎంఎస్), ప్రసాద్ (టీఎస్‌యూసీ), అనురాధ (ఐఎఫ్‌టియు) తదితరులు పాల్గొన్నారు.

గుర్తించి మరిచారా..?

బీసీ-ఏ 13 సంచార కులాల ఆవేదన

- రూ.లక్ష ఆర్థిక సాయం పథకం కోసం వేడుకోలు
- ఎమ్మెల్సీ కవిత, బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతులు

నవతెలంగాణ-నవీపేట్

ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యానంతరం సైతం సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్నాయి 13 సంచార జాతులు. విద్య ఉపాధి సామాజిక న్యాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆమడ దూరంలోనే ఉన్న ఈ జాతులను తెలంగాణ రాష్ట్రం వచ్చాక రాష్ట్ర క్యాబినెట్ ఆమోదంతో ప్రభుత్వం బీసీ-ఏ జాబితాలో చేర్చింది. జీవో ఎం.ఎస్.నెం.03 తేదీ 09-09-2020 ప్రకారం బీసీ-ఏలుగా గుర్తించబడిన విద్యార్థులకు విద్యా అవకాశాలు, యువతకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వస్తాయని ఎంతగానో ఆశపడ్డారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం పథకంలో తమ కులాల పేర్లు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

దశాబ్ద కాలంగా జిల్లా కలెక్టర్లతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లు, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులకు వందల విన్నపాలు సమర్పించగా సంచార జాతులను గుర్తించారు. అప్పటి బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, బీసీ కమిషన్ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకొని గుర్తింపునివ్వడంతో ఆ జాతుల వారు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబురాలు చేసుకున్నారు. కులవృత్తులు అంతరించి కార్మికులుగా, ఉపాధి కూలీలుగా, భిక్షాటన చేస్తూ జీవించే ఈ జాతులు రూ.లక్ష ఆర్థిక సాయానికి నిజమైన అర్హులు. రాష్ట్ర ప్రభుత్వం ఈ 13 కులాల ప్రతినిధులతో చర్చించి రూ.లక్ష ఆర్థికసాయం పథకంలో 10 శాతం వాటాను అందిస్తే జీవన ప్రమాణాలు కొంతైనా మెరుగుపడతాయని వివిధ ప్రజాసంఘాల నేతలు భావిస్తున్నారు. ఆ మేరకు ఎమ్మెల్సీ కవితకు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్‌కు వినతిపత్రాలు అందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి ఈ జాతుల వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇవే ఆ పదమూడు కులాలు..

ఓడ్, అద్దపు వారు, బైలు కమ్మర (గిసాడి), శ్రీ క్షత్రియ రామ జోగి, బాగోతుల, ఏనుటి, గంజికూటివారు, గౌడ జెట్టి, కాకి పడగల, పటంవారు, తెరచీరాల, సన్నాయిల, తోలుబొమ్మలాట వారు (బొప్పల) మొదలగునవి.

ప్రభుత్వం కట్టుబడి ఉండాలి : జాదవ్ శరత్, ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నిజామాబాద్



అట్టడుగు స్థాయిలో ఉన్న సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల గెలుపోటములలో సంచార జాతుల ఓట్లే కీలకంగా మారనున్నాయి. తమ సంక్షేమాన్ని పట్టించుకోని పార్టీలను ఈ ఎన్నికల్లో ఐక్యంగా ఓడిస్తాం..

సంచార కులాలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలి :కొంగల రాంప్రసాద్, శ్రీక్షత్రియ రామజోగి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీసీ కులాలకు ఆర్థిక సహకారం అందించడం సంతోషకరం. సంచార జాతులకు సైతం ఆర్థిక స్వావలంబన కల్పిస్తే ఈ కులాలు తెలంగాణ ప్రభుత్వానికి ఎల్లవేళలా రుణపడి ఉంటాయి. ఈ కులాలను ఎంబీసీలలో చేర్చి రుణ సహకారం, ఆత్మగౌరవ భవనాలను నిర్మించి ఆత్మ గౌరవాన్ని పెంపొందించేలా కృషి చేయాలి.

13 సంచార జాతి కులాల అభివృద్ధికి కృషి చేయాలి : చవాన్ మోహన్, బైలు కమ్మర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 13 కొత్త కులాల రాష్ట్ర అధ్యక్షులు, చేవెళ్ల

దశాబ్ద కాలం పోరాటం చేసి గుర్తింపు పొందిన 13 సంచార జాతి కులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలి. విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధితోపాటు ఆత్మగౌరవ భవనాలను నిర్మించి.. ఏడు దశాబ్దాల వెనుకబాటు నుంచి బయట పడేందుకు మార్గదర్శనం చేస్తే ఈ కులాల భవిష్యత్తుకు బాట వేసినట్టవుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి సంచార జాతుల సంక్షేమానికి కృషి చేయాలి.



ఊరికి దారేదీ..

అనేక పల్లెలకు రోడ్లు కరువు | వాగులు వంకలు దాటి గూటికి..

- ప్రాణాలు పణంగా పెట్టి ప్రయాణం
- అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రులకూ వెళ్లలేని స్థితి
- సమయానికి చేరక ప్రాణం కోల్పోతున్న గిరిజనం
- ఏండ్లు గడుస్తున్నా ఏజెన్సీలో కనిపించని పురోగతి




నవతెలంగాణ-
ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గాదిగూడ మండలంలోని కొత్తపెల్లి నుంచి మారేగావ్, కునికాసా, కుండి, పిప్రి తదితర గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. ప్రతి ఏటా వర్షాకాలంలో వాగులు దాటేందుకు జనం ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి ఆస్పత్రులకు చేరుకోలేక పలువురు గర్భిణులు మృతిచెందిన సంఘటనలున్నాయి.

ఉట్నూర్ మండలం బీర్సాయిపేట నుంచి అల్లంపల్లి గ్రామాల మధ్యలో అటవీ ప్రాంతంలో ధర్మాజీపేటకు వెళ్లే దారి ఇది. దట్టమైన అడవి గుండా వెళ్లే ఈ మార్గం సక్రమంగా లేకపోవడంతో అటువైపు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఈ మట్టి రోడ్డు బురదమయంగా కావడంతో బయటి ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది.

నేరడిగొండ మండలానికి 20కి.మీ దూరంలో ఉన్న పీచర వరకు సరైన దారి లేదు. ఈ దారి మధ్యలో సుమారు 8గ్రామాల వరకు ఉంటాయి. మొరం రోడ్డు మాత్రమే ఉండటం.. దట్టమైన అడవి గుండా ప్రయాణం చేయాల్సి రావడంతో అటు వైపున వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో పలుచోట్ల మొరం రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు నిలిపోతాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో వివిధ గ్రామాల ప్రజలు దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక పల్లెలు ఇప్పటికీ కనీస రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏండ్లు గడిచినా ఇప్పటికీ మారుమూల ప్రజలు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. అడవుల జిల్లాగా పేరుగాంచిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇప్పటికీ అనేక గ్రామాలకు సులభతర మార్గాలు లేవు. ఒక ఊరి నుంచి మరో పల్లెకు వెళ్లాలంటే కాలినడకనే దిక్కు. మట్టి రోడ్లు, రాళ్లరప్పల మధ్య కొన్ని కిలోమీటర్ల దూరం వెళితే కానీ వాహన సౌకర్యం లభించని పరిస్థితి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కొన్ని పల్లెలకు రోడ్లువేసి దారి సౌకర్యం కల్పించినప్పటికీ ఇంకా అనేక పల్లెలు దారి సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నాయి. సంక్షేమం మాట చెబుతున్న పాలకులు మౌలిక వసతులపై మాత్రం దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గతంలో 866గ్రామ పంచాయతీలు ఉండగా రాష్ట్ర ఆవిర్భావ అనంతరం పంచాయతీల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 2వేల గ్రామాలకు పైగా ఉండగా ఇందులో అధికంగా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నాయి. ఇప్పటికీ అనేక పల్లెలు అటవీ ప్రాంతంలో ఉండటంతో వాటికి కనీస రోడ్డు సౌకర్యం లేదు. అనేక గ్రామాలు పంచాయతీలుగా రూపాంతరం చెందినా దారి సౌకర్యాలు మాత్రం మెరుగుపడటం లేదు. ఇప్పటికీ ఆ గ్రామాల ప్రజలు మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాలకు నిత్యావసర సరకుల కోసం వెళ్లాలంటే కాలిబాటనే అనుసరిస్తున్నారు. రాళ్లరప్పలు దాటుతూ..కొండలు ఎక్కి..దిగుతూ గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. ఆయా గ్రామాలకు రోడ్డు లేకపోవడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉండటం కారణంగా కాలిబాటతోనే ఆయా ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి రూ.394కోట్లు మంజూరు చేస్తామని ప్రకటన చేసింది. కానీ ఇందులో ఎలాంటి పురోగతీ కనిపించడం లేదు.

వర్షాకాలంలో చాలా దుర్భరం..!

వర్షాకాలం వచ్చిందంటే ఏజెన్సీ ప్రాంతవాసుల్లో భయం మొదలవుతుంది. ఆయా గ్రామాలకు వెళ్లాలంటే కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడం..మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు దాటడం వారికి కత్తిమీది సాములా మారుతుంది. ప్రతి ఏటా వాగుల్లో కొట్టుకుపోయి మృతి చెందుతున్న ఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా మట్టి రోడ్లు, రాళ్లరప్పలు ఉండటంతో అంబులెన్సులు కూడా చాలా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. దీంతో రోడ్డు సౌకర్యం ఉన్న ప్రాంతాల వరకు వచ్చి ఆగిపోతుంటాయి. ఈ క్రమంలో గర్భిణులు, అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రులకు వెళ్లేవారికి అవస్థలు తప్పడం లేదు. సరైన సమయానికి వైద్యం అందక పలువురు ప్రాణం కోల్పోయిన సందర్భాలున్నాయి. వైద్య బృందాలు సైతం అక్కడికి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాగులు పొంగిపొర్లి ప్రవహిస్తున్న సమయంలో గర్భిణులను మంచంపై మోసుకొస్తూ వాగులు దాటించాల్సి ఉంటుంది. వరదలు వస్తే అనేక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడం ఇక్కడ సాధారణం.



ఏజెన్సీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి



అనేక ఆదివాసీ గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఆస్పత్రికి వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఐటీడీఏకు ప్రభుత్వం నుంచి రూ.కోట్లాది నిధులు బడ్జెట్ వస్తున్నా మారుమూల పల్లెలకు సదుపాయాలు కల్పించడం లేదు. ఎలాంటి అభివృద్ధి ఫలాలు ఆదివాసులకు అందడం లేదు. పాలకులు, అధికారులు దృష్టిసారించి దారి లేని పల్లెలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

పూసం సచిన్, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అవయవదానంలో తెలంగాణ నెంబర్ వన్ : మంత్రి హరీశ్

- 'లిటిల్ స్టార్స్ అండ్ షీ' ప్రయివేట్ ఆస్పత్రి ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిటి ఆయోగ్ నివేదిక ప్రకారం వైద్య రంగంలో అవయవదానంలో దేశంలో తెలంగాణ నెంబర్ వన్ అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. అలాగే హెల్త్ హబ్‌గా తెలంగాణ రాష్ట్రం ఉందని, గ్లోబల్ సిటీగా హైదరాబాద్ ఎదిగిందని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో 'లిటిల్ స్టార్స్ అండ్ షీ' ప్రయివేటు ఆస్పత్రిని ప్రముఖ సినీ దర్శకులు ఎస్-ఎస్ రాజమౌళితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో రాష్ట్రం గణనీయ పురోగతి సాధిస్తోందన్నారు. సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్‌లను గాంధీ, నిమ్స్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. వచ్చే నెలలో గాంధీ ఆస్పత్రిలో సేవలు ప్రారంభం కానున్నాయన్నారు. అలాగే త్వరలోనే 10 వేల పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తెలిపారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేశారని సినీ దర్శకులు రాజమౌళిని మంత్రి అభినందించారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో పేషెంట్ కేర్, సెక్యూరిటీ, ఇతర సేవలకు సంబంధించిన వ్యయాలను భరించేందుకు రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సతీష్, స్థానిక కార్పొరేటర్ మన్నే కవిత గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో.. కొడంగల్ ఎమ్మెల్యేపై కేసు నమోదు



నవతెలంగాణ - బంజారాహిల్స్

కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భూ వ్యవహారం విషయంలో ఇంద్రపాల్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కేసును ఫిలింనగర్ పోలీసులకు బదిలీ చేశారు. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. 2018లో ఫిలింనగర్ పరిధిలోని ఉప్పరపల్లిలో ఓ స్థలం కొనుగోలు చేసేందుకు సామ ఇంద్రపాల్ ప్రయత్నించారు. అయితే ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి ఆయనకు మధ్యవర్తులుగా పరిచయమయ్యారు. మరో వ్యక్తితో కలిసి రూ.3.65 కోట్లకు భూమి అమ్ముతామన్నారు. ఇందుకోసం కమీషన్ ఇవ్వాలని కోరగా ఇంద్రపాల్ సైతం అంగీకరించాడు. ఈ మేరకు అదే ఏడాది మేలో రూ.90 లక్షలు చెల్లించాడు. అనంతరం విడతల వారీగా మొత్తం రూ.3.05 కోట్లు ముట్టజెప్పాడు. మిగతా రూ.60 లక్షల కోసం లోన్‌కు అప్లై చేశానని.. అది రాగానే చెల్లిస్తానని చెప్పాడు. అయితే అది ఆలస్యం అవుతోందని ఎమ్మెల్యే తరఫు అనుచరులు ఇంద్రపాల్‌పై బెదిరింపులకు దిగారు. ఓ గదిలో అతన్ని ఉంచి టార్చర్ చేసినట్టు బాధితుడి ఫిర్యాదులో పేర్కొన్నాడు. వారి బారి నుంచి తప్పించుకొని ఇంద్రపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలా వివిధ మార్గాల్లో తరచూ తనను బెదిరిస్తున్నా పోలీసులు పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. అనంతరం ఇంద్రపాల్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకే బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో పట్నం నరేంద్రరెడ్డి, రాకేశ్‌రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఈ కేసును ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

తొమ్మిదేండ్లు గడిచినా ఆర్టీసీ కార్మికుల కష్టాలు పోలేదు

- తక్షణమే వారి సమస్యలు పరిష్కరించండి : సీఎం కేసీఆర్‌కు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ లేఖ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తొమ్మిదేండ్ల పాలనలో ఆర్టీసీ కార్మికుల కష్టాలు తీరలేదని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. ఈ ఎన్నికల ఏడాదిలో కేవలం హామీల పేరుతో మరొకసారి ఆర్టీసీ ఉద్యోగులను మోసం చేసే ప్రయత్నం చేయకుండా ప్రగతి భవన్ వేదికగా ఇచ్చిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాల కోరారు. ఆర్టీసీలో ఖాళీలు వేల సంఖ్యలో ఉన్నప్పటికీ ఎందుకు నియామకాలు చేపట్టలేదో తెలపాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల్లో ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తానంటూ చెప్పి ఏండ్లు గడిచినా ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. పీఎఫ్, సీసీఎస్ బకాయిలు పేరుకుపోతున్నప్పటికీ ఈ నిధులను విడుదల చేయడంలో సీఎంతోసహా అధికారులు సైతం శ్రద్ధ చూపడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉచిత బస్సు పాసులు, ఉద్యోగుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య సదుపాయం, ఉద్యోగులకు గృహ నిర్మాణం హామీలు విస్మరించారని తెలిపారు. స్వరాష్ట్ర సాధన కోసం యుద్ధంలో తమ వీరత్వాన్ని చూపిన ఆర్టీసీ కార్మికుల త్యాగాలను గుర్తించి వారిని ఆదుకోవాలనీ, వారి సమస్యలను తీర్చి, డిమాండ్లను నెరవేర్చి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాదర్బార్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు అర్థరహితం
టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్

ప్రజా దర్బార్ ప్రచార ఆర్భాటమంటూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని టీపీసీసీ ఉపాధ్యక్షులు జి నిరంజన్ చెప్పారు. ఆయన అవివేకానికి, అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేటీఆర్ దుందుడుకు తనంతో మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు. ప్రజాదర్బార్‌లో ఎంతో మంది మేధావులు, వివిధ రంగాలలోని నిష్ణాతులు తమ సూచనలు, సలహాలు సీఎంకు ఇచ్చే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు.

స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలి

- రైతులకు పంట నష్టపరిహారం అందించాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్, సాగర్



నవతెలంగాణ-నల్లబెల్లి

కేంద్ర ప్రభుత్వం రైతు పంటలకు 8వ తేదీన ప్రకటించిన మద్దతు ధర కనీసం రైతు ఉత్పత్తి ఖర్చులకు కూడా సరిపోవని, వెంటనే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సాగర్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా సంఘం రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం రెండవ రోజు కొనసాగాయి ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ.. వరి, మొక్కజొన్న, పత్తి ఇతర పంటలకు పెట్టుబడి కూడా రావడం లేదని, రైతు పంటకు కావలసిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, వ్యవసాయ యంత్రాల ధరలు ఎక్కువగా ఉండటంతో తెచ్చిన అప్పులు తీరకుండా ఎక్కువవుతున్నాయన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చుకి 50శాతం అదనంగా కలిపి మద్దతు ధరను నిర్ణయించాలని, దాన్ని కనీస మద్దతు ధరల చట్టంగా చేస్తామని 2014లో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా హామీని అమలు చేయకుంటే జరిగే ఘటనలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్పొరేట్ వ్యవసాయంగా మార్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ సంవత్సరం వ్యవసాయానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్ల రూపాయలు ఇవ్వగా ఇప్పుడు 50వేల కోట్ల రూపాయలను తగ్గించారని విమర్శించారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ నాలుగు సంవత్సరాల ఆరు నెలలు పూర్తయినప్పటికీ చేయలేదన్నారు. గత మార్చిలో అకాల వడగళ్ల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని ప్రకటించినప్పటికీ రూపాయి ఇవ్వలేదని అన్నారు. కౌలు రైతుల చట్టం చేయాలని, పోడు రైతులకు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు.

అనంతరం సాగర్ మాట్లాడుతూ... అశ్వరావుపేటలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14,15,16న నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి సరైన మద్దతు ధర ఇవ్వకపోవడం వల్ల పెట్టుబడి కూడా రాక.. ఏడాదికి 10వేల నుంచి 13వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వంలో రుణ విమోచన చట్టం ఉందని, ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉండకుంటే.. దేశంలోని 500 పైగా ఉండే రైతు సంఘాల ఆధ్వర్యంలో రెండవ దశ ఉద్యమం ప్రారంభిస్తామని, ఇప్పటికే రాష్ట్రంలో జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో సదస్సులు నిర్వహించి పార్లమెంట్ సభ్యులందరికీ వినతి పత్రాలను అందినట్టు తెలిపారు. ఆగస్టు 1 నుంచి 15 వరకు వరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో రైతుల సమస్యలపై పార్టీలకు అతీతంగా ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీహెచ్ రంగయ్య, చిట్టి వెంకన్న, ఈ సంపల్లి బాబు, పుచ్చకాయల కృష్ణారెడ్డి, పోరబోయిన కుమారస్వామి, జిల్లా, మండల నాయకులు, సీఐటీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేను యోగా చేస్తున్నా..మరీ మీరు..?

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

గవర్నర్ తమిళి సై సౌందర రాజన్

- కీర్తిరెడ్డి ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

రెండు రాష్ట్రాలకు గవర్నర్‌గా ఉన్న తాను యోగా చేస్తున్నానని.. మరీ మీరెందుకు చేయరని, అందరూ యోగా చేయాలని తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ తెలిపారు. కీర్తిరెడ్డి ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హెూలిస్టిక్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం హైదరాబాద్‌లోని బోరబండలోని నాట్కో ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఏబీవీ ఫౌండేషన్ చైర్ పర్సన్ కావ్యారెడ్డి, హెూలిస్టిక్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఆలూరి తుషారా హాజరయ్యారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కీర్తిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పేదలకు ఇలాంటి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. లైఫ్ ఈజ్ ఫుల్ ఆఫ్ ఛాలెంజస్ అని.. వాటిని ఎదుర్కొవాలంటే మనందరం ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. తెలంగాణ ప్రజలు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. తన భద్రతా సిబ్బంది ఇక్కడకు రావొద్దని హెచ్చరించినా ఇక్కడ వీధులు ఇరుకు కానీ ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమం గొప్పది అని వచ్చానన్నారు. ప్రతి సంవత్సరం అందరూ విధిగా హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. కీర్తిరెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ జూటూరి కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని తెలిపారు. అనంతరం కావ్యారెడ్డి మాట్లాడుతూ.. మంచి ఆహారపు అలవాట్లు మాత్రమే మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అందరూ యోగా చేయాలని చెప్పారు. జంక్‌ఫుడ్ తినొద్దని, పిల్లలు ఏం తింటున్నారో పెద్దలు గమనించాలని సూచించారు. అనంతరం ప్రధాని మోడీ చేపట్టిన టీబీ ఎరాడికేషన్ కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్తులకు గవర్నర్ చేతుల మీదుగా న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, 2డీఎకో, కంటి పరీక్షలు, బోన్ డెన్సిటీటెస్ట్, గైనకాలజీ, మాతృ సంరక్షణకు సంబంధించిన వివిధ సేవలను వైద్యులు అందించారు. హెల్త్ క్యాంపునకు 300 మందికిపైగా ప్రజలు హాజరయ్యారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో.. ములుగు జెడ్పీ చైర్మెన్ కుసుమ జగదీష్ మృతి

సంతాపం తెలిపిన సీఎం కేసీఆర్, మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి



- నేడు అంతిమయాత్రలో పాల్గొననున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ- ములుగు

ములుగు జిల్లా పరిషత్ చైర్మెన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కుసుమ జగదీష్(47) ఆదివారం హఠాన్మరణం చెందారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో అస్వస్థతకు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే జగదీష్ మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. కాగా, జగదీష్ ఈ ఏడాది ఏప్రిల్ 1న సైతం గుండెపోటుతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆయన భార్య రమాదేవి సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇప్పుడు అదే తరహాలో మరోసారి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో జగదీష్ మృతి చెందారు. మృతుడు జగదీష్‌కు భార్య రమాదేవి, కుమారుడు వెంకట సత్యదేవ్, కూతురు హర చందన, తల్లిదండ్రులు ఉన్నారు. కాగా, నేడు ఉదయం 9 గంటలకు జరిగే ఆయన అంత్యక్రియల్లో మంత్రి కేటీఆర్ పాల్గొననున్నారు.

జగదీష్ కుటుంబానికి అండగా ఉంటాం: సీఎం కేసీఆర్

ములుగు జెడ్పీ చైర్మెన్, కుసుమ జగదీష్ అకాల మరణం పట్ల సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుడిగా నాటి ఉద్యమంలో జగదీష్ పోషించిన చురుకైన పాత్రను, ములుగు జిల్లా పార్టీ అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ చైర్మెన్‌గా జగదీష్ చేసిన సేవలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.




హఠాన్మరణం బాధాకరం : మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి

బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మెన్ కుసుమ జగదీష్ హఠాన్మరణం బాధాకరమని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ అన్నారు. ఆదివారం ములుగులోని జగదీష్ స్వగృహంలో జగదీష్ పార్థివ దేహానికి నివాళులర్పించిన అనంతరం మంత్రులు మాట్లాడారు. నిన్న మొన్నటి వరకు కలివిడిగా తిరిగిన జగదీష్ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ములుగు ప్రాంత అభివృద్ధికి కావాల్సిన నిధుల గురించే అడిగేవారని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో.. మాజీ ఎంపీ సీతారాం నాయక్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్, జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గోవింద్ నాయక్, స్థానిక సర్పంచ్ చంద కుమారస్వామి, తదితరులున్నారు.

నేడు తెలంగాణా రన్

విజయవంతం చేయండి : ప్రభుత్వ ప్రకటన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించనున్న తెలంగాణా రన్ విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్‌లో సోమవారం ఉదయం 6 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని డాక్టర్. బీఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలోని మైదానం 2కే, 4 కే రన్ ఉంటుందనీ, అందులో దాదాపు ఐదువేల మంది రన్నర్లు పాల్గొననున్నట్టు తెలిపింది. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర సీనియర్ అధికారులు పాల్గొంటారు. అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులూ పాల్గొంటారు. ప్రారంభానికి ముందు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, బెలూన్స్ ఎగురవేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ
దశాబ్ది ఉత్సవాలు
2014 - 2023

ప్రభుత్వానికి, ఎన్నెస్పీ అధికారులకు కండ్లు లేవా..?

అస్తవ్యస్తంగా సాగర్ ఎడమ కాలువ కట్టలు

- గండ్లతో పొంచి ఉన్న ప్రమాదం
- నష్టపోతున్న అన్నదాతలు
- ఎడమ కాలువ కట్టలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

నాగార్జునసాగర్ ఎడమకాలువ కట్టలు అస్తవ్యస్తంగా మారినా.. ప్రభుత్వానికి, ఎన్నెస్పీ అధికారులకు కండ్లు కనిపించడం లేదా అని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఇలాపురం, అన్నపురెడ్డిగూడెం గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న ఏడవ కాలువ కట్టలను రైతులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. సుమారు రెండు కిలోమీటర్ల వరకు కాలువల్లో నడిచి రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. లిఫ్టులను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న యాద్గారిపల్లి మేజర్ కాల్వ కట్టను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఎడమకాలువ ఆయకట్టు లైనింగ్ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. కాల్వ ఆధునీకరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదని, కాల్వ మధ్యలో లైనింగ్ పనులు వదిలేశారని చెప్పారు. మిర్యాలగూడ మండలంలోని ఐలపురం, అన్నపురెడ్డిగూడెం కాలువల మధ్యలో సుమారు మూడున్నర కిలోమీటర్ల వరకు లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో కాలువకట్టలు బలహీనంగా మారాయన్నారు. పంటలకు సాగునీరు విడుదల చేసే సమయంలో కాల్వ కట్టలు కోతకు గురై గండ్లు పడే అవకాశం ఏర్పడిందన్నారు. వర్షాకాలం సమయంలో కాలువకు గండ్లు పడి పంట పొలాలు, కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. గతంలో కూడా కాలువకు గండ్లు పడి పంట పొలాలు, కాలనీలు మునిగిపోయాయని, దీనివల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. మరో రెండు నెలలు వానాకాలం సీజన్ రాబోతుందని, బలహీనంగా ఉన్న కాలువకట్టను ఇలాగే వదిలేస్తే ప్రమాదం పొంచి ఉంటుందని చెప్పారు. ఈ రెండు నెలల కాలంలో మిగిలిపోయిన లైనింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లిఫ్టులు పనిచేయకపోవడంతో లిఫ్ట్ రైతులకు నీళ్ల పూర్తిస్థాయిలో అందటం లేదన్నారు. ఎల్ 11, 12, ఎల్13, 14లలో తూములను కిందికి దించాలన్నారు. కాలువ లైనింగ్ పనులు, లైఫ్టులను మరమ్మతులు చేపట్టకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి రాగిరెడ్డి మంగారెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, వేములపల్లి వైస్ఎంపీపీ పాదూరి గోవర్ధన, రైతు సంఘం, సీఐటీయూ జిల్లా నాయకులు, లిఫ్ట్ చైర్మెన్ పూర్ణచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ వార్తలు

18న 'రంగురంగుల కవిత్వం' ఆవిష్కరణ

'రంగురంగుల కవిత్వం' పుస్తకావిష్కరణ ఈ నెల 18న సాయంత్రం 5 గంటలకు గుంటూరులో బృందావన్ గార్డెన్స్ 5వ లైను అన్నమయ్య గ్రంథాల యంలో నిర్వహించనున్నారు. కాత్ర గడ్డ దయానంద్ సభాధ్యక్షతన లంకా సూర్యనారాయణ పుస్తకావిష్కరణ చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొ న్నారు. వివరాలకు 8179273971 నంబరు నందు సంప్రదించవచ్చు.

'సాహితీ కిరణం' కవితల పోటీ

సాహితీ కిరణం, కొసరాజు ఆర్తి అండ్ జాహ్నవి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాధ బాలల అవస్థలు అనే అంశంపై కవితల పోటీ నిర్వహిస్తోంది. ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.3000/-, రూ.2000/-లతో పాటు 5 సమాన బహుమతులుగా ఒక్కొక్క కవితకు రూ.1000 /- అందివ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు జూన్ 30 లోగా ఎడిటర్, సాహితీ కిరణం, ఇంటి నెంబర్ 11-13-154, రోడ్ నెంబర్ 3, అలకాపురి, హైదరాబాద్ 500 102 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9490751681 నంబరు నందు సంప్రదించవచ్చు.

'సోమేపల్లి' చిన్న కథల పోటీ విజేతలు

ఇటీవల 'రమ్యభారతి' ఆధ్వర్యంలో నిర్వహించిన సోమేపల్లి సాహితీ పురస్కారాల చిన్న కథల పోటీల విజేతలను వెలువరించారు. బి.కళాగోపాల్ 'ఆకుపచ్చని పొద్దు', బి.వి.రమణమూర్తి 'విత్తు', మల్లారెడ్డి మురళీమోహన్ 'వైకుంఠపాళి'లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. శింగరాజు శ్రీనివాసరావు 'ఎగిరే ముద్దు', బి.వి.శివ ప్రసాద్ 'వెన్నెల దీపం', కె.వి. లక్ష్మణరావు 'బాధ నుండి బాధ్యత వైపు' (మానేపల్లి), కె.వి. సుమలత 'ఏది దానం-ఎవరు దాతలకు ప్రోత్సాహక పురస్కారాలు లభించాయి.

'చింతలతొవ్వ'కు వెన్నెలసాహితీ పురస్కారం

తుల శ్రీనివాస్ కవితా సంపుటి "చింతల తొవ్వ" వెన్నెల సాహితీ పురస్కారం -2022 కు ఎంపికయ్యింది. త్వరలో సిద్దిపేటలో నిర్వహించబోయే సాహిత్య కార్యక్రమంలో పురస్కార ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

స్వరాష్ట్రంలో సాహిత్య రంగ తీరుతెన్నులు

సాహిత్య రంగంలో ఈ తొమ్మిదేండ్ల కాలంలో జరిగిన అభివృద్ధి ఏమిటి? ఇంకా జరగాల్సినది ఏమున్నది? విస్మరిస్తున్న విషయాలేమిటి? ప్రజా సాహిత్యానికి, ప్రజా కళలకు ఆదరణ పెరిగిందా.. ఏ దారిలో పయనిస్తున్నాము. భవిష్యత్తుకు ప్రణాళిక వేసుకో గలుగుతున్నామా? కొత్తగా రాస్తున్న వారికి ఎలాంటి ప్రోత్సాహం అవసరం!.. వాటిని అందించగలుగుతున్నామా? మొదలైన ప్రశ్నలు, సంశయాలపై ప్రముఖ సాహితీ వేత్తలు, సాహిత్య సంస్థల నిర్వాహకుల అభిప్రాయాలు ఒక సారి పరికిద్దాము..

సేకరణ :ఫీచర్స్ డెస్క్



33 జిల్లాల సాహిత్య చరిత్రలు రాబోతున్నాయి



తెలంగాణ అవతరించి విస్తృత సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చింది. అట్లాగే సాంస్కృతిక సామాజిక స్వేచ్ఛకోసం పోరాడిన రచయితల, సామాజిక, సాంస్కృతిక యోధుల చరిత్ర పాఠాల్లోకి వచ్చింది. ఉద్యమకాలం ఎగిసిన ప్రశ్నలకు రాష్ట్ర అవతరణ తర్వాత సమాధానాలు దొరికాయి. మొత్తం సినీ రంగంలో తెలంగాణ భాష ఫిదా అవుతున్నది. తెలంగాణపాట అస్కార్ అందుకుంది. సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో వందకు పైగా పుస్తకాలు ముద్రించబడ్డాయి. తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర వెలుగు చూసింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలల్లో "మన ఊరు మన చెట్టు" అనే కార్యక్రమం నిర్వహించాము. ఇందులో ఐదు నుండి పది తరగతి విద్యార్థులు లక్షల మంది పాల్గొన్నారు. వెయ్యి కథలతో, 33 జిల్లాలకు సంబంధించి పుస్తకాలు రూపొందుతున్నాయి. 'మెకంజీ కైఫీయత్తులు రాయించెను' అన్నట్టుగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ ఊరు చరిత్రను తామే రాసి ఆధునిక మెకంజీలుగా మారబోతున్నారు. ఈ ప్రాంత చరిత్రను ప్రపంచానికి చెప్పబోతున్నారు. గిరిజనులపై రాసిన కథల సంకలనం 'కేసులా' సంపుటి వెలువరించాం. మహాత్మా జ్యోతిబా, సావిత్రీ బాయిపై దీర్ఘ కవితా సంకలనాలు రాబోతున్నాయి. 33 జిల్లాల సాహిత్య చరిత్రలు రాబోతున్నాయి. అలాగే 125 అడుగులతో స్థాపించబడిన చారిత్రాత్మకమైన అంబేద్కర్ విగ్రహంపై కవితలు సంకనంగా విడుదల కాబోతున్నది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహిత్య ఉత్సవంగా 11వ తేదీన తెలంగాణ కవులతో పెద్దఎత్తున కార్యక్రమం జరుపుకున్నాము. ప్రతి ఏడాది కాళోజి, దాశరథి అవార్డులను ఇస్తున్నాము. అలాగే అకాడమి ఆధ్వర్యంలో 'పునాస' సాహిత్య పత్రిక నడుస్తున్నది. ఇది పాఠశాలల వరకు వెళ్తుంది. మనకున్న సాహిత్యం, సమస్త కళలు ప్రజల కోసం సృజించబడాలనే నేపథ్యం నుంచి తెలంగాణలో వున్న సబ్బండ వర్గాల సాహిత్యాన్ని రికార్డు చేసే పనిని అకాడమీ భుజాలపై వేసుకుంటున్నది.

- జూలూరి గౌరి శంకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు

ఫలాలు - విఫలాలు



ఉమ్మడి రాష్ట్రంలో అవహేళనకు గురైన తెలంగాణ భాషకు స్వరాష్ట్రంలో సముచితమైన గుర్తింపు లభిస్తున్నది. పత్రికల్లో, చానళ్లలో, సాంఘిక మాధ్యమాల్లో స్థానిక పదజాలం వాడుక పెరిగింది. రచయితలు ఆత్మగౌరవ భావనతో స్వేచ్ఛగా తెలంగాణ భాషలో రచనలు చేస్తున్నారు. విలన్లకు, కమెడియన్లకు పరిమితం చేసిన సినీరంగం ఇవాళ హీరోలకు, హీరోయిన్లకు తెలంగాణ భాష వినియోగించడం గొప్పమార్పు. విస్మరణకు గురయిన తెలంగాణ రచయితలకు, కవులకు సమప్రాధాన్యం లభిస్తున్నది. తెలుగు పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ రచయితల కృషి విశేషంగా, రచనలు పాఠాలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం దాశరథి, కాళోజీ పురస్కారాలు నెలకొల్పి ప్రతియేటా నిర్వహిస్తున్నది. ఆవిర్భావ దినోత్సవాల్లో రచయితలకు, పండితులకు విశేష పురస్కారాలు అందజేస్తున్నది. కాళోజి పేరిట వరంగల్‌లో వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటు ఒక పులకింత. తెలంగాణ సాహిత్య అకాడమీ ఏర్పడింది. ప్రపంచ తెలుగు మహాసభలు అంతకు ముందుకంటె భిన్నంగా రచయితలకు కేంద్రంగా నిర్వహించటం ప్రత్యేకం. తెలంగాణ భాషా సాహిత్య సృజనాత్మక రచనా, అవధాన ప్రక్రియలు, ప్రపంచ వ్యాప్తమయ్యాయి. కవి సమ్మేళనాలు, పుస్తక ప్రచురణలు, సత్కారాలు సరికొత్త వాతావరణాన్ని సృష్టించాయి. పదోవత్సర ఉత్సవాల సందర్భంగా చూస్తే పూర్తి చేయవలసిన పనులెన్నో మిగిలి ఉన్నాయి. తెలంగాణ జానపద అకాడమీ ఏర్పాటయినా దాని ఏ అడుగూ ముందు పడలేదు. అధికార భాషా సంఘం తొమ్మిదేళ్ల నుంచి ఏ పనీ ప్రారంభించలేదు. అధికార భాషా చట్టం, తప్పనిసరి తెలుగు చట్టం పని చేయలేకపోతున్నాయి. ముఖ్యమంత్రి ప్రకటించిన బమ్మెర, పాలకుర్తి సాహిత్య కారిడార్ ముందుకు జరుగలేదు. వట్టికోట విగ్రహం, సినారె స్మారక కేంద్రం, తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ రచయితల పేరు, యేటా తెలంగాణ సాహిత్య సభలు, ఐదేండ్లకోసారి ప్రపంచ తెలుగు మహాసభలు ప్రకటనలుగానే ఉండిపోయాయి. అధికార భాషా సంఘం తెలుగు పనులు చేపట్టాలి. తెలంగాణ రచయితల జయంతులు, వర్ధంతుల సందర్భంగా ప్రత్యేక సంచికలు ప్రచురించాలి. అమరుల స్మారక కేంద్రం మాదిరిగా రచయితల స్మారక కేంద్రం, తెలంగాణ సాహిత్య సూచీ గ్రంథాలయం, ప్రకటించిన మల్లినాథసూరి సంస్కృత విశ్వవిద్యాలయం సత్వరం నిర్మించాలి. తెలంగాణ నిఘంటు నిర్మాణం, తెలంగాణ జానపదవృత్తి కళాసాహిత్యాల సేకరణ, ప్రచురణ, పరిరక్షణ పనులు చేపట్టాలి. అకాడమీలకు, విశ్వవిద్యాలయాలకు, గ్రంథాలయాలకు తగినన్ని నిధులు కెటాయించి పనులకు పూనుకోవాలి. తెలంగాణ రచయితల పుస్తకాలు కొనుగోలు చేసి రచయితల్ని, ప్రచురణ సంస్థల్ని ప్రోత్సహించాలి. ముఖ్యమంత్రి ప్రకటించిన భాషా సాహిత్య హామీలు, నిర్మాణాలు, వాటి అమలుకోసం పనులు ప్రారంభించాలి.

- నందిని సిధారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు

యువతకు ప్రోత్సాహం ఇవ్వాలి



తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు. తెలంగాణ సాహిత్య అకాడెమీ ఆరంభంలో ఈ నేల సాహితీ వేత్తల చరిత్రను, సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చారు. సాహితీసభలు, సమావేశాల నిర్వహణ, రవీంద్ర భారతి కేంద్రంగా కొంత పెరిగింది. అయితే కొత్తగా రాస్తున్న యువతకు సరయిన ప్రోత్సాహం, పుస్తకాలు వేయటం జరుగలేదు. కాళోజీ, దాశరథి అవార్డులు ఇస్తున్నారు. కానీ సాహితీకారుల సాహిత్యంపై, జీవితంపై చర్చలు, సెమినార్లు జరపటం లేదు. యువతను ఉత్సాహపరిచే కార్యశాలలూ నిర్వహించటం లేదు. వ్యక్తులుగా, బృందాలుగా, వివిధ సంస్థలూ సాహిత్య కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నారు. తెలంగాణ పారిభాషిక పదకోశం ఇంకా నిర్మించుకోవాల్సే ఉంది. ముఖ్యంగా తెలంగాణ నేల పాటకు పెట్టింది పేరు. పాటకు సంబంధించిన సాహిత్య కళా కార్యక్రమాలుగానీ, ఈ నేలపై పాటల నమోదు కానీ ఇంకా జరగలేదు. పాటలు రాసిన రచయితలను, పాడే వారిని ఉత్సాహపరిచే కార్యక్రమాలు ఏవీ జరుగలేదు. జానపద సాహిత్య సేకరణ, ఆయా కళారూపాలను రికార్డు చేయడం జరగాలి. తెలంగాణ ప్రజాస్వామీకరణ జరగాలంటే పరిపాలనలో తెలుగును తీసుకురావలసి ఉంది. గ్రంథాలయ సంస్థలు రచయితల పుస్తకాలు తీసుకుని ప్రోత్సహించాలి. తెలంగాణ సాహిత్యకారులు వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి, సురవరం ప్రతాపరెడ్డి, సదాశివ, పోతన, రామదాసు, సినారె మొదలైన వారి జన్మ స్థలాలను సాహిత్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. కేంద్ర సాహిత్య అకాడమీలాగా సదస్సులు నిర్వహించాలి. కవులను, రచయితలను అందులో భాగస్వామ్యం చేయాలి. ఈ రాష్ట్ర సాంస్కృతిక, సాహిత్య విధానాన్ని ప్రభుత్వం ప్రకటించాలి. ప్రజా సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావాలి.

- కె.ఆనందాచారి, తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ తీరు మారాలి



సబ్బండ వర్గాలు, సకల జనులు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేండ్లు కావస్తున్నది. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉత్సవాలు జరుపుకుంటుంది, సంతోషం. అయితే ఈ పదేండ్ల కాలంలో తెలంగాణ నడిచొచ్చిన తొవ్వ, చేరాల్సిన గమ్యం గురించి ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరమున్నది. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పుల గురించి కూడా చర్చించుకోవాలి. తెలంగాణ ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేసిన కాళోజీ, దాశరథి పేరిట రాష్ట్రస్థాయి అవార్డులను ఇస్తున్నది. ఇది తెలంగాణ ప్రతిభను గుర్తించడంలో ఒక మైలురాయి. అట్లాగే 2017లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి మన ఖ్యాతిని, గౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేసినాము. అట్లాగే ప్రతి యేటా బుక్‌ఫెయిర్ నిర్వహించుకోవడానికి జాగాను ఫ్రీగా ఇస్తోంది. ఇదంతా సాహిత్యానికి ఇస్తున్న ప్రోత్సాహంగానే చూడాలి. దీనిని ఆహ్వానించాల్సిందే. ఇదే సందర్భంలో తెలంగాణ నుంచి కేవలం ఇద్దరు, అదీ కేవలం బ్రాహ్మణ సామాజిక వర్గం వారే గొప్ప వారు అన్నట్టుగా పై ఇద్దరి పేరిట మాత్రమే అవార్డు ఇవ్వడం తప్పు. తెలంగాణ సమాజం గుర్తించాల్సిన మరో గొప్ప వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి. ఆయన పేరిట ఒక్క అవార్డు కూడా లేదు. అట్లాగే గతంలో తెలుగు యూనివర్సిటీకి ఆయన పేరు పెడతామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. దేశం గర్వించే ఉద్యమకారుడు, పత్రికా సంపాదకుడు, సాహితీవేత్త భాగ్యరెడ్డి వర్మ. సామల సదాశివ లాంటి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీతలకు తెలంగాణ ప్రభుత్వంలో ఏ మాత్రం గుర్తింపు లేదు. అట్లాగే తెలంగాణ ప్రభుత్వం ఉర్దూ సాహిత్యానికి కూడా గుర్తింపు తీసుకు రావాలి. ఆళ్వారుస్వామి, సురవరం ప్రతాపరెడ్డి, సుద్దాల హనుమంతు, మఖ్దూమ్, భాగ్యరెడ్డి వర్మ, అరిగె రామస్వామి, కపిలవాయి లింగమూర్తి, అలిశెట్టి ప్రభాకర్, బోయ జంగయ్య ఇంకా ఎనుకటి నుంచి తెలంగాణ సాహిత్యాన్ని సుసంపన్నం చేసినవారి సమగ్ర రచనలు సంపుటాలుగా వెలువడాల్సిన అవసరమున్నది. కవులు, రచయితలకు రాష్ట్రం ఏర్పాటైన కొత్తలో ఇచ్చిన అవార్డులు సైతం ఇప్పుడు ఆపేసింద్రు. యువ సాహితీవేత్తలను గుర్తించి, ప్రోత్సహించాలి. అట్లాగే కళలు, సాంస్కృతిక రంగంలో పనిచేసేవారికి ప్రభుత్వమే స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ప్రోత్సహించాలి. అంతిమంగా మన సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి గ్రంథాలయాలను, మ్యూజియంలను, చారిత్రక ప్రదేశాలను కాపాడు కోవాలి. సాహిత్యం ఉద్యమాలనే కాదు, విలువలను కూడా ప్రోది చేస్తుంది. దీనిని ఆర్థిక దృక్కోణంలో చూడరాదు. ఈ తోడ్పాటు మన సమాజం సరైన దిశలో పయనించడానికి తోడ్పడతుంది. ఈ ప్రయాణానికి ప్రభుత్వం ఇకనైనా మరింతగా తోడ్పాటునందించాలి.

- డా. సంగిశెట్టి శ్రీనివాస్, సాహితీవేత్త

కవుల పాత్ర కీలకం



సమాజ నిర్మితిలో ప్రముఖపాత్ర పోషించింది కళాకారులు, కార్మికులు, రైతులే. అందునా మన రాష్ట్ర ఆవిర్భావంలో ప్రముఖ పాత్ర పోషించింది కవులే. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రతి నేత నోట పలికింది తెలంగాణ ప్రజలని చైతన్య పరిచి ఉత్తేజితం చేసిన తెలుగు కవితలే. ఉద్యమాన్ని చల్లారనీకుండా ఎప్పటికప్పుడు గజ్జగట్టిన ప్రజాకవులు చేసిన ధూమ్ ధామ్ మర్చిపోలేనిది. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న దాశరథి, 'పల్లె కన్నీరు పెడుతుందో' అన్న గోరటి వెంకన్న, రావెల పాటలు కవులని నిత్య చైతన్య పరిచాయి. ఇక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కవుల పాత్ర మరింత పెరిగింది. పునర్నిర్మాణంలోనూ తమదైన గణనీయ పాత్ర పోషించారు. దాన్ని అంది పుచ్చుకుంది అక్షరయాన్. మహిళా సాహిత్యవేత్తలకు అ,ఆ లు చూపిస్తూ (అంటే అవకాశాల కల్పనా, ఆర్థిక స్వావలంబన) 4 ఏడాదుల్లోనే దూసుకు వెళ్ళిపోయింది. సమాజానికి అవసరమైన ప్రతి అంశాన్ని అంది పుచ్చుకుని తమదైన ముందు చూపుతో సమాజానికి కొత్త మార్గాన్ని చూపించారు. తెలంగాణ ప్రపంచ విత్తన భాండాగారంగా మారిన నేపథ్యంలో సీడ్ సర్టిఫికేషన్ వారికి రైతుల ఆర్థిక ప్రయోజనాల కోసం విత్తన ఉత్పత్తి మీద అవగానే కల్పిస్తూ రాసిన విత్తనం చెప్పిన కథలు, భీజస్వరాలు రెండు పుస్తకాలూ అక్షరయాన్ సౌజన్యంతో ప్రచురింపబడ్డవే. తెలుగు భాషాభివృద్ధి కోసం చేసిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం కార్యక్రమాలు, సరళ శతకాలు అలా వచ్చినవే. రానున్న కాలంలో ఇవ్వబోతున్న బండారు అచ్చమాంబ, తరిగొండ వెంగమాంబ, కుప్పాంబిక, రంగాజమ్మ పురస్కారాలు మహిళా సాహిత్యకారుల్లో చైతన్యం నింపేవే.

- అయినంపూడి శ్రీలక్ష్మి, అక్షరయాన్ వ్యవస్థాపకురాలు

జరిగిన కృషి కంటే జరగాల్సిందే ఎక్కువ



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక ఎంతో సాహిత్య కృషి జరిగింది. 'తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ' వృక్షం ఉద్భవించి కవి సమ్మేళనాలు నిర్వహించింది. ఈ కవితలతో తొలిపొద్దు, మట్టి ముద్ర, కొత్తసాలు మొదలైన బృహత్ కవితా సంకలనాలురూపుదిద్దుకున్నాయి. భాషా, సాహిత్య, సంస్కృతుల ప్రదర్శన, పుస్తకాల రూపంలో నిక్షిప్తం చేయడమూ జరుగుతున్నది. తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆవిర్భావంతో తెలంగాణ ప్రాధాన్యతను తెలిపే గ్రంథాలతో పాటు ప్రముఖ సాహితీవేత్తల రచనలు పునర్ముద్రణకు నోచుకున్నె. తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ తెలంగాణ సాహిత్యంపై విశేష కార్యక్రమాల్ని, ప్రత్యేక సంచికల్ని రూపొందించాయి. తెలంగాణ సారస్వత పరిషత్తు, జాగృతి, తెలంగాణ అరసం, తెలంగాణ సాహితీ వంటి పలు సంస్థలు సాహిత్యాన్ని, సాహిత్యకారుల్ని గుర్తుచేసుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాల్ని నిరంతరం నిర్వస్తున్నవి. తెలంగాణ యాసలో తెలంగాణ ప్రముఖులు, యాత్రా స్థలాలను, సంస్కృతిని తెలిపే పాఠాలను పొందుపరచడంతో ఈ ప్రాంతం గురించి మరింత తెలుసుకుంటున్నాం. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వల్ల మాత్రమే తెలుగులో 'ఆదికవి' సహేతుకంగా నిరూపితమైంది. అనేక ప్రక్రియలు తెలంగాణా నుంచే ఆరంభమైనట్లు రుజువైనై. పోతన జన్మ స్థలం నిర్ధారణ అయ్యింది. ఇంకా జరగాల్సింది ముఖ్యంగా బాల్యం నుంచే సాహిత్య పఠనాసక్తి పెంపొందించాలి. తెలంగాణ సాహిత్యంపై పోటీలను నిర్వహించి, ఎంపికైన వాటిని ముద్రించాలి. తెలంగాణ భాషా, సాహిత్యాలపై విశ్వ విద్యాలయాల్లో జరిగిన పరిశోధనలను ప్రభుత్వమే ముద్రించాలి. తెలుగులోనే పోటీ పరీక్షలన్నిటిని నిర్వహిస్తే, ఉద్యోగార్థులు ఏ మాధ్యమంలో చదివినా, తెలుగును అనివార్యంగా నేరుస్తారు ఆంగ్లంలాగా. కాబట్టి ఏ ప్రభుత్వాలు పాలనలోకి వచ్చినా చిత్తశుద్ధితో కృషిచేస్తే తెలుగు మరింత వెలుగుతుంది.

- డా. రాపోలు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అరసం.

బహుజన స్ఫూర్తిదాతలను గుర్తించాలి



తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డంలో తెలంగాణ సాహిత్యం, కళలు, సాంస్కృతిక రంగాల పాత్ర ప్రముఖమైంది. రాష్ట్రం వచ్చాక ఈ రంగాలు స్థానికతను సంతరించుకున్నాయి అనేది చెప్పుకోదగిన అభివృద్ధి. తెలంగాణ సాహిత్యం, కళలు, సంస్కృతి రంగాలు విశిష్టమైనవి, ప్రత్యేకమైనవి. తెలంగాణ ప్రభుత్వం ఈ రంగాలకు సంబంధించిన అభివృద్ధి, ప్రాధాన్యతల్లో సామాజిక స్పష్టత కొరవడింది. ఆధిపత్య కులాల సాహిత్య కళా సాంస్కృతిక పాలసీ విధానంగా వున్నది. తెలంగాణ ప్రభుత్వం జరుపుతున్న జయంతులు, వర్ధంతులు, అవార్డులకు సంబంధించిన తేజోమూర్తుల, వైతాళికుల జాబితా చూసినట్లయితే ఇది మనకు స్పష్టంగా తెలుస్తుంది. తెలంగాణ సాహిత్యం కళా సంస్కృతులు అంటేనే బహుజన శ్రమ కులాల కళలు, సాహిత్య, సాంస్కృతిక రంగాల సంపద. జానపద కళా సంపదలకు జీవజలం తెలంగాణ. ఇట్లాంటి తెలంగాణ అస్తిత్వానికి అణగారిన జన సమూహాలకు చెందిన కళా సాహిత్య సాంస్కృతిక విధాన కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వానికి వుండాలి. తెలంగాణలో ఎంతోమంది బహుజన స్ఫూర్తిదాతలు సామాజిక కళా, సాహిత్య సాంస్కృతిక రంగాలను ప్రభావితం చేసిన మహోన్నతులు ఉన్నారు. హంస అవార్డ్ గ్రహీత చిందు ఎల్లమ్మ, డక్కలి రాయక్క, డక్కలి బాలయ్య, గడ్డం సమ్మయ్య, దున్న ఇద్దాసు, డాక్టర్ బోయ జంగయ్య, మహేంద్ర నాథ్, సదాలక్ష్మి, పద్మశ్రీ టివి నారాయణ, మిద్దెరాములు, సర్వాయి పాపన్నలాంటి వాళ్ళు ఎంతోమంది ఉన్నారు. వీరిని, వీరి సామాజిక స్పృహని, సామాజిక కళా సేవను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాల్సిన అవసరం, బాధ్యత ఉంది

- జూపాక సుభద్ర, సాహితీవేత్త

మరింత శ్రమించాలి



తెలంగాణ సాహిత్య అకాడమీ ఏర్పడటమంటేనే తెలంగాణ అస్తిత్వాన్ని పరిరక్షించడం. సాహిత్యాన్నీ, భాషనూ విస్తరించడంలో శ్రమిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అకాడమీ రావడం రావడమే ప్రపంచ తెలుగు మహాసభల్ని నిర్వహించింది. ప్రత్యేకతతో కూడిన సాహిత్య సభల్ని నెలనెలా నిర్వహించింది. పుస్తక ప్రచురణల వల్ల అందుబాటులో లేని కొన్ని పుస్తకాలను ప్రచురించి మెప్పు పొందింది. తెలంగాణ సాహిత్య అకాడమీ మరిన్ని పనులు చేయాలని మనవి. సంస్కృతం నుండి నన్నయ భారతాన్ని అనువాదం చేసిన విషయం నిరక్షరాస్యులు కూడా చెప్పగలరు. తెలంగాణ నుండి పంపడు నన్నయకు ముందే కన్నడంలో పంప భారతం రచించాడు. అది మనకు మొదటి గ్రంథం. దాన్ని తెలుగులోకి అనువాదం చేయించాలి. ఇప్పటి వరకు మనవైన పురాణ, ఇతిహాస, కావ్య ప్రబంధాలకు అర్థతాత్పర్యాలు లేవు. కొన్నిటికి ఉన్నాయి. ఉన్న వాటిని వదిలేసి లేని వాటికి సి.పి.బ్రౌన్‌లాగా కొందరిని నియమించి అర్థ తాత్పర్యాలు రాయించటం చేయాలి. సూర్య రాయాంధ్ర నిఘంటువులాగా ఒక ప్రత్యేక నిఘంటువు రావాలి. తెలంగాణ భాషలోని నుడికారాలను, నానార్థాలను, ప్రకృతి వికృతులను తయారు చేయిచడం మంచిది. తెలంగాణ సాహిత్య చరిత్రకు ఉదాహరణగా ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర లాగా రావాలి. ఇది వరకు సాహిత్య అకాడమీ అవార్డులు ఇచ్చేది. ప్రస్తుతం తెలుగు విశ్వవిద్యాలయానికి ఇది అకాడమీనే వల్ల ప్రతి యేటా వస్తుంది. పూర్వంలాగా ఇవ్వాలి. వివిధ సాహిత్య ప్రక్రియలలో ప్రతియేటా అవార్డులిచ్చి సాహిత్య అకాడమీ ప్రోత్సహించాలి. అనువాదం విషయంలో తెలంగాణ వెనుకబడి ఉంది. ఇతర భాషల నుండి అనువదించుకున్నంతగా మన భాషా సాహిత్యం వివిధ భాషల్లోకి పోయేట్లు చూడాలి. కేంద్ర సాహిత్య అకాడమీలాగా మన సాహితీ వేత్తలపైన ప్రొఫైల్స్ రాయించి అచ్చువేయాలి.

- డా. నాళేశ్వరం శంకరం, రాష్ట్ర అధ్యక్షులు, తెరసం

శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలి



తెలంగాణ ఉద్యమాలను, సాహిత్యాన్ని వేరు చేసి చూడలేము. తెలంగాణ గుండెధ్వని సమాజ చలనానికి దారిదీపంగా నిలిచింది సాహిత్యం. రాష్ట్రం సాధించే వరకు ఉద్యమంతో పెనవేసుకోవడంలో తన వంతు పాత్ర పోషించింది. రాష్ట్రం సిద్ధించి తొమ్మిది వసంతాలు పూర్తై, దశాబ్ది సంబురాలు చేసుకుంటున్నాము. భాషా సాహిత్యాల పట్ల జరగాల్సిన గుణాత్మకమైన మార్పును సమీక్షించుకో వాల్సిన సమయమిది. తెలంగాణ భాష - సాహిత్యాల పునర్వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పాఠ్య పుస్తకాల్లో మన భాష, సాహితీవేత్తలకు చోటు దక్కినా అది పాక్షికమైన సంతోషాన్నిచ్చేదే. ఇంకా చాలా జరగాలి. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, తాండాల గడపల వరకూ సాహిత్యాన్ని చేర్చుతామనడం, గ్రామ చరిత్రలు రాయించడం అభినందనీయం. ప్రతి జిల్లా కేంద్రంలోనూ ప్రాత: స్మరణీయ సాహితీవేత్త పేరున ఒక స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. అన్ని జిల్లాల ప్రజల పలుకుబడులతో సమగ్ర నిఘంటు నిర్మాణం జరగాలి. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రామసింహ కవికి ప్రజలు కట్టిన గుడిని ధ్వంసం చేశారు. దాన్ని తిరిగి నిర్మించాలి. ప్రతి ఏటా లైబ్రరీల కోసం అందరు కవుల పుస్తకాలు కొనాలి. సాహిత్య అకాడమీ, అధికార భాషా సంఘాలకు పూర్తి స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలి. అతి ముఖ్యమైనది, ఈ మధ్య ఇద్దరు కవులు జంగ వీరయ్య, సంద బాబుల మరణం సాహితీ వేత్తలను కలచి వేసింది. కవుల సంక్షేమం గురించి ప్రభుత్వం పట్టించుకోవాలి. చివరి దశలో మందులు కూడా కొనుక్కోలేని దీనస్థితిని మిగిల్చినపుడు తెరవే, మరికొన్ని సాహితీ సంస్థలే ఆదుకున్నాయి. కావున సాహితీ వేత్తల కోసం ఒక శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలి. వారు చనిపోయి కుటుంబం వీధిన పడకుండా వారి కుటుంబానికి ఉపాధి కల్పించాలి.

- గాజోజు నాగభూషణం, అధ్యక్షులు, తెరవే

మరింత శ్రద్ధ పెట్టాలి



తెలంగాణ వచ్చి పదేండ్లు అవుతున్న సందర్భంగా అభినందనలు. ఈ పదేండ్లలో అనేక రంగాలలో తన సత్తాను చాటుకుంది. ఇంకా అనేక రంగాలలో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉంది. అనేక మంది ఔత్సాహికులు తెలంగాణ గురించి పరిశోధనలు చేస్తున్నారు. అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తెలంగాణ వచ్చిన తర్వాత నియామకాల విషయంలో తమకు న్యాయం జరుగుతుందని భావించిన విద్యార్థులకు కొంత నిరుత్సాహం వుంది. సాహిత్య పరంగా చూస్తే కవిత్వం, కథలు, కళలు ఇలా అనేక సాహిత్య ప్రక్రియల్లోకి ఉత్సాహంగా ఎంతో మంది కొత్త వారు ప్రవేశించారు. అయితే వారు ముద్రించుకుంటున్న పుస్తకాలను గ్రంథాలయాలు ప్రోత్సహించకపోవడం బాధాకరం. తెలంగాణ వస్తే పుస్తక పఠనం పెరుగుతుందని, మిగతా రాష్ట్రాల మాదిరిగా మన దగ్గర కూడా గ్రంథాలయాలు మెరుగుపడతాయని, లైబ్రరీలకు ఒక పరిమితి పెట్టి ఎంపిక చేసిన పుస్తకాలు కొంటారని ఆశించారు. కానీ ఇవేవీ జరగలేదు. ఈ విషయంలో కూడా సాహిత్యకారుల్లో చాలా అసంతృప్తి ఉన్న మాట వాస్తవం. తెలంగాణ సాధించి అనేక మంది త్యాగాలతో సాధించిన నీటి పారుదల, ప్రాజెక్టులు, ఊరూర భగీరథ... ఇవన్నీ చాలా మెరుగైన కార్యక్రమాలు. కానీ సాహిత్య రంగానికి మాత్రం ఆశించినంతగా ప్రోత్సహకాలు లభించడం లేదు. ఈ సందర్భంగానైనా ప్రభుత్వాలు దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

- యాకుబ్, కవిసంగమం వ్యవస్థాపకులు

మహిళా సాహితీ కారుల చరిత్ర రికార్డు చేయాలి



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అందరికీ అభినందనలు. ప్రతి ఏడాది జిల్లాల వారి సంకలనాలు అంటే కథ, కవిత, వ్యాసం, సాహిత్య విమర్శ సంకలనాలు వెలువరించాలి. అందుకు గ్రామాల వారీగా మరుగున పడిన సాహితీవేత్తలు, వారి రచనల గురించి ప్రతి ఏటా రికార్డు చేయాలి. సాహితీకారులు నిర్భయంగా ప్రజల పక్షం నిలిచి రచనలు చేసే స్వేచ్ఛను కలిగించాలి. ముఖ్యంగా తెలంగాణ గడ్డపై పుట్టిన మహిళా సాహితీకారుల గురించి చరిత్రను పరిశోధించి అచ్చు వేయాలి. చిత్తశుద్ధితో తెలంగాణ సాహిత్య విమర్శనా గ్రంథాలను వెలువరించాలి. అందుకు భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ ద్వారా ప్రభుత్వం పూనుకోవాలి. సాహితీకారులు తమ రచనలను అచ్చు వేసుకునేందుకు తెలుగు విశ్వవిద్యాలయం లాగా ఇతర విశ్వవిద్యాలయాల నుండి కూడా ఆర్థిక సహాయం అందించాలి. ఆర్థికంగా స్థిరత్వం లేని సాహితీకారులను ప్రత్యేకంగా గుర్తించి వారికి భృతి కల్పించాలి. సాహితీకారులు ప్రశాంతంగా రచనలు చేసేందుకు వీలుగా వారికి ఇళ్ళు కట్టించి ఇవ్వాలి. రచయితలకు హెల్త్ కార్డులు, ఆరోగ్యబీమా వంటివి వారికి అందించాలి. (సి.హెచ్.మధు - నిజామాబాద్, సంద బాబు వంటి వారు క్యాన్సర్ బారినపడి సరైన వైద్యం అందక మరణించారు). రేపటి తరానికి సాహిత్యం పట్ల ఆసక్తిని పెంచేందుకు పాఠశాల స్థాయి నుండే ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలి. తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రతి ఏడాది కొన్ని రచనలు ఎంపిక చేసి వివిధ భాషల్లోకి అనువాదాలను చేయించాలి. తెలంగాణ పాఠకుల కోసం ప్రభుత్వం స్వయంగా కొన్ని రచనలను కొనుగోలు చేసి గ్రంథాలయాలకు చేర్చాలి. తెలంగాణ రచయితలు ఇతర భాషల నుండి ఐచ్ఛికంగా అనువాదం చేసిన ఉత్తమ రచనలను ప్రభుత్వం ప్రచురించాలి. ప్రత్యేక అస్థిత్వ సంకలనాలకు ప్రోత్సాహం అందించాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాహిత్య పరంగా తెలంగాణ చరిత్రను జిల్లాల వారీగా పరిశోధించి ప్రచురించే కార్యక్రమాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ చేపట్టింది. కొన్ని జిల్లాల చరిత్ర పుస్తక రూపంలో వెలువరించారు కూడా. వినూత్నంగా విద్యార్థులను భాగస్వామ్యులను చేస్తూ 'మా ఊరు - మా బడి' కార్యక్రమంతో విద్యార్థులకు సాహితి పాఠాలను అందించి రచన పద్ధతులను నేర్పిస్తున్నారు.

- జ్వలిత, బహుళ సంపాదకులు

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@ gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020



చిన్నారులను ఆశీర్వదించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని మల్లేపల్లి గ్రామంలో సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి చీర్ల రాధాకృష్ణ తన పిల్లలకు నూతన వస్త్రలంకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కళ్యాణ వెంకటేశ్వరరావు, బండి రమేష్, తుమ్మ విష్ణు, మండల కమిటీ సభ్యులు శీలం గురుమూర్తి, తోటకూరి రాజు, మల్లెల సన్మాతరావు, బిక్కసాని గంగాధర్, తాళ్ళూరి వెంకటేశ్వరరావు, చిట్టూరి వెంకన్న, గ్రామ సర్పంచ్ పి.నాగేశ్వరరావు, మల్లెపల్లి సిపిఎం గ్రామ శాఖ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు వినతి

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో వల్లాపురం గ్రామంలో గ్రామ సమస్యలపై ఆ గ్రామ ఎమ్మార్పీఎస్ యువకులు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు ఆదివారం ఖమ్మంలో వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో గ్రామ సర్పంచ్ అమడాల జక్కర్ ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ మాదిగ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తున్నాడని వినతిపత్రంలో కృష్ణ మాదిగకు వివరించారు. గ్రామంలో మూడెకరాల పథకం, డబుల్ బెడ్రూమ్స్ కేటాయింపు, ఇంటి స్థలాల పంపిణీలో మాదిగ సామాజిక వర్గం వారికి మంజూరు చేయలేదన్నారు. జనాభా దామాషా ప్రకారం మాదిగ సామాజిక వర్గానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలలో చోటు కల్పించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ నాయకులు నిమ్మకాయల నాగరాజు, ఎల్ వినయ్, పుట్ట శేషగిరి, జొన్నలగడ్డ రాజు, జొన్నలగడ్డ కిట్టు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరులు మృతి

నవతెలంగాణ-ముదిగొండ



మండలంలోని గోకినేపల్లిలో సిపిఐ(ఎం) సానుభూతిపరులు ఆకారపు రామకృష్ణ(32) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం రామకృష్ణ మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడు రామకృష్ణకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు మందరపు వెంకన్న, గ్రామ శాఖ కార్యదర్శి మేడా నారాయణ, నాయకులు బండి శ్రీను, షేక్ దావూద్, గుంజులూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మపేటలో సిపిఐ (ఎం) సానుభూతిపరులు అప్పయ్య మృతి

ముదిగొండ మండల పరిధి అమ్మపేటలో సిపిఐ(ఎం) సానుభూతిపరులు జిడుగు అప్పయ్య (90) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సిపిఐ(ఎం) గ్రామ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఊటుకూరు గోపయ్య అప్పయ్య మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అప్పయ్య మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడు అప్పయ్యకు భార్య, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) గ్రామశాఖ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వరరావు, నాయకులు మునగాల గురవయ్య, మాదారపు శ్రీనివాసరావు, నంబూరి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్

నవతెలంగాణ-కామేపల్లి

ఖమ్మం నుండి ఏన్కూరు వరకు బస్సు సౌకర్యం కల్పించాలని భాసితి నగర్, రేపల్లెవాడ, జగన్నాథ తండా గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఖమ్మం నుండి బూడిదంపాడు, పుటాని తండ, బాసితి నగర్, రేపల్లెవాడ జగన్నాథ్ తండా మధ్యలో పల్లె లలితండ మరుసకుంట తిమ్మరావుపేట, ఏన్కూరు వరకు బస్సు సౌకర్యం కల్పించి ప్రయాణికుల ఇక్కట్లు నివారించాలని ఆయా గ్రామస్తులు డిమాండ్ చేశారు. బస్సు సౌకర్యం లేక ప్రైవేటు ఆటోలలో ప్రయాణం చేసినప్పుడు ప్రమాదాలు విపరీతంగా జరుగుతున్నాయని దీంతో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని వాపోతున్నారు. సంబంధిత అధికారులు బస్ డిపో మేనేజర్ వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించి ప్రయాణికుల ఇక్కట్లను నివారించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఖమ్మం నుండి ముచ్చర్ల, కామేపల్లి, ఊటుకూరు మీద నుండి ఇల్లందు వరకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

420 మందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

పట్టణానికి చెందిన కల్లూరు ఏఎస్ఐ ఎస్బి ఐలూరి రామకృష్ణారెడ్డి వారి తల్లిదండ్రులైన ఐలూరి సీతారామిరెడ్డి - వెంకట్రావమ్మ జ్ఞాపకార్థం ఆదివారం కల్లూరు నూతన బస్టాండులో 420 మంది ప్రయాణికులకు స్వయంగా ఉచిత మజ్జిగ పంపిణీ చేసినారు. 60 రోజుల మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 55వ రోజు రామకృష్ణారెడ్డి ప్రయాణికులందరికీ మజ్జిగ పంపిణీ చేయడం పట్ల వారికి వారి కుటుంబ సభ్యులకు టీం సత్తుపల్లి తరపున, ప్రయాణికుల తరఫున అభినందనలు తెలిపారు.



ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక లకారం ట్యాంక్ బండ్ పై డిస్ట్రిక్ట్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాళ్లూరి భారతీదేవి జ్ఞాపకార్థం తాళ్ళూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్, ద్వారా ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై ఆదివారం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి దాత తాళ్ళూరితో ముఖ్య అతిథులుగా హాజరైన సూడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సీనియర్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ కలిసి కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు. నిత్యం రద్దీగా ఉండే లకారం ట్యాంక్ బండ్ మీద ప్రజల తాగు నీటి అవసరాలను గమనించిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సీనియర్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, బండి నాగేశ్వరరావు, తానా పూర్వ అధ్యక్షులు జయశేఖర్ తాళ్ళూరి దృష్టికి తీసుకెళ్లారు. దాతగా తాళ్ళూరి స్పందించగా మున్సిపల్ కమిషనర్ లకారం ట్యాంక్ బండ్ పై వాటర్ ప్లాంట్ కి అనుమతి మంజూరు చేశారు. లకారం ట్యాంక్ బండ్ రూ.4 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ వాటర్ ప్లాంట్ ప్రతిరోజూ 5 వేల మందికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జయశేఖర్, సరిమిత్ర ఫౌండేషన్ కురువేళ్ళ ప్రవీణ్, డిస్ట్రిక్ట్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్ బాధ్యులు బోనాల రామకృష్ణ, పసుమర్తి రంగారావు, పువ్వాడ ట్రస్ట్ కిరణ్, కేఎల్సీ దొడ్డా రవి, తాళ్ళూరి భారతీదేవి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరుపల్లి వంశీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -1 బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్

నవతెలంగాణ-ఖమ్మం



గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ ఆదివారం పరిశీలించారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 50 పరీక్ష కేంద్రాలలో జరుగుతున్న గ్రూప్ 1 పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద అమలతున్న 144 సెక్షన్ పరిశీలించేందుకు నగరంలోని ఎస్బిఐటి ఇంజనీరింగ్ కాలేజ్, హార్వెస్ట్ స్కూల్, ప్రియదర్శిని డిగ్రీ కాలేజ్ కవిత డిగ్రీ కాలేజ్, ఎన్ఎస్పీ కాలనీ ప్రభుత్వ పాఠశాల, నిర్మల్ హృదయ్ స్కూల్, ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కాలేజ్ పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట ట్రైనీ ఏఎస్పీ అవినాశ్ కుమార్ పాల్గొన్నారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో మొత్తం 50 పరీక్షా కేంద్రాల వద్ద ఈ ఆంక్షలు అమలులో వున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు అప్రమత్తం ఉండాలని ఆదేశించారు.

సర్దుబాటు 'చదువు'

- నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం
- ఉపాధ్యాయుల కొరతతో స్వాగతం
- 'అడ్జస్టుమెంట్'పై అవినీతి ఆరోపణలు
- 'మన ఊరు- మనబడి'తో ఖమ్మంలో వసతుల మెరుగు
- భద్రాద్రిలో వెనుకబడిన 'మనబడి'

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలల తలుపులు తెరుచుకుంటున్నాయి. ఈ విద్యాసంవత్సరం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు, షఉస్ వంటివి ఒకింత ఆశాజనకంగా అందినా...ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు మాత్రం వెక్కిరిస్తున్నాయి. ఇక ఖమ్మం జిల్లాలో 'మన ఊరు- మనబడి, మన బస్తీ- మనబడి' పథకం సక్సెస్‌ఫుల్‌గా నిలవడంతో రాష్ట్రంలోనే జిల్లా నంబర్ వన్ స్థానంలో ఉంది. ఈ విషయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాత్రం వెనుకబడింది. 8వ స్థానంలో నిలిచింది. జూన్ 17 వరకు బడిబాట కొనసాగుతున్న తరుణంలో ఉపాధ్యాయుల సర్దుబాట్లు విమర్శలకు గురిచేస్తున్నాయి. పైగా ఈ ఉపాధ్యాయుల అడ్జస్టుమెంట్‌పై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఆశించిన స్థానానికి బదిలీ చేసుకునేందుకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు కొందరు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేయకుండా అడ్జస్టుమెంట్లు సరికాదని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. పోస్టులు భర్తీ చేసేంత వరకు విద్యావాలంటీర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

- 'అడ్జస్టుమెంట్'పై విమర్శలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వర్క్‌అడ్జస్టుమెంట్‌పై బదిలీలు జిల్లా విద్యాశాఖను అబాసుపాలుజేస్తున్నాయని ఉపాధ్యాయసంఘాలు అంటున్నాయి. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, బడిబాట కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ విధానం సరికాదని ఉపాధ్యాయసంఘాల నేతలు అంటున్నారు. జిల్లాలో 80వేల మంది విద్యార్థులకు ఆరువేల వరకు టీచర్లుండగా ఇంకా 500-600 వరకు ఖాళీలు ఉన్నాయి. ఈస్థానాలను విద్యావాలంటీర్లతో భర్తీ చేయాల్సి ఉండగా గత రెండేళ్ల నుంచి ఈ నియామకాలను నిలిపివేశారు. ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు టీచర్ పోస్టులను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో భర్తీ చేస్తుండటం వల్ల విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. తద్వారా ప్రాథమిక పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ విధానానికి విఘాతం కలుగుతోంది. ఒక సబెక్టు ఉపాధ్యాయులు తెలుగు, ఇంగ్లీష్ మీడియాలకు కలిపి ఇద్దరు ఉంటే ఒకరిని మరో పాఠశాలలో సర్దుబాటు చేస్తున్నారు. ఎఫ్ఏసీ హెడ్మాస్టర్లు పాఠశాల పర్యవేక్షణ చేస్తూ సబ్జెక్టు బోధన చేయాల్సి వస్తుండటంతో విధులకు న్యాయం చేయలేక పోవడంతో పాటు అదనపు భారం మోయాల్సి వస్తుంది. అటువంటి చోట విద్యావాలంటీర్‌ను కచ్చితంగా నియమించాలని డిమాండ్‌లు వస్తున్నాయి. ఇలా వర్క్‌అడ్జస్టుమెంట్ పేరుతో సర్దుబాట్లపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గతంలో జిల్లాలో రెండువేల వరకు ఉన్న స్కావెంజర్లను తొలగించి పంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి పారిశుధ్య బాధ్యతలు అప్పగించారు. వారు పాఠశాల ఆవరణ మినహా తరగతి గదులు, స్టాఫ్‌రూమ్స్, మరుగుదొడ్లను శుభ్రం చేయకపోవడంతో పాఠశాలల్లో అపరిశుభ్రత నెలకొంటోంది. స్కావెంజర్లను తిరిగి నియమించాలనే డిమాండ్ ఊపందుకుంది.



- అడ్జస్టుమెంట్ అవస్థలపై ఆగ్రహం

ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి హైస్కూల్‌లో ఇప్పటికే హెడ్మాస్టర్, జీవశాస్త్రం, తెలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ బయాలజీ టీచర్ ఎఫ్ఏసీ హెడ్మాస్టర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంగా పనిచేస్తూ తన సబ్జెక్టును బోధిస్తున్నారు. 288 మంది విద్యార్థులున్న పాఠశాల నిర్వహణ కష్టతరంగా ఉన్నా సమిష్టి కృషి ఫలితంగా మెరుగైన ఫలితాలను పాఠశాల సాధిస్తోంది. కానీ అడ్జస్టుమెంట్‌లో భాగంగా ఇక్కడున్న సోషల్, హిందీ టీచర్లను గుదిమళ్ల పాఠశాలకు పంపే ప్రయత్నాలు సాగుతుండటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- 'మనబడి' ఊరట..

పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు ప్రారంభించిన 'మన ఊరు- మనబడి, మనబస్తీ- మన బడి' పథకం అమలులో ఖమ్మం జిల్లా ముందంజలో ఉంది. మొదటి విడత పనుల ఆధారంగా ప్రకటించిన ర్యాంకుల్లో ఖమ్మం మొదటి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 8వ స్థానంలో నిలిచాయి. పూర్తయిన పాఠశాలలకు 50%, పనులకు 30%, చేసిన ఖర్చుకు 20% చొప్పున 100 పాయింట్లకు ర్యాంకులను కేటాయించారు. ఖమ్మంలో 426 స్కూల్స్‌లో పనులు చేపట్టగా 73, భద్రాద్రిలో 368కి 17 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి.

- యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాల్లోనూ భేష్

విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాల విషయంలోనూ ఈ ఏడాది ఖమ్మం జిల్లా ముందంజలో ఉందనే చెప్పాలి. జిల్లాలోని 1216 స్కూల్స్‌లో 80వేల మంది విద్యార్థులుండగా దాదాపు 90శాతం మందికి ఇవి రెండూ పాఠశాలల ప్రారంభరోజే అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.

పుట్టింది ధనిక కుటుంబంలో నిలబడింది పేదల పక్షాన..

- నేడు చిన్నమునగాలలో చింతనిప్పు భూపతయ్య సంస్మరణ సభ...
- హాజరుకానున్న సీపీఐ(ఎం) జిల్లా మండల నాయకులు

నవతెలంగాణ-కొణిజర్ల



ధనిక కుటుంబంలో పుట్టినప్పటికి నిరుపేదలకు అండగా దళిత బడుగు బలహీన వర్గాలకు బాసటగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తిగా సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు కామ్రేడ్ చింతనిప్పు భూపతయ్య పేరు ప్రఖ్యాతలు పొందారు. మండల పరిధిలోని చిన్నమునగాల గ్రామంలో చింతనిప్పు నారాయణ రాధమ్మ దంపతులకు పెద్ద కుమారుడు భూపతయ్య తోపాటు ఇద్దరు కూతుర్లు జన్మించారు. చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు భావాలను కలిగి ఉండేవాడు. గ్రామంలో ఎవరైనా ఇబ్బందులలో ఉన్నారంటే తట్టుకోలేక పోయేవాడు వెంటనే వారి సమస్యలను తెలుసుకొని తీర్చేవాడు. తల్లిదండ్రులు జమీందార్లు కావడంతో పేద ప్రజలు దళితులు ఎక్కువగా భూపతయ్య పొలంలో పనులకు వచ్చిన సమయంలో వ్యవసాయ కూలీలు పడుతున్న బాధలు ఇబ్బందులు గమనించి 1983లో సీపీఎం పార్టీ పట్ల ఆకర్షితుడై పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాటి నుంచి తుదిశ్వాస విడిచేవరకు కష్టజీవుల అభ్యున్నతికి పాటుపడ్డాడు. తన ఇంటిని ఉద్యమ కేంద్రంగా మార్చి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేవారు. గ్రామంలో పార్టీని అభివృద్ధి చేస్తూ ఎర్రజెండా అండతో అన్నివర్గాల ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటు ఉండేవాడు. ప్రత్యర్థి పార్టీల నుంచి ఎన్ని అవరోధాలు ఎదురైన ఎవరికి లొంగకుండా సీపీఎం జెండా చేతబూని పట్టువదలని విక్రమార్కుడిలా ధైర్యంగా నిలబడి గ్రామంలో సీపీఎం పార్టీని ఎవరు ఏమిచెయ్యలేరని ప్రత్యర్థులకు పలుమార్లు సవాల్ విసిరిన గొప్ప మార్కిస్టు కామ్రేడ్ భూపతయ్య. భార్య హేమలత సైతం భర్త భూపతయ్య అడుగుజాడల్లో నడుస్తూ ఇంటికి వచ్చే నాయకులు కార్యకర్తలు అన్నం వండిపెడుతూ పార్టీ కార్యక్రమాలతోపాటు మహిళా ఐద్వా మహిళ సంఘంలో కూడా పనిచేస్తున్నారు. గ్రామంలో కార్యకర్తలకి ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఆనారోగ్యంతో బాధపడిన ఆర్థిక సహాయం అందించడంలో భూపతయ్య హేమలత దంపతులు ముందు ఉండేవారు. భూపతయ్య ది జమీందారు కుటుంబం అయినప్పటికీ ప్రధానంగా దళితులను కంటికి రెప్పలా కాపాడేవారు. రైతు సంఘం నాయకుడిగా పనిచేసిన సమయంలో సంఘం పిలుపునిచ్చినప్పుడు ఎంతో బాధ్యతగా సంఘం పనులు ముమ్మరంగా చేయడంలో ముందున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. వ్యవసాయ కూలీలు కూలీరెట్ల ఉద్యమాలు సైతం నాయకులు కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. భూపతయ్య గ్రామంలో మొట్టమొదటి ట్రాక్టర్ కొనుగోలు చేసాడు. ట్రాక్టర్ ని గ్రామస్తుల ఇండ్లల్లో శుభకార్యాలు జరిగితే డీజిల్ పోయించి ఉచితంగా ఇచ్చేవారు. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సీపీఎం జనచైతన్య యాత్రకు వెళుతున్న కార్యకర్తలకు టిషర్టులు, చీరెలు కొనుగోలు చేసేందుకు భూపతయ్య హేమలత దంపతులు పార్టీ గ్రామ శాఖకు పదివేల రూపాయలు అందజేసి పార్టీ పట్ల ఉన్న మమకారాన్ని గౌరవాన్ని చాటుకున్నారు. భూపతయ్యకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వారిలో పెద్దకూతురు శిరీష (సీత) టెన్ టివిలో జర్నలిస్ట్‌గా పనిచేసి ప్రస్తుతం యూట్యూబ్ చానల్స్ లో ఫ్రిలాన్స్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. కూతుర్లు ఇద్దరు చిన్ననాటి నుంచి నేటి వరకు తండ్రి భూపతయ్య అడుగుజాడల్లో నడుస్తూ ఎర్రజెండా పట్ల తమకు ఉన్న అభిమానాన్ని చాటుకుంటూ పలువురికి తమవంతు సహాయ సహకరాలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



భాస్కరాలు పుస్తకాన్ని పుస్తకావిష్కరించిన కలెక్టర్

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వాస్తు నిపుణులు, సివిల్ ఇంజినీర్, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ అయిన ఇటికాల భాస్కర్ రచించిన భాస్కరాలు అనే పుస్తకాన్ని మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి జిల్లా కలెక్టర్ పి.వి గౌతమ్ ఆవిష్కరించారు. ఆదివారం ఖమ్మంలోని తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన స్టాల్స్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు బుక్ స్టాల్స్ ని సందర్శించారు. ఈ కార్యక్రమం లో నిర్వాహకులు చంద్ర మోహన్, ప్రసేన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



గ్రూప్-1కు 37శాతం గైర్హాజరు

- హాల్ టిక్కెట్ నంబర్ బబ్లింగ్ లో పొరపాట్లు
- పలు కేంద్రాల్లో కలెక్టర్ గౌతమ్ తనిఖీ
- కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహణ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:



టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీల పరంపర నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య గ్రూప్-1 ప్రిలిమ్స్ ను ఆదివారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ నగరంలోని పలు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలో టిఎస్ పి ఎస్ సి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు. జిల్లాలోని 50 కేంద్రాల్లో మొత్తం అభ్యర్థులు 17,365 కు గాను, 10,945 మంది (63.03%) హాజరు కాగా 6,420 మంది (36.97%) గైర్హాజరు అయ్యారు. హాల్ టిక్కెట్, బుక్ లెట్ నంబర్ బబ్లింగ్ విషయంలో పలువురు అభ్యర్థులు పొరపాట్లు చేసినట్లు తెలిసింది. 0 నుంచి కాకుండా 1 నుంచి ప్రారంభం కావడం, 9 తర్వాత సున్నా రావడంతో హాల్ టిక్కెట్ నంబర్ బబ్లింగ్ చేసే క్రమంలో అభ్యర్థులు తడబడ్డారు. గతంలో రద్దైన పరీక్షలోనూ వేలాదిమంది ఇదే రకమైన పొరపాటు చేయటం గమనార్హం. ఇక ప్రతి అరగంటకు ఒక బెల్ మాత్రమే మోగించటం కాకుండా ఎన్ని అరగంటలైతే అన్ని చొప్పున బెల్ కొట్టాల్సిందని అభ్యర్థులు అభిప్రాయ పడ్డారు. తనిఖీల సందర్భంగా ఫుల్ హ్యాండ్ షర్ట్ ఫోల్డ్ లు సైతం తీయించడం కట్టుదిట్టమైన భద్రతకు నిదర్శనం.

కలెక్టర్ తనిఖీలు..

తనిఖీల సందర్భంగా ముందుగా కలెక్టర్ వ్యక్తిగతంగా తనను సోదా చేయించుకొని కేంద్రాల్లోకి అడుగుపెట్టారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల, ఆర్జేసి డిగ్రీ కళాశాల, రిక్కా బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ వీపీ గౌతమ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పరీక్ష నిర్వహణ ప్రక్రియను చూశారు. పరీక్షా కేంద్రాలను పరిశీలించి అభ్యర్థులు పరీక్షను రాస్తున్న విధానాన్ని పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. అభ్యర్థులతో పాటు, ఇన్విజిలేటర్లు, పరీక్ష నిర్వహణ సిబ్బంది అందరిని తనిఖీలు చేయాలని, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించవద్దని తెలిపారు. ప్రవేశ మార్గం మరొకటి ఉన్న చోట, కిటికీల వద్ద గట్టి నిఘా పెట్టాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీవోలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, ఏసీపీ రామోజీ రమేష్, ప్రిన్సిపాళ్ల డా. జి. పద్మావతి, బి. అరుణ్ కుమార్, అధికారులు, తదితరులు ఉన్నారు.

కారేపల్లిలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే

- నీటి సమస్య తీర్చాలని కోరిన మంగళితండా వాసులు

నవతెలంగాణ-కారేపల్లి



మండలంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ఆదివారం పర్యటించారు. శుభకార్యాలు, బాధితులను పరామర్శలు చేస్తూ గ్రామస్తులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో మమైకమే మదన్‌లాల్ పర్యటన సాగింది. గ్రామ కుడలిలో ఉన్న గ్రామస్తులను పలుకరించి వారి పక్కన కూర్చోని వారి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధింత అధికారులతో మాట్లాడారు. మధురానగర్ తండాలో భూక్య మోతీలాల్ -లక్ష్మిల కుమారుడు దినేష్- సౌజన్యల వివాహ వేడుకకు హాజరై వధువరులను ఆశీర్వాదించారు. కారేపల్లి విశ్రాంత ఉపాధ్యాయుడు చెవుల వెంకటేశ్వర్లు ఆనారోగ్యం నుండి కోలుకుంటున్నారు. ఆయన ఇంటికి వెళ్ళిన మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కారేపల్లి-2 ఎంపీటీసీ జడల వసంత భర్త ఉద్యమకారుడు జడల వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంకు గురికాగా ఆయనను పరామర్శించారు. మంగళితండాలో జాలోత్ వీరన్న-లలితల చిన్నారి శ్యామల చెవుల కుట్టు వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. మంగళితండాలో అనారోగ్యంతో బాధపడుతున్న దారావత్ రాములును పరామర్శించారు.

నీటి సమస్య తీర్చాలని వినతి

మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మంగళితండాలో పర్యటన సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయ అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మా గ్రామంలో మంచినీరు సరఫరా జరిగలేదని తెల్పటంతో స్పందించిన ఆయన వెంటనే మిషన్ భగీరథ ఏఈకి ఫోన్ చేసి మంగళితండా నీటి సమస్యను వివరించారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వెంట రైతు బంధు మండల మాజీ కన్వీనర్ హన్మకొండ రమేష్, ఉపసర్పంచ్ దారావత్ వెంకటాద్రి, బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కె.గౌసుద్దీన్, నరేష్, అజ్మీర వీరు, బర్మావత్ కోటి, దారావత్ వికాస్, బొబ్బల ఉపేందర్, బానోత్ రాజేష్, జర్పుల రమేష్, కందుల సామేల్, భూక్య మోహన్‌రావు, బొల్లి అప్పారావు, లాలు, ఖాలీలుల్లా ఖాన్, హరీష్, పిల్లలమర్రి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


పాలడుగులో విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-వైరాటౌన్



మండల పరిధిలోని పాలడుగు గ్రామంలో పాస్టర్ మోదుగు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీ అంబిక హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ చైర్మన్ రెడ్డెం నాగ నర్సిరెడ్డి సహకారంతో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం వై.ప్రసాదరావు హాస్పిటల్, వైరా కేఎంఆర్ హాస్పిటల్, ప్రమీల కంటి వైద్యశాల డాక్టర్లు వైద్య శిబిరంలో పాల్గొని వంద మంది రోగులకు తగిన పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు, డాక్టర్లకు గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలడుగు సర్పంచ్ శీలం రమాదేవి, పంచాయతీ కార్యదర్శి గరికపాటి కుమార్, మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
సోమవారం 12 జూన్ 2023



పేదరికమే గీటురాయిగా నవచైతన్య సేవలు

నవతెలంగాణ-సత్తుపల్లి

పేదరికమే గీటు రాయిగా నవచైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలు చేపడుతుందని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గాదె నరసింహారెడ్డి, తోట కిరణ్ అన్నారు. ఆదివారం స్థానిక వెంగళరావునగర్‌లో సుమారు 180 కుటుంబాలకు నవచైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ, ఆశ్రి ఫౌండేషన్ హైదరాబాద్ వారి సంయుక్త భాగస్వామ్యంతో నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ ఇప్పటికే సత్తుపల్లి సహా పరిసర మండలాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, కరోనా విపత్తులో చేపట్టిన సేవా కార్యక్రమాలకు గాను ప్రభుత్వం తమ సంస్థను ఉత్తమ సేవా సంస్థగా గుర్తించిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ చేసినట్లు పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ మాదిరాజు పుల్లారావు మాట్లాడుతూ వారి తల్లిదండ్రులు మాదిరాజు రాఘవరావు, సీతాదేవిల జ్ఞాపకార్థం 7వ తరగతిలో ప్రతిభ చాటిన వారికి రూ. వేలు నగదు ప్రోత్సాహక బహుమతి అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు గాదె నాగు, బొల్లెపోగు సురేష్, రాగం శ్రీను, పాలకొల్లు శ్రీనివాసరావు, ఎసయ్య, మోహన్, గంధం వీరస్వామి, పాషా (బబ్లూ), నవనీత్, దయాకర్, నుమాన్, ఏసు, మారేష్, మనోహర్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై సమరానికి విద్యార్థులు సన్నద్ధం కావాలి

పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్

నవతెలంగాణ-ఖమ్మం

సర్కారు బడుల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్యలు ఆరోపించారు. నగరంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పిడిఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి స్కూల్స్ ప్రారంభిస్తామని చెప్పిన విద్యా శాఖ మంత్రి విద్యార్థులకు ఇంత వరకు పూర్తి స్థాయిలో బుక్స్, యూనిఫామ్స్ ఎందుకు సిద్ధం చేయలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు, టాయిలెట్స్ కొరత తీవ్రంగా ఉండగా టీచర్ల ఖాళీలను నింపకుండా దశాబ్ది ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరపాలని, చెప్పడం ఈ ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్, సహాయ కార్యదర్శులు దీపిక, నవీన్ జిల్లా నాయకులు వినయ్, శశి, కరుణ్, కార్తీక్, రాజేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుపరిపాలన దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-నేలకొండపల్లి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని రైతువేదికలో సుపరిపాలన దినోత్సవ వేడుకలకు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మండలంలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన 40 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్వా కల్చర్ క్రింద 120 మంది లబ్ధిదారులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. కుల, ఆదాయ సర్టిఫికెట్స్ ని పంపిణీ చేశారు. 3116/-రూ. ఉన్న వికలాంగుల పెన్షన్ మరో 1000/- రూపాయలు పెంచటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్రా రమ్య, తహసీల్దార్ ధార ప్రసాద్, ఎంపీడీవో కే.జమలారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నంబూరి శాంతకుమారి, రైతుబంధు సమన్వయ సమితి మండల కన్వీనర్ శాఖమూరి సతీష్, ఎంపీటీసీ శీలం వెంకటలక్ష్మి, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, వజ్జ శ్రీనివాసరావు, మరికంటి రేణుబాబు, నంబూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మల్లు భట్టి విక్రమార్కను కలిసిన నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్

నవతెలంగాణ-ఖమ్మం

నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ ఆదివారం విరామం సమయంలో కలిసి ఆయనతో ముచ్చటించారు. 1000 కిలో మీటర్ల శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్న ముగింపు సభ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మారం కరుణాకర్ రెడ్డి, కొంటేముక్కుల నాగేశ్వరరావు, ఏలూరి రవికుమార్, వసీం తదితరులు పాల్గొన్నారు.

బైక్ పై నుంచి కిందపడి వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ద్విచక్రవాహనం అదుపుతప్పి వాహనంపై నుంచి కిందపడి వ్యక్తికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని రెడ్డిపల్లి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఓ ద్విచక్రవాహనదారుడు పల్లెగూడెం వైపు నుంచి ఖమ్మం వస్తుండగా రెడ్డిపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వరిగడ్డి వాములు దగ్ధం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలోని తనగంపాడులో నలుగురు రైతులకు చెందిన వరిగడ్డి వాములు ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. రామారావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఉమాశంకర్ అనే రైతులు వరిగడ్డిని గ్రామం సమీపంలో నిల్వచేశారు. ప్రమాదవశాత్తు వాటికి మంటలు అంటుకొని దగ్ధమయ్యాయి. వాటి విలువ రూ.60 వేలు ఉంటుందని అంచనా. గడ్డి దగ్ధం అవ్వడంతో రైతులు ఆవేదనకు గురయ్యారు.

ఉద్యమకారులకు సన్మానం

నవతెలంగాణ-తల్లాడ

దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ ఉద్యమకారులను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సన్మానించారు. తల్లాడ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వీర కృష్ణను శాలువా కప్పి సన్మానించారు.

వైరా సాయిరాం బేకరీలో చోరీ

- లక్షన్నర రూపాయల నష్టం
- గతంలో మూడు సార్లు చోరీ.. సొమ్ము రికవరీ లేదు
- యజమాని ఆవేదన

నవతెలంగాణ-వైరా



వైరాలోని మధిర రోడ్‌లో గల శ్రీనివాస్ థియేటర్ పక్కన సాయిరాం బేకరీ అండ్ జనరల్ స్టోర్స్ లో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. పక్కనే ఉన్న వెంకటేశ్వర హోటల్‌లో కూడా దొంగలు పడి కొంత నగదు ఎత్తుకెళ్లారు. సాయిరాం బేకరి షట్టర్ తాళాలు పగల గొట్టి దొంగలు షాప్ లోకి వెళ్లి చోరీకి పాల్పడ్డారు. బేకరీ క్యాష్ కౌంటర్ లో దాచి ఉంచిన మూడు తులాల బంగారపు గొలుసు, ఐదువేల రూపాయల నగదు, ఖరీదైన సిగరెట్ బాక్సులను ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న వెంకటేశ్వర హోటల్ లో కౌంటర్ ను పగలగొట్టి కొంత మొత్తం నగదును ఎత్తుకెళ్లారని తెలిపారు. బేకరీ నిర్వాహకులు ఏలే భద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు లక్షన్నర రూపాయలు ఉంటుందని తెలిపారు. గతంలో మూడుసార్లు దొంగతనాలు తన షాప్‌లో జరిగాయని, ప్రతి సారి పోలీసులకు ఫిర్యాదు చేశానని కాని నేటికీ సొమ్ము రికవరీ కాలేదని వాపోయాడు. మరలా ఇప్పుడు దొంగతనం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చోరీ విషయమై వైరా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని బేకరీ యజమాని భద్రయ్య తెలిపారు. సంఘటనా స్థలాన్ని వైరా పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. షాపులో ఉన్న సిసి ఫుటేజ్ లను పరిశీలించారు. ఒక యువకుడు ముసుగు ధరించి వంగి వంగిలోనికి వస్తున్నట్లు కనిపించింది. ఆ వ్యక్తిని గుర్తించాల్సి ఉంది.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

- నిమిషం లేటైనా అనుమతి లేదు - ప్రిన్సిపాల్ సింహాచలం

నవతెలంగాణ-కారేపల్లి



ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు 12వ తేది నుండి 18 వరకు జరుగనున్నట్లు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్ట్ ఇయర్, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు సెకెండ్ ఇయర్ పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ కళాశాల, కస్తూర్బా విద్యాలయం, మైనార్టీ గురుకులం, గాంధీనగర్ గిరిజన గురుకులం, కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 151 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 47 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సైతం నిమిషం లేటైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. విద్యార్థులు 30 నిమిషాల ముందుగా పరీక్షా కేంద్రంకు చేరుకోవాలని కోరారు.

ప్రజలు కమ్యూనిస్టులను కోరుకుంటున్నారు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట్

నవతెలంగాణ-మధిర



నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేసున్న కమ్యూనిస్టులను ప్రజలు కోరుకుంటున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బోడ వెంకట్ అన్నారు. మండలంలోని మల్లారం గ్రామంలో సర్పంచ్ మందడపు ఉపేంద్ర అధ్యక్షతన ఆదివారం సీపీఐ(ఎం) జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బోడ వెంకట్ హాజరై మాట్లాడుతూ.. దేశంలో రాజకీయ పార్టీలు అధికారం కోసం ఎన్నికల ముందు అమలు కాని హామీలను ఇచ్చి ఎన్నికల అనంతరం వాటిని విస్మరిస్తున్నారని, ఫలితంగా పేదరికం నిరుద్యోగం, వ్యవసాయ రంగంలో సంక్షోభం సంభవిస్తున్నాయని అన్నారు. పేదల సొంతింటి కల నెరవేరాలంటే కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రకటించి నెరవేర్చాలేదన్నారు. రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూసే పరిస్థితులు దాపరించాయన్నారు. పండిన పంటకు గిట్టుబాటు లేక మార్కెట్‌లో రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. నష్టాలకే రైతులు తమ పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. లక్షల సంఖ్యలో ప్రజలు తమ సొంత గ్రామాలు విడిచి వలస పక్షుల వలె ఉపాధి వెతుక్కుంటూ వెళ్తున్నారని అన్నారు. పేద ప్రజల సమస్యలపై నిరంతరం కమ్యూనిస్టులు పోరాడుతున్నారని, కమ్యూనిస్టుల ప్రాతినిధ్య చట్టసభల్లో పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు స్ఫూర్తితో ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఎం మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు నెరవేర్చేందుకు వామపక్ష పార్టీలు మాత్రమే నికరంగా నిలబడి పోరాడగవని అన్నారు. కమ్యూనిస్టులను ప్రజలు మరింత ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. మధిర నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజా సమస్యలను అధ్యయనం చేసినట్లు, వాటి పరిష్కారానికి పార్టీ కృషి చేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు శీలం నరసింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు, మద్దాల ప్రభాకర్, షేక్ ఉద్దండు సాహెబ్, నాయుడు శ్రీరాములు, కుక్క మోహన్ రావు, కొంగర విశ్వేశ్వరరావు, గుండ్లపల్లి లక్ష్మీనారాయణ, కాలసాని కృష్ణ పాల్గొన్నారు.

కవుల కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరం...

తెలంగాణ ఉద్యమాన్ని మరింతంగా రగిలించింది



- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- ప్రగతిని ప్రతిబింబించిన కవి సమ్మేళనం

నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జరిగిన తొలి, మలిదశ ఉద్యమాల్లో కవులు కీలకపాత్రను పోషించారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. వారి కలం నుంచి జాలు వారించిన ప్రతి అక్షరం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉరకలెత్తించింది. ఈ ఉద్యమంలో ప్రముఖ కవి దివంగత కాళోజీ నారాయణరావుది కీలకపాత్రని చెప్పొచ్చు. తెలంగాణ, స్థితిగతులు, ఉమ్మడి రాష్ట్ర పాలనలో మనకు జరుగుతున్న అన్యాయాలను కవులంతా కలాల నుంచి ఎగిసిపడిన అక్షర సమూహం ఉద్యమకారులో మరింత ఉత్సాహాన్ని పెంచిందన్నారు. తెలంగాణ సాధనలో కవులు కూడా ప్రముఖపాత్ర పోషించి తెలంగాణ సాకారానికి దోహదపడ్డారని ఎమ్మెల్యే సండ్ర స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రగతిని ప్రతిబింబించిన కవి సమ్మేళనం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 11వ రోజు కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో కవి సమ్మేళనాన్ని జరిపారు. ఈ సమ్మేళనంలో కవులు మధుసూదనరాజు, కళ్యాణశర్మలు తెలంగాణ సాకారం అయ్యాక అయ్యాక ఈ దశాబ్ద కాలంలో సాధించిన ప్రగతిపై తమ రచనలు వినిపించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, హరితహారం తదితర తెలంగాణ సాధించిన ప్రగతిని కవులు ఈ సభలో ప్రతిబింబించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇంకా జరగాల్సిన అభివృద్ధిని చదివారు. కవి సమ్మేళన కార్యక్రమం అనంతరం కవులను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ ఛైర్మెన్ వనమా శ్రీనివాసుదేవరావు, కమిషనర్ కోదూరు సుజాత, కౌన్సిలర్లు, కవులు, కళాకారులు గార్లపాటి రామకృష్ణ, గట్టె వాసు, పల్లం పిచ్చయ్య మల్లికార్జునరావు, రమణమూర్తి, అయ్యదేవర శేషగిరిరావు, మాలతి, వన్నెంరెడ్డి సాగర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



తొలి, మలిదశ ఉద్యమకారులకు సన్మానం

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తొలి, మలిదశ ఉద్యమకారులను దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సన్మానించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ ఉద్యమకారులను ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం ఉద్యమకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ఆయూబ్‌పాషా, బండి అంజిరెడ్డి, లోకేశ్‌రెడ్డి, చంద్రశేఖర్, చీపు జగదీశ్, ఆనంద్, షెహనాజ్, రామూనాయక్, ఆశిర్వాదం పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ చేయూత

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం కొత్తూరుతండాలో ఇటీవల మృతి చెందిన మాలోత్ నాగమ్మ కుటుంబానికి ఆదివారం బీఆర్ఎస్ నాయకులు బియ్యం, నగదును అందజేశారు. వైరా ఎమ్మెల్యే లావుడ్య రాములునాయక్ ఆదేశాలతో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు అజ్మీర వీరన్నలు కొత్తూరు తండాలో మృతురాలి ఇంటికి వెళ్ళి బియ్యం, నగదును అందజేశారు. నాగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లుఅర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొగిలి ఆదినారాయణ, ఏఎంసీ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, బీఆర్ఎస్ నాయులు సుడిగాలి బిక్షమయ్య, బత్తుల శ్రీనివాసరావు, బానోత్ నక్రు, బానోతు రూప్లా, దారావత్ హీరాలాల్, సుడిగాలి ఉపేందర్ పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



మధుర నగర్‌తండాకు చెందిన భూక్య మోతిలాల్-లక్ష్మి కుమారుడు దినేష్-సౌజన్య, భాగ్యనగర్ తండాకు చెందిన వాంకుడొత్ వీరన్న-కౌసల్య కుమారుడు భరత్-దివ్య వివాహ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలలో బీఆర్ఎస్ నాయకులు అజ్మీర వీరన్న, సర్పంచ్ బాణోత్ పద్మ రాందాస్, ఉప సర్పంచ్ భూక్య మోహన్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, నాయకులు బత్తుల శ్రీనివాసరావు, హనుమా, బానోత్ రూప్లా, మాలోత్ పడిత్యా, గుగులోత్ మోతీలాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను వెంటాడుతున్న సమస్యలు

-అధికారుల, పాలకుల విరుద్ధ ప్రకటనలు

- నేటి నుండి బడుల పునఃప్రారంభం

నవతెలంగాణ-వైరా

ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి, పాలకులు ఇస్తున్న ప్రకటనలకు విరుద్ధంగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నవి. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలతో సహా ప్రభుత్వ, జడ్పి ఉన్నత పాఠశాలలు కూడా పలు సమస్యలను ఎదుర్కొంటున్నవి. ప్రభుత్వ ప్రకటనల మేరకు సోమవారం (12.06.2023) పాఠశాలలు పున : ప్రారంభం కానున్నవి. మండలంలో 27 ప్రాథమిక, 12 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలలు ఉన్నవి. ఈ పాఠశాలల్లోని వివిధ సమస్యలను నవతెలంగాణ పరీక్షించింది. మన ఊరు - మన బడి పథకంలో 16 పాఠశాలలకు రెండేళ్ల నాడు నిధులు మంజూరు కాగా, వాటిలో కేవలం ఐదు పాఠశాలలు పూర్తి అయినవి. వాటిలో రెబ్బవరం హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, ఖానా పురం యుపిఎస్‌లు ప్రారంభానికి సిద్ధమైనవి. మిగిలిన పాఠశాలలన్నీ 75శాతం పనులు పూర్తి అయినవి. కొన్ని పాఠశాలలకు నీటి సరఫరా చేసే మిషన్ భగీరథ పైపులు పగిలి పోయి నీటి సరఫరా బంద్ అయినవి. వాటి రిపేరు మిషన్ భగీరథ వారు చేయాలా? గ్రామ పంచాయతీలు చేయాలా ? అన్న సందిగ్ధతలో ఉన్నది. శానిటేషన్ పెద్ద సమస్యగా మారిందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నవి. పాఠశాలల్లో తరగతి గదులు, ఆవరణ, ప్రతి రోజూ వూడ్చి, బాత్ రూం లు కడిగి, మంచినీళు పెట్టేందుకు గతంలో ప్రత్యేకించి ఒక వర్కర్ (చప్రాసి) ఉండేవారు. వారికి కాంటింజెన్సి నిధుల నుండి వేతనాలు ఇచ్చేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత వారిని తొలగించారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలో పని చేస్తున్న వర్కర్లకు మల్టీ పర్పస్ వర్కర్స్‌గా ముద్రవేసి పాఠశాలల పనులు కూడా చేపిస్తున్నారు. వాళ్ళు సంఘటితమై పాఠశాల పనులకు వెళ్ళబోమని చెబుతున్నారు. అందువలన పాఠశాలల్లో పారిశుధ్య సమస్య వేదిస్తున్నట్లు తెలుస్తుంది. పాఠశాలలు ప్రారంభం అయిన మరుసటి రోజు నుండి ఉపాధ్యాయుల డిప్యుటేషన్ ప్రక్రియ ప్రారంభిస్తారు. మండలంలో తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయ డిప్యుటేషన్ చేస్తారు. నారపనేని పల్లి పిఎస్‌లో కేవలం 10 మంది పిల్లలు ఉన్నారు .వైరా గుట్టబడి పిఎస్‌లో 190 మంది పిల్లలు ఉన్నారు. గుట్ట బడిలో యుపిఎస్, పిఎస్‌లకు కూడా డిప్యుటేషన్‌పై 1+1 ఉపాధ్యాయులు రావాల్సి ఉంటుంది. సబ్జెక్టుల వారీ ఉపాధ్యాయులు లేని స్కూళ్లు కూడా ఉన్నాయి. వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిరిపురం (కెజి), జడ్‌పిఎస్‌ఎస్‌లో హిందీ బోధించుటకు ఉపాధ్యాయులు లేరు. వైరా బాలికొన్నత పాఠశాల, అష్టగుర్తి ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌లు లేరు. కొన్ని పాఠశాలల్లో తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం రెండూ ఉండగా దేనికో ఒకదానికి మాత్రమే బోధకులు ఉన్నారు. వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిరిపురం (కెజి), గన్నవరం ఉన్నత పాఠశాలలకు దీర్ఘ కాలంగా ఇంచార్జ్ హెడ్ మాస్టర్లే దిక్కయ్యారు. నూతనంగా పంచాయతీగా ఏర్పడిన స్టేజీ పినపాకలో సర్పంచ్ దేనువుకొండ పుల్లం రాజు చొరవతో ఒక ప్రవాస భారతీయుని సహకారంతో పాటు గ్రామస్థులు పాఠశాల మౌలిక సదుపాయాలను కల్పించారు. మన ఊరు - మన బడి ప్రోగ్రాంలో కొన్ని సదుపాయాలు వచ్చినా, వాటి సంరక్షణ కష్టంగా మారిందని, అందువలన ప్రతి హైస్కూల్ కు నైట్ వాచ్ మెన్ నియమించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇన్ని సమస్యలు ప్రభుత్వ పాఠశాలను వేధిస్తుంటే కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉన్నాయని పాలకులు అధికారులు చెప్పటం ఆత్మ వంచన అవుతుంది. ప్రతి రోజూ ప్రతి గ్రామానికి పదుల సంఖ్యలో ఖమ్మం, వైరా, సిరిపురం, తల్లాడ మండలాల నుండి ప్రయివేటు, క్రిస్టియన్ మిషనరీ స్కూల్ బస్ లు వచ్చి విద్యార్థులను ఆయా పాఠశాలకు తరలించుకు పోతుండగా ప్రభుత్వ పాఠశాలలు రోజు రోజుకు కునారిల్లు తున్నవి.

ఖమ్మంలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

- గిరిజన బంధును వెంటనే ప్రవేశపెట్టాలి
- 17న ఖమ్మంలో ఠానూ నాయక్ విగ్రహావిష్కరణ సభను జయప్రదం చేయండి
- గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం

నవతెలంగాణ -కూసుమంచి

జిల్లాలో ఉన్న గిరిజనుల అభివృద్ధికి ఖమ్మంలో ఐటిడిఏను ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గిరిజన బంధు వెంటనే అమలు చేసి గిరిజనులకు ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఐటీడీఏ సాధన కమిటీ కన్వీనర్ భూక్యా వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో పలు తండాలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాను తండాలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాలేరు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న గిరిజన ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. భూ సమస్య, ఇళ్ల స్థలాల సమస్య, తండాలలో సైడ్ కాలువలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తమ సర్వేలో వెల్లడైన అనేక అంశాలపై గిరిజన సమీకరించి పోరాడుతామని ఆయన ప్రకటించారు. ఈనెల 17న ఖమ్మం లాకారం ట్యాంక్ పై తెలంగాణ రైతంగ సాయుధ పోరాటయోధుడు గిరిజన ముద్దుబిడ్డ జాటోత్ ఠాను నాయక్ విగ్రహ ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాను తండాలో ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, వ్యవసాయ భూములకు ధరణిలో ఉన్న సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బానోతు రంగానాయక్, బానోతు రామ్మూర్తి, బాదావత్ సైదులు, గుగులోతు నరేష్, బానోతు మంగమ్మ, గుగులోతు హన్మి, బాదావత్ విజయ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రామాలయానికి ఆదిపురుష్ సినిమా టిక్కెట్లు

- ఉచితంగా ఒక్కో రామాలయానికి 100 టిక్కెట్లు
- శ్రేయస్ మీడియా అధినేత గండ్ర శ్రీనివాస్

నవతెలంగాణ-ఖమ్మం



ఆదిపురుష్ సినిమా కోసం శ్రేయస్ మీడియా గొప్ప నిర్ణయం తీసుకుందని, ఖమ్మం జిల్లాలో ప్రతి రామాయలానికి 100 టిక్కెట్లు అందించేలా శ్రీకారం చుట్టామని ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన శ్రేయస్ మీడియా అధినేత గండ్ర శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం తెలుగు ప్రేక్షకులు ఎంతో గానో ఎదురుచూస్తున్న సినిమా ప్రభాస్ నటించిన ఆది పురుష్ ప్రభాస్ రాముడిగా, కృతి సనన్ సీతగా మరియు బాలీవుడ్ ప్రముఖ నటుడు సైఫ్ అలీ ఖాన్ రావణాసురుడిగా ఓం రౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆదిపురుష్ సినిమా ఈ నెల 16న ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో ఘనంగా విడుదలకు సిద్ధంగా ఉంది. ఉచితంగా ఖమ్మం జిల్లాలోని, ప్రతి గ్రామంలోని ప్రతి రామాలయానికి 100 టికెట్లు ఉచితంగా ఇవ్వదలుచుకున్నారు. శ్రేయస్ మీడియా అధినేత గండ్ర శ్రీనివాస్ తన సొంత డబ్బులతో ఈ టికెట్ లు కొని ఇస్తున్నారని ఆయన తెలిపారు. ఆయా ఆలయాల నుండి ఎవరైనా ఒకరు 8466012345 ఫోన్ చేసి టిక్కెట్లు పొందాలని పేర్కొన్నారు.

విజయవంతమైన నెల నెల వైద్య శిబిరం



నేలకొండపల్లి : సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధరరావు సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రావెళ్ళ భవనంలో నెల నెల ఉచిత వైద్య శిబిరంలో భాగంగా నిర్వహించిన ఆరవ వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 82 మందికి షుగర్ వైద్య సేవలు అందించగా, 37 మందికి సాధారణ వైద్య సేవలు, మరో 49 మందికి కంటి వైద్య సేవలను అందించారు. 37 మంది రోగులకు ప్రముఖ జీర్ణ కోస వ్యాధి నిపుణులు డాక్టర్ సి.భారవి, డాక్టర్ కొల్లి అనుదీప్, ఎండి డాక్టర్ పి.సుబ్బారావు వైద్య సేవలు అందించారు. 49 మంది రోగులకు ఖమ్మం శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. స్థానిక గ్రామీణ వైద్యులు శిబిరానికి విచ్చేసిన రోగులకు బీపీ చెక్ అప్ చేయగా, స్థానిక ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపల్ ఈగ అనిల్ కుమార్ వైద్య సేవల నిమిత్తం వైద్యులకు, రోగులకు సహకరించారు. ఈ కార్యక్రమంలో నూతక్కి గంగాధర్ రావు, సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు, సేవా కమిటీ సభ్యులు కేవీ రామిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, కట్టెకోల వెంకన్న, సూర్యనారాయణ, కోదండ రామారావు, నరసింహారావు, భాస్కరరావు, అబ్దుల్లా, పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కారేపల్లి

అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని స్కూటీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం ఊట్కూర్ స్టేజీ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కారేపల్లి మండలం చింతలతండాకు చెందిన వాంకుడోత్ శోభన్(35) ఖమ్మంలో సూతారి మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఆదివారం ఖమ్మం నుండి స్వగ్రామంలో చింతతండాకు స్కూటీ వాహనంపై వస్తున్నాడు. ఊట్కూర్ స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వాంకుడోత్ శోభన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మౌనిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య వాంకుడోత్ మౌనిక ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవతెలంగాణ
www.praja.khammam@gmail.com
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం 12, జూన్ 2023

రైల్వే బాక్సును పోలీస్ స్టేషన్‌లో ఇవ్వగలరు

సీఐ ముత్యం రమేష్

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు నందు రైల్వే డిపార్ట్మెంట్ సంబంధించిన బాక్స్‌ను రైల్వే ప్రయాణికులు ఆదమరచి తీసుకువెళ్లినట్లయితే తిరిగి మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలని మణుగూరు ఎస్‌హెచ్‌ఓ ముత్యం రమేష్ తెలిపారు. ఆదివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. రైల్వే అధికారుల ఫిర్యాదు మేరకు మే 8న ఉదయం 7:30 గంటలకి హైదరాబాదు నుండి మణుగూరు వచ్చిన మణుగూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు నందు రైల్వే డిపార్ట్మెంట్ వారికి సంబంధించిన ఒక బాక్స్‌ను అక్కడికి వచ్చిన ఒక వ్యక్తి పొరపాటున ఆ బాక్స్ తమదని భావించిన వారు రైల్వే స్టేషన్ నుండి తీసుకొని వెళ్లినట్టు తెలిపారు. ఎవరైనా తీసుకొని వెళ్ళినట్లయితే ఆ బాక్స్ ను తిరిగి మణుగూరు పోలీస్ స్టేషన్ నందు అప్పగించాలని కోరారు. ఆ బాక్స్‌లో ఉన్న పేపర్ ఎవరికి ఉపయోగపడదని తెలిపారు. అవి ఓన్లీ రైల్వే డిపార్ట్మెంట్ వాళ్లకి మాత్రమే ఉపయోగపడతాయన్నారు. పొరపాటున తీసుకువెళ్లిన వ్యక్తులు తిరిగి అప్ప చెప్పినట్లయితే వారి మీద ఎలాంటి చర్యలు ఉండవని తెలిపారు.

కుసుమ జగదీష్ మృతి దురదృష్టకరం

విప్ రేగా కాంతారావు సంతాపం

నవతెలంగాణ-మణుగూరు


కుసుమ జగదీష్

ములుగు జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ గుండెపోటుతో మరణించడం దురదృష్టకరమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి దురదృష్టకరం అని అన్నారు. అలాంటి వ్యక్తి చిన్న వయసులోనే దూరం కావడం బాధాకరమని, వారితో ఉన్న సాన్నిహిత్యం వారు గుర్తు చేసుకున్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ములుగు జిల్లాలో చురుకైన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, జడ్పీ చైర్మన్‌గా ప్రజలకు సేవలు అందిచారని అన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న నాయకుడి మృతి బాధాకరమని వ్యక్తం చేశారు. ఆయన మరణాన్ని నమ్మలేకపోతున్నాని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా నాటి ఉద్యమాల్లో జగదీష్ పోషించిన చురుకైన పాత్రని వారి సేవలను స్మరించుకున్నారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

సాహిత్యం, కవిత్వం తెలంగాణకు దివిటీలు

నవతెలంగాణ-అశ్వారావుపేట



కవిత్వం, సాహిత్యం తెలంగాణకు దివిటీలు అని, కవులు, కళాకారుల సాహిత్యోధ్యమం తెలంగాణ సాకారంనికి ఎంతో తోడ్పడిందని కలెక్టర్ అనుదీప్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని నిర్వహించే తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని ఆదివారం ఐడీఓసీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో ప్రముఖ రచయిత, సాహిత్య విశ్లేషకులు సిద్ధాంతాపు ప్రభాకర్ ఆచార్యులు, నవతెలంగాణ విలేకరి మడిపల్లి వెంకటేశ్వరరావులు పాల్గొని కవితా పఠనం చేసారు. అనంతరం డీపీఆర్‌ఓ శీలం శ్రీనివాస్, విద్యాశాఖ సీఎంఓ సైదులు, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సతీష్ కవులను శాలువా, జ్ఞాపికలుతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం, ఇల్లందు ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వర రావు, హరిప్రియా నాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, ప్రముఖ కవులు దిలావర్, మండవ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రజాగర్జనకు ఏఐటీయూసీ ఎర్రసైన్యం

వై.రాంగోపాల్

నవతెలంగాణ-మణుగూరు



సీపీఐ ప్రజాగర్జనకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఎర్రసైన్యం బయలుదేరిందని బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్ తెలిపారు. కొత్తగూడెంలో జరిగే సిపిఐ ప్రజాగర్జన సభకు సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు గుర్తించాలని, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రశ్నార్థకమవుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల ప్రజా గర్జన సభకు వెళుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వి.రామనర్సయ్య, గోపిశెట్టి శివయ్య ఆవుల నాగరాజు, మేకల ఈశ్వర్, నంబూరు శ్రీనివాస్, ఎస్కే సుభాని, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నాయకులు మునియ్య మృతి

నివాళులు అర్పించిన పుల్లయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట



వినాయకపురంకు చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మండల కమిటీ సభ్యులు దానపు మునియ్య (60) గత కొన్నాళ్ళుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆయన స్వగృహంలో శనివారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆదివారం సమాచారం తెలుసుకున్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లయ్య, మండల కార్యదర్శి చిరంజీవిలు వినాయకపురం చేరుకుని మునియ్య భౌతిక కాయం పై పార్టీ పతాకాన్ని కప్పి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ముళ్ళగిరి గంగరాజు, జగన్నాథం, సత్యనారాయణ, భద్రంలు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సోమవారం నాడు భద్రాచలం పాత ఎల్ఐసీ ఆఫీసు రోడ్డులోని ఆల్ పెన్షనర్స్ భద్రాచలం డివిజన్ కార్యాలయంలో శరత్ మాక్స్ విజన్ ఐ ఆసుపత్రి వరంగల్ వైద్యులచే ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ప్రధాకార్యదర్శి కె.ఎస్.ఎస్.వి.ప్రసాద్, కోశాదికారి డి.కృష్ణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కేటరాక్ట్ ఉన్న వారినివారి స్వంత వాహనంలో తీసుకువెళ్లి ఆపరేషన్ చేసి తీసుకురాన్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, హెల్త్ కార్డులు కలిగిన వారు, జర్నలిస్టులు, కొల్ మైన్ పెన్షనర్స్ అర్హులని తెలిపారు. కావున తప్పని సరిగా హెల్త్ కార్డులు తీసుకు రావాలని కోరారు.

అగ్నిప్రమాద కుటుంబానికి దోసపాటి చేయూత

నవతెలంగాణ-అశ్వాపురం : మండలంలోని కొమ్ముగూడెంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో చాప పాపారావు పూరిల్లు దగ్ధమై ఇంట్లో ఉన్న బియ్యం, బట్టలు, సామాన్లు, వ్యవసాయ పనిముట్లు, సర్వం కోల్పోయి కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. ఈ విషయం తెలుసుకున్న దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహుకులు శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి నాగేశ్వరరావు ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించి బియ్యం, వంట పాత్రలు, బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివకామేశ్వరి గ్రూప్స్ సిబ్బంది దాస్, వెంకటేష్ పాల్గొన్నారు.



వాహనాల నిర్వాహణకు టెండర్ల ఆహ్వానం

నవతెలంగాణ-ఇల్లందు : సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని ఏరియా హాస్పిటల్ నందు నిర్వహణకు 2 అంబులెన్స్ వాహనాల కోరకు టెండర్లను కోరడమైనది. చివరి తేదీ ఈ నెల జూన్ 26 సా.4.30 వరకు దరఖాస్తులు స్వీకరించబడునని యాజమాన్యం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వాహన టెండర్ దరఖాస్తులకు అర్హులు మొదటి ప్రాధాన్యత ఒసి ప్రభావిత నివాసులు, భూ నిర్వాసితులు, రెండవ ప్రాధాన్యత. మాజీ కార్మికుల నిరుద్యోగ పిల్లలు, మూడవ ప్రాధాన్యత, ఒసి ప్రభావిత ప్రాంత నిరుద్యోగులు దరఖాస్తు దారులు తగిన ధృవీకరణ పత్రాలు, ఆధారాలతో సంప్రదించి దరఖాస్తు చెసుకోవాలని కోరారు. వివరాలకు పర్చేజ్ విభాగం జీఎం కార్యాలయం ఇల్లందు ఏరియా నందు సంప్రదించాలని తెలిపారు.

21న లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-భద్రాచలం



లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం 32వ ప్రమాణస్వీకారం జూన్ 21వ తారీఖున పట్టణంలోని గోదావరి ఇన్‌లో ఉదయం 11 గంటలకు జరుగుతున్నట్లు అధ్యక్షులు భీమవరపు వెంకటరెడ్డి, కార్యదర్శి గుండు శరత్, కోశాధికారి జి.భరత్ కుమార్ జరిగిన జనరల్ బాడీ సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మోహన్ రావు, ఎలెక్ట్ గవర్నర్ సిహెచ్ శివప్రసాద్, ఆర్సీలు, జడ్సీలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వై.సూర్యనారాయణ, డాక్టర్ ఎస్ ఎల్ కాంతారావు, లక్ష్మీనారాయణ, పి.దేశప్ప, సోమరౌతు శ్రీనివాసరావు, తిప్పనసిద్ధులు, భోగాల శ్రీనివాస్ రెడ్డి, బోనాల సూర్యనారాయణ, అడబాల వెంకటేశ్వరరావు, వెంకటాచార్యులు, అరికెల తిరుపతిరావు, ఎం.నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో...

సాహిత్యందే కీలక పాత్ర

- ఎమ్మెల్యే వనమా
- సాయుధ పోరాటంలో ఉద్యమంలా వెలిగినట్లు సాహిత్యం
- ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ
- తెలంగాణ ప్రజలను చైతన్య పరిచిన సాహిత్యం
- కలెక్టర్ అనుదీప్
- జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా సాహిత్య దినోత్సవం



నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ ఉద్యమంలో సాహిత్యందే కీలక పాత్ర అని, ఉద్యమంలో గళం గళం కలిపిన కవులని కొత్తగూడెం శాసనసభ సభ్యులు వనమా వెంకటేశ్వర రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన సాహితి దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, కళాకారులకు పుట్టినిల్లు భద్రాద్రి కొత్తగూడెం అని చెప్పారు. పాల్వంచ నుండి తెలంగాణ ఉద్యమం ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ ప్రాంత వాసులకు అన్యాయం జరుగుతుందని వెలుగెత్తి చాటిన ఉద్యమ కారులున్న జిల్లా అని చెప్పారు. పాల్వంచ ఉద్యమాల గడ్డ అని, ఎందరో మహనీయులు త్యాగం చేశారని వారి త్యాగ నిరతిని కొనియాడారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయలపై కవుల గేయాలు ప్రజలను ఆలోచింపచేసాయని చెప్పారు. సాహిత్యం పై ముఖ్యమంత్రికి ఎనలేని ప్రేమ ఉన్నదని, ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని రానున్న తరాల వారికి తెలియచేసేందుకు సాహిత్య దినోత్సవం జరుపుకుంటున్నట్లు చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో కళాకారులు త్యాగ నిరతిని తలుచుకోవడం చాలా సంతోషమని చెప్పారు. గేయాలు ఉద్యమానికి ఊపిరి ఇచ్చాయని, కవులు కళాకారులు రాష్ట్ర సాధనలో ప్రముఖ ప్రఖ్యాత పోషించారని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో కవులు, కళాకారులను సత్కరించుకోవడం మన అదృష్టమని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సాహిత్యం ఉద్యమంలా వెలిగి ప్రజలను చైతన్య వంతులను చేసినట్లు చెప్పారు.

ఇల్లందు శాసనసభ్యులు బాణోత్ హరిప్రియ మాట్లాడుతూ తెలంగాణ సాయుదపోరాటంలో సాహిత్యం ఉద్యమంలా వెలిగినట్లు చెప్పారు. ప్రజలను చైతన్య పరిచే విధంగా ఆనాటి నుండి నేటి వరకు సుద్దాల అశోక్ తేజ నుండి కాళోజీ వరకు ప్రజలను చైతన్యం, జాగృత పరిచాయని చెప్పారు. కవుల గేయాలు ప్రజలను చైతన్యం, జాగృతి చేశాయని చెప్పారు. నిధులు, నీళ్లు, నియామకాలు ప్రధాన అజెండాగా తెలంగాణ ఉద్యమం సాగినట్లు చెప్పారు. వృధా అవుతున్న గోదావరి నీటిని పరవళ్లు తొక్కుతున్న గోదావరిని వెనక్కి మళ్లించి కాళేశ్వరం నిర్మించి బీడు భూములను సస్యశ్యామలం చేసినట్లు చెప్పారు. రైతు కష్టాలు తీర్చేందుకు రైతుబంధు చేపట్టినట్లు చెప్పారు. సంపదను పెంచి ప్రజలకు సంక్షేమ పథకాలు పంచుతున్నట్లు చెప్పారు. 80 వేల ఉద్యోగాలు భర్తీకి దశల వారిగా భర్తీ చేపడుతున్నట్లు చెప్పారు. అన్ని రంగాల వారు సంతోషంగా ఉండే విధంగా ముందుకు పోతున్నట్లు చెప్పారు. తెలంగాణ యాస, భాషలతో వేలాది, లక్షలాది మందిని చైతన్యం చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు తదుపరి తెలంగాణ యాస, భాషలు ఇతరులు అనుకరించే స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. సాహితీ దినోత్సవంలో తమ కవితలు వినిపించడానికి వచ్చిన కవులను అభినందించారు. నేడు ఏ సినిమాలోనైనా తెలంగాణ యాసలో పాటలు లేకుండా ఉండే పరిస్థితి వచ్చిందని చెప్పారు.

జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ కవుల కలాల నుండి జాలు వారిన సాహిత్యం తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో ఉపయోగ పడినట్లు చెప్పారు. కవులు, కళాకారుల కవితలు పాటలు ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్య వంతులను చేసినట్లు చెప్పారు. వీరందరి కవితల వల్ల తెలంగాణ కావాలన్న ఆకాంక్ష పెరిగినట్లు చెప్పారు. తెలంగాణ వద్దని అడ్డుపడిన వారిని సైతం చైతన్య వంతులను చేసారని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు తదుపరి గొప్ప ప్రగతి సాధించామని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ భావితరాలకు తెలియ చెందేందుకు సాహిత్యం, చరిత్ర తెలిపేందుకు సాహితీ దినోత్సవ వేడుకలు ఎంతో ఉపయోగ పడుతున్నాయని చెప్పారు.

ఈ సాహితీ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు విజేతనేనని చెప్పారు. సాహితీ వేడుకలకు చిన్నారులు సైతం రావడం చాలా సంతోషమని చెప్పారు. మన జిల్లా నుండి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని అవార్డులు సాధించాలని చెప్పారు. పెద్దలు ముందు కవితలు చడవడమే గొప్ప అవకాశమని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, డిపిఆర్‌ఓ శ్రీనివాస్, మహిళ సంక్షేమ అధికారి సబిత, సిపిఓ శ్రీనివాసరావు, విద్యాశాఖ కో ఆర్డినేటర్ సైదులు సీనియర్ కవులు దిలావర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సరోజినీ వృద్ధాశ్రమానికి ఫినాయిల్ వితరణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సరోజినీ వృద్ధాశ్రమంలోని పరిసర ప్రాంతాలను శుభ్రపరచుకునేందుకు రూ.42,000 విలువగల ఫినాయిల్ బాక్సులను వితరణగా ఎమ్మెల్యే పొదెం వీరయ్య సహాయంతో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఇచ్చారు. సరోజినీ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు సరోజినీ వారి ఆశ్రమంలో ఉన్న వృద్ధులలో అత్యధిక సంఖ్యలో మంచం మీద నుంచి లేవలేని వారు, దివ్యాంగులు, వికలాంగులు, ఉన్నారని రోజు వారు ఉంటున్న పరిసర ప్రాంతాలు సుబ్రపరచి దుర్వాసన రాకుండా ఫినాయిల్ ఎక్కువగా వాడవలసి వస్తుందని తమరి ద్వారా ఏదైనా సాయం చేయగలరని సరోజినీ ఎమ్మెల్యేని కోరగా వారు వెంటనే స్పందించి వారికి సంవత్సర కాలం పాటు సరిపడా రూ.42 వేల విలువల ఫినాయిల్ బాక్సులను భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా ఇప్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతరేల రవికుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భోగల శ్రీనివాసరెడ్డి, సరెళ్ళ వెంకటేష్, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు చింతరేల సుధీర్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంబటి మణికంఠ, బలబద్రి మణికంఠ, నాగరాజు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే హరిప్రియ పాలాభిషేకం

నవతెలంగాణ-ఇల్లందు

స్థానిక జగదాంబ సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర ఆదివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి వికలాంగులతో కలిసి ఎమ్మెల్యే హరిప్రియ పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో దివ్యాంగులకు ప్రస్తుతం ప్రతినెల ఇస్తున్న రూ.3116 పెన్షన్లు మరో వేయి పెంచడం గొప్ప నిర్ణయం అన్నారు. వచ్చే నేల ప్రతి దివ్యాంగులకు రూ.4116 చెల్లింపు జరుగుతుందని అన్నారు. దివ్యాంగులకు వెయ్యి రూపాయలు పెంచిన సందర్భంగా కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి పులిగండ్ల మాధవరావు, హరి హర క్షేత్ర ఆలయ చైర్మన్ కృష్ణా, జిల్లా నాయకులు యలమద్ది రవి, ఇల్లందు పట్టణ ప్రచార కార్యదర్శి, సోషల్ మీడియా ఇన్చార్జి, గిన్నారపు రాజేష్, ప్రచార కార్యదర్శి రాచపల్లి శ్రీను, టేకులపల్లి మండల అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్, ఉపాధ్యక్షుడు చీమల సత్యనారాయణ, కాలే ప్రసాద్, పట్టణ నాయకులు అదురి రవి, తుంగపల్లి మహేష్, ఇల్లందు పట్టణ యువజన నాయకులు పాలడుగు రాజశేఖర్, నెమలి నిఖిల్ వికలాంగులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్యను పరిష్కరించాలి

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణిలో ఈపీ ఆపరేటర్లకు సూటబుల్ జాబ్ సమస్యలను పరిష్కరించాలని సింగరేణి డైరెక్టర్ "పా" ఎన్ బలరాం డైరెక్టర్ ఆపరేషన్స్ ఎస్.వి.కే.శ్రీనివాస్ పర్సనల్ డిపార్ట్మెంట్ జీఎంలు కె.బసవయ్య, ఏ.కుమార్ రెడ్డి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, టీబీజీకేఎస్ కొత్తగూడెం ఏరియా నాయకులు ఎండి.రజాక్ పాషా, ఈపీ ఆపరేటర్ల ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా వివిధ ఓపెన్ కాస్ట్ గనులలో పనిచేస్తున్న ఈపి ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్య పరిష్కారానికి సంబంధించి కేంద్ర కార్మిక శాఖ సమక్షంలో సింగరేణి గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌తో పాటు జాతీయ కార్మిక సంఘాలతో సింగరేణి యాజమాన్యం గత సంవత్సరం ప్రారంభంలో చేసుకున్న రాతపూర్వక ఒప్పందం నేటి వరకు అమలు కాలేదన్నారు. ఒప్పందాన్ని అమలు చేయాలని మాకు న్యాయం చేయాలని కోరుతూ అనేక సందర్భాలలో సింగరేణి యాజమాన్యానికి అగ్రిమెంట్‌లో సంతకాలు పెట్టిన అన్ని కార్మిక సంఘాల ప్రధాన నాయకులను కూడా ఈపి ఆపరేటర్లుగా మేము కలవటం వినతి పత్రాలు అందజేయటం జరిగిందన్నారు. నేటికి ఆ సమస్య సమస్యగానే మిగిలి పోయిందన్నారు. తిరిగి మరలా సింగరేణిలో గుర్తింపు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతున్న నేపథ్యంలో మా సమస్య మరుగున పడిపోతుం దేమోనని మేము ఆందోళనకు గురవుతా ఉన్నామన్నారు. సమస్య పరిష్కారానికి నోచుకోక అనేకమంది ఆపరేటర్లు జనరల్ మజ్దూర్‌లుగా "డి"ప్రమోట్ అయి ఇబ్బంది పడుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. సింగరేణి ఉత్పత్తి ఉత్పాద కతలలో కీలక పాత్ర పోషించే ఈపి ఆపరేట్ల సమస్య పరిష్కారానికి డైరెక్టర్లు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్య పరిష్కారానికి సత్వరమే తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏ చిన్న తప్పిదం జరిగినా ఈపి ఆపరేటర్లకు ఇంక్రిమెంట్ల కోత చర్యలపై యాజమాన్యం పునరాలోచించాలి, కొత్తగూడెం రీజియన్ నుండి అనగా మణుగూరు, సత్తుపల్లి, ఇల్లెందు ఏరియాల నుండి గోదావరిఖని టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టిటిసి)కి రిఫ్రెషర్ శిక్షణకు వెళ్లిన ఆపరేటర్లకు, ఇతర ఉద్యోగులకు రానుపోను ఓడి ఇవ్వాలి, కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్న ఆపరేటర్లకు తగువిధంగా న్యాయం చేయాలి, రివైజింగ్ పేరుతో జాప్యం చేయకుండా ఆపరేటర్ల ప్రమోషన్ పాలసీ అమలు చేయాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాజర్ పాషా, షేక్ బాజీ పాషా, సుభాష్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడే తెలంగాణ 2కే రన్

డీఎస్పీ రాఘవేంద్రరావు

నవతెలంగాణ-మణుగూరు

నేడు తెలంగాణ 2కే రన్ జయప్రదం చేయాలని మణుగూరు డీఎస్పి ఎస్.వి.రాఘవేంద్రరావు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మణుగూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ 2కే రన్‌లో ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 12వ తేదీన ఉదయం 6 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రి, మణుగూరు నుండి లారీ యూనియన్ ఆఫీస్, మణుగూరు వరకు ఈ 2కే రన్‌ను నిర్వహించడం జరుగుతుందని డీఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు అందరూ భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గిరిజన బంధు తక్షణమే అమలు చేయాలి

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-సుజాతనగర్



మునుగోడు ఉప ఎన్నికల్లో ప్రకటించిన గిరిజన బంధును తక్షణమే అమలు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి మండల పరిధిలోని కోయగూడెం గ్రామ పరిధిలోని ఉప్పరిగూడెంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికలు జరిగిన ప్రతి సందర్భంలో అక్కడి ప్రజలను మభ్య పెట్టేందుకు ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెట్టి ప్రచారం చేయడం సీఎం కేసీఆర్‌కి అలవాటని అన్నారు. ఉద్యమ సమయంలో అందే శ్రీ రాసిన తెలంగాణ గేయం తెలంగాణ రాష్ట్ర జాతీయ గీతంగా ప్రకటించి అధికారం వచ్చాక ఆ గీతం కూడా వివక్షకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు."జయ జయహే తెలంగాణ" అని అందెశ్రీ రాసిన గీతం అనేక ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రజల నాలుకల్లో నానిందని అలాంటి పాటను సైతం తెలంగాణ ప్రజలకు దూరం చేసిన ఘనత కెసిఆర్‌కి దక్కుతుందని అన్నారు. కోయగూడెం 7వ వార్డ్ సభ్యురాలు భూక్య శారదా ఆధ్వర్యంలో పలువురు బీఎస్పీలో చేరారు, వారికి కామేష్ ఖండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున రావు, పాయం శారద, భూక్య అచ్చమ్మ, బాణోత్ కుమారి, వనిత, అశోక్, శిరీష పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి : సీఐ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం ఫుట్బాల్ అసోసియేషన్ క్లబ్ వారి ఆధ్వర్యంలో గత 40 రోజులుగా ఉచితంగా ఫుట్బాల్ క్యాంప్‌ని నిర్వహిస్తున్నటువంటి సందర్భంలో క్యాంపు ముగింపు కార్యక్రమం, ప్రైస్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు రెడ్డి చేతుల మీదగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి పట్టణ సీఐ మాట్లాడుతూ ఫుట్బాల్ అసోసియేషన్వారిని, కోచింగ్ ఇచ్చినటువంటి ఆరుగురు కోచ్‌లను అభినందించారు. జరిగిన టోర్నమెంట్లో విన్నర్స్ టీం, రన్నర్స్ టీంని ఇద్దరినీ అభినందించారు. పిల్లలు ప్రతిరోజు ఉదయం ఏదో ఒక విధమైనటువంటి గేమ్‌ను అభ్యసించడం ద్వారా శారీరకమైనటువంటి ఫిట్నెస్ మాత్రమే కాకుండా, పిల్లలలో చక్కని క్రమశిక్షణ కూడా చేకూరుతుందని తెలిపారు. చిన్నతనం నుంచి ఏదో ఒక ఆటల ద్వారా సర్టిఫికెట్లు సంపాదించినట్లయితే స్పోర్ట్స్ కోట ద్వారా భవిష్యత్తులో పిల్లలకు ఉద్యోగాలు వస్తాయనితెలిపారు. విన్నర్స్ టీంలో ఒక సభ్యుడైనటువంటి గొంగడి సాహిత్ రెడ్డిని సర్టిఫికెట్, షీల్డ్, మెడల్, ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో, భద్రాచలం ఫుట్బాల్ అసోసియేషన్ వారు, కోచ్‌లు, క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ ఇండ్లు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) నియోజకవర్గ కన్వీనర్ మచ్చా



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలంలో చాలా కాలంగా ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్న వారందరికీ డబల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని, ఇండ్ల స్థలాలు ఉన్నవారికి ఇండ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) భద్రాచలం నియోజకవర్గం కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. మూడవ జోన్ పార్టీ కమిటీ సమావేశం వార్డు కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇల్లు లేని వారందరికీ డబల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని, అప్లై చేసిన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన బీసీలకు రూ.1లక్ష లోన్ సౌకర్యం పేదలందరికీ శాంక్షన్ చేయాలని కోరారు. అనంతరం బండారు శరత్ బాబు కన్వీనర్‌గా, ఎస్డి.ఫిరోజ్, ఎస్.శేషగిరిరావు, జై.నాగేంద్రరావు సభ్యులుగా మరో పదకొండు మందితో జోన్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి.నర్సారెడ్డిలు ప్రసంగించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియూ



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు జీవో నెంబర్ 22 ప్రకారం జీతాలు చెల్లించాలి, బోనస్ 20 శాతానికి పెంచాలి, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి, వర్క్ ఆర్డర్‌తో సంబంధం లేకుండా కార్మికులందరికీ కూడా ఫ్రీ మెడికల్ అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కుటుంబ సభ్యులకు ఫ్రీ మెడికల్ సౌకర్యం కల్పించాలని లేదా ఈఎస్ఐని అమలు చేయాలని, సీఐటీయూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మంద నరసింహారావు, సీఐటీయూ సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.మధు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తగూడెం బ్రాంచ్ కోశాధికారి. సూరం ఐలయ్య బ్రాంచ్ కార్యదర్శి గిడ్ల. శ్యాంకుమార్ శనివారం డైరెక్టర్ (పా) బలరామ్‌కు మెమోరాండాన్ని అందజేశారు.

వచ్చే ఎన్నికల్లో తప్పక పోటీ చేస్తాం

- పినపాక నియోజకవర్గం టీడీపీ పార్టీ నాయకులు



నవతెలంగాణ-కరకగూడెం

పినపాక నియోజకవర్గం కరకగూడెం మండల పరిధిలోని రాళ్లవాగు పెద్దమ్మతల్లి ఆవరణలో ఆదివారం మండల టీడీపీ అధ్యక్షుడు సిరి శెట్టి కమలాకర్, పినపాక నియోజకవర్గం సమన్వయకర్త చందా మధు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గం నాయకులు మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేస్తుందని స్వర్గీయ ఎన్టీఆర్ రాజకీయ ఆశయాలను ప్రజలకు ఉపయోగపడే విధంగా తెలంగాణలో నిర్వహించే 2024 ఎన్నికల్లో పాల్గొంటామని తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే సొంత మండలంలోని తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారని టిడిపి నాయకులు తెలియజేశారు. గిరిజన నాయకులు అయినటువంటి చందా మధు, వట్టం నారాయణ, బచ్చల భారతి ముగ్గురిలో ఎవరికి అధిష్టానం సీటు కేటాయించిన సహకరించుటకు తీర్మానం చేయడం జరిగినది అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్, అశ్వాపురం ప్లాంట్ టిఎన్టియుసి అధ్యక్షులు కూరపాటి శ్రీనివాస్, పినపాక నియోజకవర్గం మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు సీనియర్ నాయకులు, రాష్ట్ర నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పోలీస్ 2కే రన్‌ను విజయవంతం చేయండి : ఎస్సై

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జూన్ 12వ తేదీన పోలీస్ 2కే రన్ నిర్వహిస్తున్నట్లు లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. లక్ష్మీదేవి పల్లిలోని మార్కెట్ యార్డ్ నుంచి ప్రకాశం స్టేడియం వరకు పోలీస్ రన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి ఉత్సాహవంతులైన యువతీ, యువకులు మండలంలోని గ్రామాల నుండి పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోలీసు రన్‌లో పాల్గొంటున్న యువతీ యువకులకు టీ షర్టు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోలీసు రన్‌లో అధిక సంఖ్యలో యువతీ, యువకులు పాల్గొని పోలీస్ రన్‌ని విజయవంతం చేయగలరని కోరారు.

అగ్నిప్రమాద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ చేయూత



నవతెలంగాణ-అశ్వాపురం

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమై ఇంట్లో ఉన్న బియ్యం, బట్టలు, సామాన్లు, సర్వం కోల్పోయి కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడ్డ మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన చాప పాపారావు కుటుంబానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ చేయూతనిచ్చింది. పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, మండల అధ్యక్షులు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు బట్టా విజయ గాంధీ సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధితులకు, బియ్యం రూ.2వేల నగదును అందజేశారు.

ఘనంగా ముత్తినేనివాసు జన్మదిన వేడుకలు


- హాజరైన ప్రముఖులు

నవతెలంగాణ-అశ్వాపురం

మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో శనివారం రాత్రి ఎంపీపీ ముత్తినేని సుజాత ఆమె భర్త వాసు జన్మదిన వేడుకలు నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య హాజరయ్యారు. తొలుత కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలియజేశారు. ఈ మేరకు తమ నాయకుడు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కార్యాచరణను సిద్ధం చేసినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యకర్తలు నాయకులు అందరూ ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎండి షర్ఫుద్దీన్, వేమనపల్లి రమేష్, తొక్కని మధుసూదన్ రెడ్డి, ఎస్కే ఖదీర్, కమటం నరేష్, బొబ్బల నాగేశ్వరరావు, అక్కినపల్లి రమేష్, వలబోజు మురళి పాల్గొన్నారు.

ఉద్యమకారుడిగా చురుకైన పాత్ర

- ములుగు జిల్లా జడ్పీ చైర్మెన్ జగదీష్ మృతికి హరిప్రియ నివాళి



నవతెలంగాణ-ఇల్లందు

ములుగు జిల్లా జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కుసుమ జగదీష్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరిప్రియ ములుగు జిల్లా అడవి మల్లంపల్లికి వెళ్లి కుసుమ జగదీష్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి సంతపాన్ని తెలియజేశారు. వారి అకాల మరణం కుటుంబానికి తీరని లోటని సంఘటన దురదృష్టకరం అనన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా ఆనాడు ఉద్యమంలో జగదీష్ చురుకైన పాత్ర పోషించారన్నారు. ములుగు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, జడ్పీ చైర్మన్‌గా ప్రజలకు సేవలు అందిచారని ఎంతో భవిష్యత్ ఉన్న నాయకుడి మృతి బాధాకరమని ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట బానోత్ రామ నాయక్, బానోత్ రవి నాయక్, గుగులోతు కృష్ణ, నాగేందర్, భానోత్ రవీందర్ తదితరులు ఉన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

చంద్రుగొండ : హిందుస్థాన్ (హెచ్‌పీ) పెట్రోల్ బంక్ ఎదురుగా ఇందిరానగర్ కాలనీలో పిడుగు పడి నున్న వెంకన్న అనే రైతుకు చెందిన తొమ్మిది నెలల సూడిగేద ఆదివారం మృతి చెందింది. సుమారు 60 రూపాయలు ఉంటుందని రైతు వాపోతున్నాడు. ప్రభుత్వ ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కవి సమ్మేళనంలో రాగా విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన తెలంగాణా సాహిత్య దినోత్సవంలో జరిగిన కవి సమ్మేళనంలో కొత్తగూడెం శ్రీరాగా స్కూల్ విద్యార్థి పెరూరి కిషోర్ కుమార్ వినిపించిన కవితకు కవులనుంచి, అతిధిలనుంచి అధిక ప్రశంసలు అందాయి. అందుకు గానూ అతిధుల చేతుల మీదుగా కిషోర్ కుమార్‌ను శాలువాతో సత్కరించి రూ.1,000లు నగదును బహూకరించారు. కవులు, అతిథుల నుంచి ప్రశంసలు అందుకున్న కిషోర్‌ని కరస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్, డైరెక్టర్ కవిత, ఉపాధ్యాయులు సంధ్య, రాంబాబు, శ్రీధర్, కిషోర్‌ను అభినందిచారు.



అభివాదం చేస్తున్న నాయకులు



పోటెత్తిన ఎర్రదండు....

అరుణామయంగా మారిన కొత్తగూడెం

- మండుటెండలో సీపీఐ రణ నినాదం
- ప్రతిధ్వనించిన గూడెం పురవీధులు

నవతెలంగాణ-కొత్తగూడెం

ఎర్రదండు కదం తొక్కింది... ఎర్ర చొక్కా,... ఎర్ర చీర,... చేతిలో ఎర్రజెండాతో సిపిఐ కార్యకర్తలు కొత్తగూడెంకు భారీగా కదలివచ్చారు. రాష్ట్ర నలుమూలన నుండి సీపిఐ శ్రేణులు గూడెం చేరుకున్నారు. ఎటు చూసినా అరుణ మయంగా మారింది. పట్టణం మొత్తం ఎర్రతోరణాలతో నిండిపోయాయి. కార్యకర్తల నినాదాలతో గూడెం పట్టణం ప్రతిధ్వనించింది. ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో జరిగిన ప్రజాగర్జన సభకు జనం పోటెత్తారు. గ్రామ గ్రామం నుండి భారీగాప్రకాశం స్టేడియంకు చేరుకున్నారు. ఎండతాపాన్ని కమ్యూనిస్టు కార్యకర్తలను నిలువరించలేకపోయాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలను లెక్కచేయకుండా, 45 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలను పక్కకు నెట్టి ప్రజాగర్జన సభకు చేరుకున్నారు. మారుమూల ప్రాంతాల నుండి ప్రజా గర్జన సభకు కదిలివచ్చారు. వేలాది మంది రెడ్ షర్ట్ వాలంటీర్లు కదం తొక్కారు. ఎర్రచీరలు ధరించిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి భారీ జనసమీకరణ జరగగా సిపిఐ కార్యకర్తలు రాష్ట్ర నలు మూలల నుండి తరలివచ్చారు. ప్రధానంగా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుండి వేలాది మంది రైళ్ల, ప్రత్యేక వాహనాల్లో ప్రజాగర్జనకు తరలివచ్చారు.

గత కొంతకాలంగా ఖమ్మం కేంద్రంగా సాగుతున్న రాజకీయ సమీకరణాల్లో సిపిఐ తన సత్తా చాటి సరికొత్త చర్చకు దారి తీసినట్లయింది.

రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కమ్యూనిస్టుల పాత్రపైన అప్పుడే చర్చ మొదలైంది. గత ఎన్నికల్లో సిపిఐ, టిడిపి, కాంగ్రెస్ ఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదింటిలో ఎనిమిది స్థానాల్లో విజయం సాధించిన విషయం విధితమే. దీనితో రాజకీయ పార్టీలు, ఎన్నికల సమీకరణాల వైపు ఆలోచించేలా ప్రజాగర్జన సభ జరిగింది. ప్రకాశం స్టేయియంలో ఏర్పాటుచేసిన ప్రజగర్జణ సభ వేదిక మీదికి పార్టీ నేతలను జిల్లా కార్యదర్శి ఎస్‌కె. షాబీర్‌పాష ఆహ్వానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సభ అధ్యక్షతన జరిగిన సభలో సభాధ్యక్ష ఉపన్యాసంతో సభ కార్యక్రమాలు ప్రారంభించారు.

ఎర్రజెండాను విమర్శించే అర్హత ఎవరికి లేదు : కూనంనేని

దేశంలో ఎర్రజెండా పోరాటాలు లేకుండా ఏది సాధించలేదు. 100 సంవత్సరాల క్రితమే ఎన్నోపోరాటాలు చేసి కార్మికుల 8 గంటల పనిదినాలు సాధించిన మేడే ఎర్రజెండా కృషి ఫలితమే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశవరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతో ప్రాణత్యాగాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పాదయాత్రలు, ధర్నాలు, ఆందోళనలు చేసిన విషయాన్ని చెప్పారు. అసలు తెలంగాణ నిజాం నవాబ్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసింది కమ్యూనిస్టులే అన్నారు. 4వేల మంది కమ్యూనిస్టులు అసువులు బాసారని తెలిపారు. తెలంగాణ సాధనకు ఏనాడో కమ్యూనిస్టులు పోరాటాలు చేశారని చెప్పారు. బొగ్గు గని కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేసింది సిపిఐ అనుబంధ కార్మిక సంఘమే అన్నారు. పోరాటాలు చేయకుండా ఏదీ సాధించలేదు. అన్ని రంగాల్లో కార్మికులు, ఉద్యోగులు, సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసింది ఎర్రజెండా అన్నారు. పేదలకు కష్టాలు వచ్చినప్పుటు ఎర్రజెండా కన్నెర్రచేస్తుందని చెప్పారు. కమ్యూనిస్టు జిల్లా ఖమ్మం జిల్లా అన్నారు. బిజెపీ ఈ జిల్లాలో అడుగు పెట్టనివ్వమన్నారు. బిజెపికి అధికారం ఉందికాబట్టే మనుష్యులాగ్గా ఉన్నారు. అధికారంలేకుంటే పశువుల్లాగా బతుకుతారని బిజెపిని విమర్శించారు. కమ్యూనిస్టులు అమ్ముడు పోయారని చెప్పేవారు బహిరంగంగా వచ్చి నిరూపించాలని సవాల్ విసిరావు. ఎర్రజెండాకు మొదిటి శత్రువు, రెండవ శత్రువు, మూడవ శత్రువు బిజేపి అని స్పష్టం చేశారు. ఇప్పుడొచ్చి హిందు మతాన్ని కాపాడు తామని చెప్పడం సిగ్గు చేటన్నారు. మీకంటే ముందు కమ్యూనిస్టులు ఉన్నారు, హిందు మతానికి ఏమి కాలేదు. ముస్లీములు పాలించారు, బ్రిటీష్ వారు పాలించారు, అయినప్పటికీ హిందు మతానికి ఏమి కాలేదు. ఇప్పుడొచ్చిన బీజేపి మాట్లాడం సిగ్గుచేటన్నారు.





ఉత్తమ ఉద్యోగికి ఆత్మీయ సత్కారం

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణిలో పనిచేస్తున్న ఉత్తమ ఉద్యోగికి ఆత్మీయ సత్కారం చేసినట్లు సింగరేణి కాలరీస్ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మణుగూరు ఏరియాలోని ఉద్యోగులందరిలో అత్యంత ప్రతిభ కనబరిచిన బండారు జయరాజు (ఎస్ అండ్ పిసి)ని మణుగూరు ఏరియా సింగరేణి యాజమాన్యం సత్కరించారు. సింగరేణి కాలరీస్ ఎస్సీ అండ్ ఎస్టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(1630/1982) ఆధ్వర్యంలో మరొకసారి ఘనంగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఈ కోట శ్రీనివాసరావు, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మేకల ఈశ్వర్, బ్రాంచ్ సెక్రెటరీ పీక శంకర్, కాసర్ల అనిల్ కుమార్, మందడి సంజీవరావు, భోగ రజలింగు, బూర్గుల వెంకటరత్నం, భీమా దేవేందర్, అంతోటి మార్క్స్, చిత్తూరు రవిబాబు, గాజుల భార్గవ్, దాసరివెంకటేశ్వర్లు, దినేష్ వెంకటేశ్వర్లు, రవికుమార్, ఇతర ఉద్యోగులు, నాయకుల అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భద్రాచలంలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు

- హాజరైన కలెక్టర్



నవతెలంగాణ-భద్రాచలం

ప్రత్యేక తెలంగాణ కోసం 1969 నుంచి జరుగుతున్న ఉద్యమంలో ఎంతోమంది కవులు, కళాకారులు, తమ వంతు పాత్ర పోషించారని, తెలంగాణ వచ్చిన తర్వాత సాహితీవేత్తలకు, కవులు, రచయితలకు, సముచిత స్థానం దక్కిందని కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అన్నారు. ఆదివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సాహిత్య దినోత్సవం సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం ఆవరణలోని భక్త రామదాసు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న సాహిత్యానికి, సాహితీవేతలు, కవులు, రచయితలు, తమ రచనలతో పద్యాలతో నేడు సమాజంలో ఉన్న ప్రజలకు, రాబోయే తరానికి సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడానికి ఎంతో కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా ఈరోజు వారిని సన్మానించుకోవడం ఎంతో గర్వకారణమని అన్నారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన కంచర్ల గోపన్న, ఆదికవి హరిబట్టు, దాశరధి కృష్ణమాచార్యులు, సాహిత్యం పరంగా ప్రజలకు ఎన్నో సూక్తులు, కవితల ద్వారా వినిపించారని, నేటికీ పలు మండలాల్లో సాహిత్య గోస్టిలు, కవి సమ్మేళనములు నిర్వహిస్తూ ఉంటున్నారని అన్నారు. ఖమ్మం జిల్లాకి భక్త రామదాసు శ్రీరాముడుపై అనేక రకాల పద్యాలు, పాటలు రచించి రాముడు చేత మెప్పు పొందాడని, అటువంటి భక్తునికి స్మరించుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.



నేటితరం యువకులు కవులను, సాహిత్య వేతలను, స్ఫూర్తిగా తీసుకొని కళలు అంతరించిపోకుండా కాపాడుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో రమాదేవి, ఆర్డీఓ రత్న కళ్యాణి, ఏఈఓ శ్రవణ్ కుమార్, ఏవో రామకృష్ణ, సీఐ నాగరాజు, గ్రామపంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, ఐకెపిసిసి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

హై పవర్ కమిటీ వేతనాల అమలు చేయాలి

- కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించాలి



నవతెలంగాణ-మణుగూరు

కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని సింగరేణి ఎన్నికలో ఓటు హక్కు కల్పించాలని కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. డిప్యూటీ లేబర్ కమిషనర్ సమావేశంలో నాయకులు చర్చించాలన్నారు. ఆదివారం జాతీయ కార్మిక సంఘాల నాయకులకు, ఏరియా సింగరేణి కాంటాక్ట్ కార్మికులు లేఖలు అందజేశారు. సింగరేణిలో గుర్తింపు ఎన్నికల నిర్వహణకు ఎన్నికల్లో పాల్గొననున్న కార్మిక సంఘాల నాయకులతో మంగళవారం హైదరాబాద్ కేంద్ర కార్మిక శాఖ అధికారి డిప్యూటీ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు సమక్షంలో జరుగునున్న సమావేశం సందర్భంగా సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఓటు వేసే విధంగా సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించాలని, హై పవర్ కమిటీ వేతనాల అమలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మణుగూరు ఏరియా సింగరేణి కాంటాక్ట్ కార్మికులు, ఏరియా కార్మిక సంఘాల నాయకులకు లేఖలు అందజేశారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ షేక్ అబ్దుల్ రవూఫ్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లూరి వెంకటరత్నం, బిఎంఎస్ రాష్ట్ర నాయకులు వీరమనేని రవీందర్ రావు, ఏరియా నాయకులు కిషన్, ఇతర నాయకులకు లేఖలు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంటాక్ట్ కార్మికులు మంగీలాల్ కే.వీర్రాజు, యు.శివరామకృష్ణ, గోవిందుల శ్రీనివాస్, ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమం కోసం పాటుపడుతున్న వ్యక్తి కేసీఆర్

- డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ రాష్ట్రంలోని వికలాంగుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న మహొన్నత వ్యక్తి కెసిఆర్ అని జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. వికలాంగుల పింఛన్‌ను రూ.3016 నుండి రూ.4016కు పెంచడాన్ని వికలాంగులు, బీఆర్ఎస్ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కన పాల్వంచ వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు ఫ్లెక్సీకి కొత్వాలతో పాటు రైతు సమన్వయ సమితి కన్వీనర్ కిలారు నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్‌లు పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులకు ఉచితంగా పరికరాలు ఏర్పాటు, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంకుల ద్వారా వీధి వ్యాపారులకు రుణాలు, 50 శాతం రాయితీతో ప్రయాణ సౌకర్యం, వికలాంగ విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందజేస్తున్న కెసిఆర్‌ను, వనమాలను మరోసారి మద్దతు ఇవ్వాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సింగు రాంబాబు, షేక్ ఫాతిమా, ఎస్. స్వప్న, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్ కనగాల నారాయణరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ కాల్వ ప్రకాశరావు, నాయకులు కాల్వ భాస్కర్, మిరియాల వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సోమయ్య, కుమ్మరి కుంట్ల నాగ, దండోరా శ్రీను, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు ఓర్సు బాబు, నంది వీరభద్రరావు, అల్తాఫ్, సారయ్య, అజీజ్, శ్రీనివాస్‌లి తదితరులు పాల్గొన్నారు.

కుసుమ జగదీష్ మరణం బాధాకరం

- జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి కోలేటి భవాని శంకర్

నవతెలంగాణ-పినపాక

ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ములుగు జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ అకాల మరణం పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి కోలేటి భవాని శంకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎంతో మంచి నాయకుడిగా పేరు సంపాదించుకున్న జగదీష్ మరణం చాలా బాధాకరమని అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

ప్రయివేటు... కార్పొరేట్ విద్యాసంస్థలకు తొత్తులుగా మారిన జిల్లా విద్యాశాఖ అధికారులు

- ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న డీఈఓను విధుల నుంచి తొలగించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం



నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రైవేటు...కార్పోరేట్ విద్యాసంస్థలకు జిల్లా విద్యాశాఖ అధికారులు తొత్తులుగా మారారని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న డీఈఓను విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని మంచికంటి భవన్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని వరుస ఆందోళనా కార్యక్రమాలకు పిలుపు నిచ్చారు. కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి నవీన్ కొట్టే అధ్యక్షతన జరిగిన డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఫీజులు నియంత్రణలో జిల్లా అధికార యంత్రాంగం విఫలమైందని, ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థలు ఇచ్చే మామూళ్ళ మత్తులో జిల్లా అధికార యంత్రాంగం నిబంధనలు గాలికొదిలేసిందనీ, ఈ క్రమంలోనే అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థులను, తల్లిదండ్రులను పీడిస్తున్నారనీ ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎవ్వరూ చేరొద్దని అన్నారు. ప్రైవేటు, విద్యాసంస్థల పట్ల మెతక వైఖరి ప్రదర్శిస్తున్న డీఈవో విధులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి నిర్లక్ష్యం కారణంగానే జిల్లా ఫలితాల్లో వెనకబడిందన్నారు. జిల్లాకు ప్రభుత్వం తక్షణమే రెగ్యులర్ డీఈఓ, ఎంఈవోలను నియమించాలని డిమాండ్ చేశారు.

కొత్తగూడెం ఎంఈవో ఎక్కడ....?

ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను విద్యార్థుల, తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నా మండల విద్యాశాఖ అధికారి తనకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనీ, ఒలంపియాడ్, గ్రామర్, సివిల్స్, ఐఐటి, సి-బ్యాచ్, ఎస్-బ్యాచ్ తదితర పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్న యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని కాలరాస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంజు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాలకు పైగా బుల్లితెరపై చెరగని ముద్ర వేసిన ప్రముఖ న్యూస్‌రీడర్... దూరదర్శన్‌లో మొదటి తరం మహిళా ఆంగ్ల వార్తా వ్యాఖ్యాతలలో ఒకరిగా కీర్తి గడించారు... అంతేకాదు థియేటర్ ఆర్టిస్టుగా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు... ఆమే గీతాంజలి అయ్యర్. అలాంటి ఆమె జూన్ 7వ తేదీన 76 ఏండ్ల వయసులో అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా ఆమె జీవితంలోని కొన్ని విశేషాలు...



బుల్లితెరపై చెరగని ముద్ర

గీతాంజలి అయ్యర్ 29 జనవరి 1947 జన్మించారు. ఢిల్లీలో పెరిగారు. కేథడ్రల్ అండ్ జాన్ కానన్ స్కూల్లో చదువుకున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, కోల్‌కతాలోని లోరెటో కాలేజీ నుండి పట్టభద్రురాలయ్యారు. అలాగే న్యూఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (NSD) నుండి డిప్లొమా పొందారు. భారతీయ ఆర్థికవేత్త, పాత్రికేయుడు, కాలమిస్ట్ అయిన స్వామినాథన్ ఎస్. అంక్లేసరియా అయ్యర్‌ను ఆమె వివాహం చేసుకున్నారు. తర్వాత కాలంలో వీరు విడిపోయారు. గీతాంజలికి కూతురు పల్లవి, శేఖర్ అయ్యర్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వార్తలు చదవాలని కోరిక

చిన్నతనం నుండి గీతాంజలి సురోజిత్ సేన్, పమేలా సింగ్ వంటి వారు రేడియోలో వార్తలు చదవడాన్ని గమనిస్తూ పెరిగిన ఆమె వారిచే బాగా ప్రభావితమ య్యారు. వాళ్ళు చదువుతున్న వార్త లను తన సొంత శైలిలో అనుకరణ చేస్తుండేవారు. అలా ఆరేండ్ల వయసు నుండే ఆమెకు న్యూస్ యాంకర్ కావాలని కోరిక. ఆ కోరికతోనే 1971లో దూరదర్శన్‌లో చేరారు. పదేండ్లకు పైగా వారానికి కొన్ని రోజులు రాత్రి 9:00 గంటలకు ఆంగ్లంలో ప్రైమ్-టైమ్ వార్తలను చదివారు. వార్తలతో పాటు ప్రతి శుక్రవారం రాత్రి ఆల్ ఇండియా రేడియోలో ఇంగ్లీష్ పాటల కార్యక్రమం 'ఎ డేట్ విత్ యు'తో సహా పలు ప్రముఖ షోలను హోస్ట్ చేశారు. 1978లో ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్ వేర్వేరు సంస్థలుగా మారినప్పుడు గీతాంజలి దూరదర్శన్‌తో కలిసి పని చేశారు.

అనేక పదవుల్లో...

2002లో దూరదర్శన్ నుండి వచ్చేశారు. దూరదర్శన్‌లో పనిచేయడమే కాకుండా గీతాంజలి వివిధ ప్రఖ్యాత సంస్థలలో కొన్ని ముఖ్యమైన పదవులను నిర్వహించారు. 1982 నుండి 1983 వరకు ఢిల్లీలోని తాజ్ హోటల్స్ రిసార్ట్స్ అండ్ ప్యాలెస్‌లలో సేల్స్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్‌గా చేశారు. 1994 నుండి 1998 వరకు డాల్మియా గ్రూప్ అండ్ కార్పొరేట్ వాయిస్ షాండ్‌విక్ PR కార్పొరేట్ కమ్యూనికేషన్స్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 1998లో న్యూ ఢిల్లీలోని బ్రిటీష్ హైకమిషన్‌లో ప్రెస్ అండ్ పబ్లిక్ అఫైర్స్ విభాగానికి డిప్యూటీ హెడ్‌గా నియమితులై 2001 వరకు ఈ పదవిలో ఉన్నారు.

కార్పొరేట్ అండ్ మార్కెటింగ్

దూరదర్శన్‌లో తర్వాత గీతాంజలి కార్పొరేట్ కమ్యూనికేషన్స్, ప్రభుత్వ అనుసంధానమై మార్కెటింగ్‌లో పని చేశారు. 2001 నుండి 2005 వరకు న్యూఢిల్లీలోని యష్ బిర్లా గ్రూప్ పబ్లిక్ ఎఫైర్స్ విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 2005 నుండి 2007 వరకు న్యూఢిల్లీలోని ది ఒబెరాయ్ గ్రూప్‌లో అంతర్జాతీయ సేల్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్నారు. 2007లో కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీలో కన్సల్టెంట్‌గా చేరి అందులో 2010 వరకు కొన సాగారు. 2011లో వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (WWF) అధిపతిగా మారారు. అంతేకాదు కొడుకు అమెరికాలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్‌లో కూడా పనిచేశారు.



ప్రకటన, థియేటర్, టెలివిజన్

గీతాంజలికి నాటక రంగంపై మక్కువ ఎక్కువ. అనేక నాటకాలలో కూడా నటించారు. 1985లో శ్రీధర్ క్షీరసాగర్ దర్శకత్వం వహించిన దూరదర్శన్ టెలివిజన్ ధారావాహిక 'ఖందాన్'లో కూడా నటించారు. అలాగే వివిధ ప్రింట్ ప్రకటనలలో కూడా కనిపించారు. అందులో ఒకటి మార్నైట్ బ్రాండ్ కోసం చేశారు. ఇది తన ఇంటిలోనే డైనింగ్ టేబుల్ మీద తీసిన చిత్రం. 1989లో గీతాంజలి అత్యుత్తమ మహిళగా ఇందిరా గాంధీ ప్రియదర్శిని అవార్డును గెలుచుకున్నారు. దూరదర్శన్‌లో తన పదవీకాలంలో నాలుగు సార్లు ఉత్తమ యాంకర్‌గా అవార్డు పొందారు.

బ్రెయిన్ హెమరేజ్‌తో...

మొదటితరం న్యూస్ రీడర్‌గా ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసుకున్న ఆమె కొన్ని రోజులుగా పార్కిన్సన్స్ వ్యాధితో పోరాడుతున్నారు. ప్రతి రోజు వాకింగ్‌కి వెళ్ళి వచ్చే ఆమె జూన్ 7వ తేదీ కూడా వాకింగ్ పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలారు. సహాయకులు వెంటనే న్యూఢిల్లీలో సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఆమె అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు. ఆమె మరణానికి బ్రెయిన్ హెమరేజ్ కారణమని వైద్యులు నిర్ధారించారు.

ప్రతి క్షణం అప్రమత్తంగా...



గీతాంజలి టెలిప్రాంప్టర్‌ల వంటి సాంకేతిక సహాయాలు అందుబాటులో లేని సమయంలో యాంకర్‌గా పని చేశారు. యాంకర్‌లుగా ఎంతో ప్రశాంతంగా కనిపించాలి. అలాగే కెమెరాపై ఫోకస్ చేస్తూ, చేతిలో ఉన్న పేపర్లను చూస్తూ సమతుల్యం చేసుకోవాలి. అప్పట్లో న్యూస్ రీడర్లుగా తాము ఎదుర్కొన్న సవాళ్ల గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "మాకు టెలిప్రాంప్టర్‌లు లేవు. మా కోసం స్క్రిప్ట్‌ను మాన్యువల్‌గా ఒక వ్యక్తి రోల్ చేస్తుంటారు. కెమెరా వైపు, చదవాల్సిన వార్తల వైపు ఒకే సమయంలో చూడటం చాలా కష్టం. కెమెరా దగ్గర నిలబడి ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా సైగ చేసి, అవసరాన్ని బట్టి వేగంగా లేదా నెమ్మదిగా చదవమని అడుగుతాడు. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ వార్తలు చదవాల్సి వస్తుంది. కాబట్టి ప్రతి క్షణం మేము ఎంతో అప్రమత్తంగా ఉండాలి" అన్నారు.

అభిమానులు ఆపేసేవారు



ఒక ఇంటర్వ్యూలో యాంకర్‌గా ఉన్న సమయంలో అభిమానుల నుండి తనకు వచ్చిన మెయిల్స్, లేఖల గురించి మాట్లాడారు. వాటిలో కేవలం ఆమె యాంకరింగ్ గురించే కాకుండా, విలక్షణమైన ఆమె కేశాలంకరణ, వస్త్రధారణ గురించి కూడా ఎన్నో ప్రశంసలను పొందారు. వార్తలు చదివే ఆమె తీరు ఎందరినో ప్రభావితం చేసింది. ఆమె ఎప్పుడైనా బయట కనిపించినపుడు అభిమానులు ఆపి మరీ పలకరించే వారిని ఆ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అభిమానులు తన హెయిర్ డ్రెస్సర్, టైలర్ గురించి వివరాలు అడిగేవారంట.

ఉల్లితో మేలు



మనం వంటల్లో ఉల్లిగడ్డలను, ఉల్లికాడలను ఉపయోగిస్తూనే ఉంటాం. ఉల్లి వేస్తే కూర రుచిగా ఉంటుంది. ఇక వేసవికాలంలోనైతే దీని విలువ చెప్పనవసరం లేదు. వంటల్లోనే కాక విడిగా పచ్చి ఉల్లిగడ్డ ముక్కలను కూడా ఎక్కువగానే తీసుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో మండే ఎండల్లో వడదెబ్బ నుండి రక్షణకు పిల్లల మెడలో ఉల్లిగడ్డలను మాలగా గుచ్చి వేస్తారు. పెద్దవారైతే ఎండలో బయటికి వెళ్ళాల్సివచ్చినప్పుడు ఉల్లిగడ్డను తలపై ఉంచుకుని టోపీ పెట్టుకుంటారు. అలాగే చిన్నపిల్లల్లో, పెద్దవారిలో నిద్రలేమిని ఇట్టేమాయం చేసే ఉల్లి ఆరోగ్యానికే కాదు సౌందర్య సాధనంగా కూడా ఉపయోగపడుతుంది.

- ముక్కులో నుండి రక్తం కారుతుంటే తెల్ల ఉల్లిగడ్డను మధ్యలోకి కోసి కాసేపు వాసన చూస్తే సరి.
- మొటిమలు, వాటి తాలూకు మచ్చలకు ఉల్లిగడ్డ రసం, ఆలివ్ ఆయిల్ సమపాళ్లలో కలుపుకున్న మిశ్రమం చక్కని ఔషధం.
- చుండ్రు సమస్య వేధిస్తుంటే ఉల్లి రసం తలకు బాగా పట్టించాలి. ఇది చుండ్రును మాయం చేయడంతో పాటు జుట్టు పెరగడానికి దోహదం చేస్తుంది.
- మూర్ఛతో బాధపడుతున్నప్పుడు ఉల్లి రసాన్ని రెండు మూడు చుక్కలు ముక్కులో వేస్తే వెంటనే తేరుకుంటారు.
- విషకీటకాలు, కుక్కకాటుకు ఉల్లి రసం తీసుకోవడం లేదా ఉల్లిగడ్డను దంచి గాయంపై పూసినా వెంటనే మంట తగ్గుతుంది. విషాన్ని హరిస్తుంది.
- ఎంతగా బాధించే నొప్పులకైనా ఉల్లిరసం, ఆవనూనె సమంగా కలిపి మర్దనచేస్తే చాలు వెంటనే ఉపశమనం దొరుకుతుంది.

అల్పాహారంలో ఇవి చేర్చండి...

ఉదయం పని ఒత్తిడిలో పడి చాలా మంది మహిళలు అల్పాహారం సంగతే మర్చిపోతారు. కానీ అల్పాహారాన్ని అస్సలు నిర్లక్ష్యం చేయొద్దంటున్నారు ఆరోగ్య నిపుణులు. అప్పుడే ఒబీసిటీ ఇబ్బంది వుండదు. ఉదయం పూట కడుపు నిండా తినడం ద్వారా మధ్యాహ్నం పూట మితంగా ఆహారం తీసుకోగలుగుతారు. ఇక రాత్రి పూట అంతగా ఆకలి వేయదు. ఇలా తీసుకుంటే ఆరోగ్యం మీ సొంతం అవుతుంది. అల్పాహారంలో మరికొన్నింటిని జత చేసుకుంటే ఆరోగ్యంగా వుండగలుగుతారని వైద్యులు చెప్తున్నారు. అవేంటో చూద్దాం..



- ఉదయాన్నే టిఫిన్‌లో భాగంగా రాగి జావ తీసుకోవడం ఉత్తమం. ఓట్స్ ఉప్మా, లేదా పాలల్లో ఓట్స్ వేసుకుని తీసుకోవచ్చు. పాలతో కార్న్‌ఫ్లేక్స్ తీసుకుంటే శరీరానికి అవసరమైన ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది.
- అల్పాహారంలో తాజా పండ్లు, డ్రై ఫ్రూట్స్ తప్పని సరిగా ఉండేలా చూసుకోండి. ఉడికించిన కోడి గుడ్డు రోజుకు ఒకటి అల్పాహారంలో తీసుకోవాలి.
- సోయాపాలు ఆరోగ్యానికి చాలా మంచివి. మనం తీసుకునే పాల స్థానంలో వారంలో రెండు మూడు రోజులైనా సోయా పాలు తీసుకోవాలి.
- వారంలో ఒక రోజయినా పూరీని అల్పాహారంగా తీసుకోండి. ముఖ్యంగా చిన్న పిల్లలకు పూరీలు, వెజిటబుల్ కర్రీ మంచి ఆహారం.
- ఉదయం పుల్కాలు తినే వారు అందులోకి తాజా కూరగాయలతో పాటు చిరుధాన్యాలతో ఒక కూర చేసుకుంటే శరీరానికి తగిన శక్తి వస్తుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

అమిత్ షా గో బ్యాక్

(మొదటిపేజీ తరువాయి)

అన్యాయం చేసిందని, పైగా, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని ఏపీలోని వామపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని విధాలా రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందిగాక విజయోత్సవ సభల పేరుతో మరోమారు మోసం చేయాలని చూస్తున్న బీజేపీకి రాష్ట్ర ప్రజలు పాడెకట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ తొమ్మిదేండ్ల విద్రోహ పాలనపై సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఏపీశాఖల ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలో రైల్వే డీఆర్‌ఎం కార్యాలయం జంక్షన్ నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీపాన ఉన్న గురజాడ విగ్రహం వరకు నల్లజెండాలు, నల్లదుస్తులతో నిరసన ర్యాలీ జరిగింది. గురజాడ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. 'అమిత్ షా గో బ్యాక్' 'స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన వారికి విశాఖలో అడుగుపెట్టే అర్హత లేదు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, దేశంలో యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ అధికారంలోకి ఇచ్చిన బీజేపీ తొమ్మిదేండ్ల పాలనంతా విద్వేష, విద్రోహపూరితంగా సాగిందని విమర్శించారు. సుజల స్రవంతికి, వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతానికి నిధులు, రైల్వే జోన్ వంటి హామీలన్నింటినీ తుంగలో తొక్కిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను విక్రయిస్తున్న బీజేపీ చెందిన నేత అమిత్ షాకు విశాఖలో అడుగుపెట్టే నైతిక అర్హత లేదని తెలిపారు. పోలవరం నిర్వాసితులను గోదాట్లో ముంచేయాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించుకుందని విమర్శించారు. సీపీఐ ఏపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయన్నారు. అటవీ చట్టాలను తుంగలో తొక్కి గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీపీఐ (ఎంఎల్)ఏపీ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మి, ఆప్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సీతల్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ లెనిన్ సెంటర్‌లో జరిగిన ధర్నాలో సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోడీ తొమ్మిదేండ్ల పాలనలో దేశానికి, దేశానికి చేసిన మేలు ఏమీ లేదని అన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని తెలిపారు.

బీజేపీని బలహీనపర్చేలా కేసీఆర్ కుట్ర

- మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో రాష్ట్ర అధ్యక్షుడి మార్పు ఉంటుందనీ, ప్రచార కమిటీ చైర్మెన్‌గా ఈటల రాజేందర్ నియమితులు కాబోతున్నారనే వార్తల వెనుక కేసీఆర్ కుట్ర ఉందని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. పార్టీలో విభేదాలుంటే తామే పద్ధతి ప్రకారం పరిష్కరించుకుంటామని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో సీనియర్ నేతలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీలో ఇప్పటివరకూ ప్రచార కమిటీ అనే వ్యవస్థనే లేదని చెప్పారు. ఎన్నికల్లో బీజేపీ నుంచి ప్రమాదం పొంచి ఉన్నందుకే కేసీఆర్ ఇలాంటి ప్రచారాలు చేయిస్తున్నారని విమర్శించారు. గ్రామ, మండల, జిల్లా కమిటీలు వేసిన తర్వాతనే అధ్యక్ష ఎన్నిక ఉంటుందనీ, ఇప్పటికిప్పుడు ఎలా మారుస్తారని ప్రశ్నించారు. మీడియాలో బీజేపీ నాయకత్వ మార్పు, కొత్త పదవులపై వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు.

అధ్యక్ష పదవి మార్పుపై లీకేజీలు సరిగాదు : విజయశాంతి

రాష్ట్రంలో తమ పార్టీ అధ్యక్షుడుగా బండి సంజయ్‌ని మారుస్తున్నారని మీడియా లీకేజీలు సరిగాదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీ విజయశాంతి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకూ బండి సంజయ్‌నే కొనసాగుతారని తరుణ్‌చుగ్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. నేతల భేటీలపై వస్తున్న ఊహాగానాలు అధికారిక ప్రకటనలు కావని తెలిపారు. తమ పార్టీ అధికార ప్రతినిధులు మాత్రమే కచ్చితమైన సమాచారం ఇస్తారని పేర్కొన్నారు. ఊహాగానాల వార్తల ప్రభావం తమ పార్టీపై ఉండబోవని పేర్కొన్నారు.

ఒత్తిడిలో రెజ్లర్లు

(మొదటిపేజీ తరువాయి)

సాక్షి మాలిక్ తెలిపారు. రాజీ చేసుకోవాల్సిందిగా పెద్ద ఎత్తున ఒత్తిడి వస్తోందని ఆమె ఓ టెలివిజన్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. బ్రిజ్ భూషణ్ సన్నిహితులు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఫిర్యాదును వెనక్కి తీసుకోవాల్సిందిగా మైనర్ రెజ్లర్ తండ్రిపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారని, దీంతో ఆయన మానసిక ఒత్తిడికి లోనయ్యారని సాక్షి మాలిక్ తెలిపారు. సమస్యను పూర్తిగా పరిష్కరించని పక్షంలో ఆసియా క్రీడలలో పాల్గొనబోమని స్పష్టం చేశారు. హర్యానాలోని సోనేపట్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రెజ్లర్లు రోజురోజుకూ మానసికంగా ఎంతగా కుంగిపోతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదని వాపోయారు. భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించడానికి రెజ్లర్లు ఏర్పాటు చేసిన మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు ఆమె సోనేపట్ వచ్చారు. ఆసియా క్రీడల కోసం ఈ నెలలో ట్రయల్స్ నిర్వహిస్తున్న నేపథ్యంలో సాక్షి మాలిక్ చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. నిరసనలో పాల్గొంటున్న రెజ్లర్లు ఆందోళన విరమించి, ఈ ట్రయల్స్‌కు హాజరై ఆసియా క్రీడల జట్టులో స్థానం సంపాదించాల్సి ఉంటుంది. చైనాలో సెప్టెంబర్ 23 నుండి అక్టోబర్ 8 వరకూ ఆసియా క్రీడలు జరగనున్న విషయం తెలిసిందే. కాగా ఈ వ్యవహారంలో పోలీసుల విచారణ పూర్తి కావడానికి ఈ నెల 15 వరకూ సమయం ఇవ్వాలని కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తమను కోరినట్లు రెజ్లర్లు నాలుగు రోజుల క్రితం తెలిపారు.

బీజేపీ అవకాశాలపై ప్రభావం

రెజ్లర్లలో ఎక్కువ మంది జాట్ కులానికి చెందిన వారు ఉండడంతో వారి ప్రభావం నాలుగు రాష్ట్రాలపై ఉండబోతోంది. జాట్ల మద్దతుతోనే ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అధికారంలోకి రాగలిగింది. అయితే ఇప్పుడు ఆ రాష్ట్రంలో పరిస్థితి మారుతోంది. 2022 అసెంబ్లీ ఎన్నికలలో ఆర్‌ఎల్‌డీ ఎనిమిది స్థానాలు గెలిచింది. ఇవన్నీ జాట్ల ప్రాబల్యం అధికంగా ఉన్న స్థానాలే. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలోనూ జాట్ల ప్రభావం ఎక్కువగా ఉన్న చోట ఆర్‌ఎల్‌డీ, దాని మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ గణనీయమైన విజయాలు సాధించింది. మరోవైపు ఆయా ప్రాంతాలలో బీజేపీ చతికిలపడింది. జాట్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న జిల్లాలలో ఆ పార్టీ 20 నగరపాలిక ఛైర్మన్ స్థానాలను (మొత్తం 56 స్థానాలు), 34 నగర పంచాయత్ ఛైర్మన్ స్థానాలను (మొత్తం 124 స్థానాలు) మాత్రమే పొందగలిగింది. పశ్చిమ యూపీలోని 12 లోక్‌సభ స్థానాలు, 40 అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించే శక్తి జాట్లకు ఉంది.

మొత్తంగా చూస్తే యూపీ, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలలోని 40 లోక్‌సభ స్థానాలు, 160 అసెంబ్లీ స్థానాలలో జాట్లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. యూపీలో 2022 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే జాట్ల ఓట్లు పార్టీలవారీగా చీలిపోయాయి. బీజేపీ తరఫున 10 మంది జాట్ ఎమ్మెల్యేలు విజయం సాధించగా ఆర్‌ఎల్‌డీ నుండి నలుగురు, సమాజ్‌వాదీ పార్టీ నుండి ముగ్గురు జాట్ ఎమ్మెల్యేలు గెలుపొందారు.

ఆధారాలు ఇవ్వండి

ప్రకారం ఆరోపణలు చేసినదాని ప్రకారం వీడియోలు, ఆడియోలు, వాట్సాప్ చాటింగ్‌లు, ఫోటోలు, బెదిరింపు సందేశాలు వంటి సాక్ష్యాధారాలు ఏమైనా ఉంటే స్టేషన్‌లో పొందుపరచాలని కోరింది.

ఏప్రిల్ 21న భారత మహిళా రెజ్లర్లు ఇద్దరు భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తమను లైంగికంగా వేధిస్తున్నారని, ఊపిరి చెక్ చేస్తానంటూ ఇష్టానుసారంగా మీద చేతులు వేస్తున్నారని, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తాజాగా కన్నాట్ ప్లేస్ పోలీసులు ఫిర్యాదులో వారు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడికి సంబంధించిన వివరాలు ఉంటే తమకివ్వాలంటూ సీఆర్పీసీ సెక్షన్ 91 చేతులు వేసినట్టుగా కానీ, తమను ముట్టుకుంటున్నట్టుగా కానీ ఫోటోలు, వీడియోలు, వాట్సాప్ సందేశాలు ఏమైనా తమకి ఇవ్వాలంటూ సిఆర్పీసి సెక్షన్ 91 ప్రకారం ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సంతకాలు చేసిన నోటీసులను పంపించారు.

టార్గెట్ ఈటల?

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుకోవడం, ఎవరికి తోచినది వారు మాట్లాడుతుండటం..బయట జరుగుతున్న ప్రచారానికి మరింత బలం చేకూరుస్తున్నది.

కొద్దిరోజులుగా ఈటల రాజేందర్ బీజేపీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. తనకు మొదటి నుంచి అనుకూలంగా ఉంటూ వచ్చిన కొండా కూడా అధ్యక్ష మార్పుపై బహిరంగంగానే మాట్లాడారు. పొంగులేటి చేరికపై ఈటలనైతే ఒకడుగు ముందుకేసి ఖమ్మం జిల్లాలో బీజేపీ లేనేలేదని చెప్పారు. దీంతో ఆయన అసంతృప్తిని చల్లబర్చేందుకు అధిష్టానం అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించింది.

ఈ నేపథ్యంలోనే తెలంగాణలో ఎన్నికల ప్రచార సారథి బాధ్యతలు ఈటల రాజేందర్‌కు, అధ్యక్ష బాధ్యతలు డీకే అరుణకు, బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవిని అధిష్టానం ఇవ్వనున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఇదే విషయంపై బండి మాట్లాడుతూ..రాష్ట్రంలో అధ్యక్షుడి మార్పే ఉండదు..ఎన్నికలు తన సారథ్యంలోనే జరుగుతాయని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. ఇదే అంశంపై గతంలో..బీజేపీలో కార్యకర్త స్థాయి నుంచి ఎదిగినవాడ్ని నన్ను అణచాలని చూస్తే ఊరుకునే వ్యక్తి'ని కాదంటూ బండి వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచీ ఈటలను డౌన్‌ఫాల్ చేయడాన్ని బండి గ్రూపు తీవ్రం చేసింది. బండి సారథ్యంలో ఉప ఎన్నికల్లో రెండు ఎమ్మెల్యే స్థానాలు గెలిచాం..జీహెచ్ఎంసీలో 48 స్థానాలు గెలిచాం...చేరికల కమిటీ చైర్మెన్‌గా ఈటల ఏం చేసారనే ప్రచారాన్ని ఉధృతం చేసింది. అదే సమయంలో ఈటల అసలు పార్టీనే లేదని చెప్పిన ఖమ్మంలో అమిత్‌షా సభను జయప్రదం చేసి ఈటలకు, అధిష్టానానికి తన సత్తా ఏంటో చూపాలని బండి స్వయంగా సభ ఏర్పాట్లు, జనసమీకరణ అంశాలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

ఇదిలా నడుస్తుండగానే బీసీ సామాజిక తరగతిలో బలమైన నేతగా ఉన్న ఈటల రాజేందర్‌ను రాజకీయంగా వాడుకుని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు పెంచుకోవాలనే భావనలో బీజేపీ అధిష్టానం ఓ అంచనాకు వచ్చి త్వరలో ఎన్నికల ప్రచార సారథ్య బాధ్యతలు అప్పగించనున్నదనే ప్రచారం ఊపందుకున్నది. దీంతో టికెట్లు ఆశిస్తున్న కీలక నేతలు ఈటలను కలిసేందుకు ఆదివారం నాడు ఆయన నివాసానికి వెళ్లడంతో అక్కడ సందడి నెలకొంది. మరోవైపు ఈటల వెనుక ఉన్నవారంతా ఒక్కసారిగా వేరుకుంపటి పెట్టేశారు. 'నేను అణగదొక్కితే అణిగి ఉండేవాన్ని కాదు..నేనేంటో చూపిస్తా' అని బండి వ్యాఖ్యలు చేసినట్టుగానే జరుగుతున్నది. ఓపక్క బండి సంజయ్...కేంద్ర మాజీ మాజీ మంత్రి ప్రకాశ్ జవదేవకర్‌తో వేములవాడ పర్యటనలో ఉండి తెరవెనుక నుంచి రాజకీయం నడిపిస్తున్నట్టు, ఇన్నాళ్లు ఈటలకు అనుకూలంగా ఉన్న కొందరిని వ్యతిరేకంగా మార్చి ఎగదోసినట్టు ప్రచారం జరుగుతున్నది. సీనియర్ నేతల భేటీలో పార్టీలో ఈటలకు ప్రమోషన్‌పైనే ప్రధానంగా చర్చ జరిగిందని తెలిసింది.

ఈటల రాజేందర్ తమని అడ్డుపెట్టుకుని రాజకీయంగా ఢిల్లీ నుంచి చక్రం తిప్పాలని చూస్తున్నారని ఆ నేతలు ప్రధానంగా ఆరోపణలు చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్ర అధ్యక్షులు ఇక్కడ ఉండగా..ఢిల్లీకి వెళ్లి మరీ పదవుల మార్పుపై లీకులు ఇవ్వడాన్ని ఖండించినట్టు తెలిసింది. ఎంకి పెండ్లి సుబ్బి చావుకొచ్చినట్టు ప్రచార సారథ్య బాధ్యతల పదవి అప్పగింత చర్చ ఈటల మెడకు చుట్టుకుంటున్నది. బీజేపీలో ఏకాకిని చేస్తున్నది. మరోవైపు మొన్నటిదాకా బండికి వ్యతిరేకంగా ఉండి సడన్‌గా ప్లేటు ఫిరాయించిన ఈ నేతలు రానున్నకాలంలో ఆ పార్టీలో ఎంత మంది ఉంటారనేదీ ప్రశ్నార్థకమే. పార్టీలో ఒకదాని వెనుక ఒకటిగా జరుగుతున్న పరిణామాలు బీజేపీ జాతీయ నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారాయి.

నాలుగో క్లాస్ పాస్..నకిలీ డిగ్రీ

(మొదటిపేజీ తరువాయి)

అంటున్నారు. అతనికి అహం ఎక్కువ. దేశంలో ప్రజాస్వామ్యం అంతరించిపోతోంది. దీన్ని నియంతృత్వం, హిట్లర్‌షాహి అంటారు..అని వివరించారు.

ఈ ఐదు అంశాలే కేజ్రీవాల్ టార్గెట్. ద్రవ్యోల్బణంపై..

కేజ్రీవాల్ తన ప్రసంగంలో ద్రవ్యోల్బణం గురించి ప్రస్తావించారు. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. పెట్రోలు, పాలు, కూరగాయలు ఖరీదైపోయాయి. ఎల్పీజీ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,000 దాటింది. దీన్ని ఎలా నియంత్రించాలో వారికి అర్థం కావడం లేదు. నాలుగో క్లాస్ పాస్ రాజుకి దేశాన్ని ఎలా నడిపించాలో కూడా తెలియదు.

ఏదో ఒకరోజు రూ.2000 నోటు వస్తుందని అంటున్నారని, ఐదేండ్ల తర్వాత అది పోతుందని చెప్పారు.

రాజుకు మిత్రుడైన నాయకుడు రైతులపై బండి నడిపినా, పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యమంలో 700 మంది రైతులు చనిపోయారు. రాజు ఏమాత్రం పశ్చాత్తాపమూ లేకుండా తన అహంభావంలో జీవిస్తున్నారని విమర్శించారు.

రాజుకు మరొక స్నేహితుడు ఉన్నాడు, అతను దేశంలోని అంతర్జాతీయ మహిళా మల్లయోధులతో అనుచితంగా ప్రవర్తిస్తాడు, కానీ రాజు దాని గురించి ఏమీ మాట్లాడరు. రాజుకు అతనితో ఉన్న స్నేహం విడదీయలేనిదని చురకలు అంటించారు.మరో స్నేహితుడికి

విమానాశ్రయం, భూమి, గనులు అన్నీ రాసి ఇచ్చారని విమర్శించారు..

పంజాబ్ సీఎం భగవంత్ మాన్, సౌరభ్ భరద్వాజ్, అతిషి, సంజయ్ సింగ్ సహా పలువురు ఆప్ నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

కండ్లల్లో పొడిచి..కత్తితో దాడి చేసి..

(మొదటిపేజీ తరువాయి)

వండటం లేదని చెప్పాడు. అనిల్ వీరి ఇంటికి వచ్చి శిరీషను మందలించడంతో పాటు కొట్టడంతో వారి మధ్య గొడవ జరిగింది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన శిరీష రాత్రి 10:30గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆదివారం ఉదయం గ్రామ శివారులోని గోనె మైసమ్మ గుడి సమీపంలోని చెరువు కుంటలో రక్తపు మరకలతో శిరీష మృతదేహం కనిపించింది. దాంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, శిరీష మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె రెండు కండ్లపై పొడిచిన గాయాలు ఉండగా, పెదవికి కూడా గాయమైనట్టు గుర్తించారు. ఎడమ కాలుకు, ఎడమ మణికట్టుకు గాయాలై రక్తం కారింది. మృతురాలి శరీరంపై గాయాలను బట్టి శిరీషను చంపి కుంటలో పడేశారని పోలీసులు తెలిపారు. మృతురాలి అన్న జుట్టు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ చెప్పారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఇన్విజిలేటర్ ఫోన్లను కూడా లోపలికి అనిమతించ లేదని అభ్యర్థులు తెలిపారు. ఈ సారి గ్రూప్ 1 లో ఎక్కువ మంది మంచి మార్కులు సాధించే అవకాశం ఉందని అభ్యర్థులు వెల్లడించారు. పేపర్ లీకేజీ నేపథ్యంలో గత ఏడాది జరిగిన గ్రూప్ 1 ప్రిలిమ్స్‌ను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసింది. ఈసారి ఆఫ్‌లైన్ పద్ధతిలో, ఓఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గత ఏడాది ఏప్రిల్ 26న నోటిఫికేషన్ జారీ చేశారు. అక్టోబర్ 16న గ్రూప్ 1 పరీక్ష జరిగింది. 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా 2,85,916 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మెయిన్స్ పరీక్షలకు 25,050 మంది అభ్యర్థులను కమిషన్ ఎంపిక చేసింది. ఆదివారం జరిగిన పరీక్షకు అభ్యర్థులు షూలు ధరించి రావొద్దని.. చెప్పులను ధరించే ఎగ్జామ్ సెంటర్లకు రావాలని కమిషన్ ముందుగానే సూచించింది. గోరింటాకు, టాటూలతో రావొవద్దని, వాచీలు కూడా అనుమతించమని కమిషన్ స్పష్టం చేసింది.

నవచిత్రం


సుడిగాలి సుధీర్

సరికొత్త సుధీర్‌ని చూస్తారు

సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కాలింగ్ సహస్ర'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్ పతాకాలపై అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కటూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుధీర్ సరసన డాలిశ్య హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం నుంచి ఇటీవల 'కలయా నిజమా..' అనే లిరికల్ సాంగ్‌ను సినీ పాత్రికేయుల చేతుల మీదుగా రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ మోహిత్ రెహమానిక్ మాట్లాడుతూ, 'మా సినిమాలో 'కలయా నిజమా..' అనే మెలోడీ సాంగ్ పాడిన చిత్రకి థ్యాంక్స్. అందరికీ సినిమా నచ్చుతుందని భావిస్తున్నాను" అన్నారు. 'నిర్మాతలుగా 'కాలింగ్ సహస్ర' మా తొలి అడుగు. మాకు ఇదొక స్వీట్ మెమొరీ. మోహిత్ అద్భుతమైన ట్యూన్ ఇవ్వగా, లిరిసిస్ట్ లక్ష్మీ ప్రియాంక అద్భుతమైన లిరిక్స్‌ను అందించారు' అని నిర్మాత వెంకటేశ్వర్లు కటూరి చెప్పారు. నటుడు శివ బాలాజీ మాట్లాడుతూ, "కథలోని ట్విస్టులు, టర్నులు ఆద్యంతం ఆసక్తికరంగా ఉన్నాయి. ఫస్ట్ సీన్ నుంచి ఈ సినిమా ఎంగేజింగ్ చేస్తుంది. ఈ మూవీ నటుడుగా సుధీర్‌లోని కొత్త షేడ్‌ను చూపిస్తుంది' అని తెలిపారు. దర్శకుడు అరుణ్ విక్కిరాలా మాట్లాడుతూ, "కలయా నిజమా' పాటకు మోహిత్ ట్యూన్ వినగానే నచ్చింది. చిత్ర పాడిన తర్వాత ఆ పాటకు మరింత అందం వచ్చింది. సుధీర్ కంప్లీట్ డిఫరెంట్‌గా కనిపిస్తారు' అని అన్నారు. హీరో సుధీర్ మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు నేను చేసిన సినిమాలకు భిన్నంగా డిఫరెంట్ జోనర్‌లో చేసిన సినిమా ఇది. శివ బాలాజీ మంచి సపోర్ట్ అందించారు. నన్ను నమ్మి ఈ సినిమా చేస్తున్న దర్శక, నిర్మాతలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు' అని చెప్పారు.


ఐశ్వర్య మీనన్, నిఖిల్

హల్‌చల్ చేస్తున్న జూమ్.. జూమ్.. సాంగ్

నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా గ్యారీ పిహెచ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'స్పై'. ఈడి ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై కె రాజశేఖర్ రెడ్డి నిర్మాతగా సుభాష్ చంద్రబోస్ సీక్రెట్ స్టోరీ, డెత్ మిస్టరీ ఆధారంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి మొదటి పాట విడుదలైంది. 'జూమ్ జూమ్' అంటూ సాగే ఈ పాట నిఖిల్, ఐశ్వర్య మీనన్ మధ్య వచ్చే లవ్ రొమాంటిక్ సాంగ్. అనురాగ్ కులకర్ణి, రమ్య బేహారా పాడిన ఈ పాటకు కిట్టు విస్సప్రగడ సాహిత్యం అందించారు. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు సంగీత దర్శకులుగా పనిచేస్తున్నారు. అలాగే శ్రీ చరణ్ పాకాల కూడా ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. 'తూటాలే పేలుస్తుంటే నీ చిరు నగవే, అందాల గాయం తగిలే నా ఎదకే..' వంటి లిరిక్స్ చాలా అద్భుతంగా ఉన్నాయి. క్యాచీ పదాలతో సాగే ఈ మెలోడీ సాంగ్ శ్రోతల మనసు దోచేసింది. ప్రస్తుతం ఈ పాట కుర్రకారు గుండెలను మీటుతూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. భారత దేశ అత్యుత్తమమైన రహస్య కథను చరిత్రలో నిలిచిపోయే స్పై థ్రిల్లర్ చిత్రంగా దీన్ని రూపొందిస్తున్నారు.

ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో తెలుగు, హిందీ, తమిళ్, మళయాళం, కన్నడ భాషల్లో ఈనెల 29న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు రెడీ అవుతోంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఆర్యన్ రాజేష్, సన్యా ఠాకూర్, అభినవ్ గోమటం, మకరంద్ దేశ్‌పాండే, జిషు సేన్ గుప్తా, నితిన్ మెహతా, రవివర్మ కృష్ణ తేజ, ప్రిషా సింగ్, సోనియా నరేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకత్వం -ఎడిటింగ్ : గ్యారీ బీఎచ్, కథ -నిర్మాత: కె. రాజశేఖర్ రెడ్డి, సీఈఓ: చరణ్ తేజ్ ఉప్పలపాటి, డీఓపీ: వంశీ పచ్చిపులుసు, మార్క్ డేవిడ్, అదనపు సినిమాటోగ్రఫీ: జూలియన్ అమర్ ఎస్ట్రాడా, కైకో నకహరా, సంగీతం : శ్రీచరణ్ పాకాల, విశాల్ చంద్రశేఖర్, ఆర్ట్ : అర్జున్ సూరిశెట్టి.



ఘనంగా వీరసింహారెడ్డి 100 రోజులు వేడుక

నందమూరి బాలకృష్ణ 107వ చిత్రం 'వీర సింహారెడ్డి' ప్రేక్షకుల విశేష ఆదరణతో 100 రోజులు పూర్తి చేసుకుంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచి బయ్యర్లందరికీ భారీ లాభాలను అందించింది. బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా 'వీర సింహారెడ్డి' 100 రోజుల వేడుకను మేకర్స్ ఘనంగా జరిపారు. చిత్రయూనిట్‌తోపాటు డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ కూడా ఈ చిత్ర శతదినోత్సవ షీల్డ్‌లను అందించారు.

ఈ వేడుకలో దర్శకులు అనిల్ రావిపూడి, బాబీ, హరీష్ శంకర్, శివ నిర్వాణ, బుచ్చిబాబు, నిర్మాతలు నాగ వంశీ, సాహు గారపాటి, హరీష్ పెద్ది తదితరులు హాజరై, అరుదైన శతదినోత్సవ వేడుక అని కొనియాడారు.

రామాయణం అంతరార్థం తెలిపే సినిమా

సౌద అరుణ స్టూడియోస్ పతాకంపై పాపులర్ రైటర్ సౌద అరుణ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కోడ్ రామాయణ'.. ఈ చిత్ర టైటిల్ అనౌన్స్‌మెంట్ ఫిలిం ఛాంబర్‌లో గ్రాండ్‌గా జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా వచ్చిన బౌద్ధ బిక్షువు బంతె షీల్ రక్షిత్, ప్రముఖ రచయిత్రి లలిత.పి. చేతుల మీదుగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేశారు.



ఈ సందర్భంగా భరద్వాజ మాట్లాడుతూ, 'రామాయణాన్ని 'పూర్వ రామాయణం', 'రావణచరిత్ర', 'ఉత్తర రామాయణం'.. ఇలా మూడు భాగాలు ఇందులో చెప్పాం. 'కోడ్ రామాయణ' అంటే రామాయణ అంతరార్థం అని అర్థం. అలాగే రామాయణంలో ఏం చెప్పడం కోసం రామాయణం వచ్చింది అనేది ముఖ్య ఉద్దేశ్యం' అని తెలిపారు. చిత్ర దర్శకులు సౌద అరుణ మాట్లాడుతూ,'అప్పుడు, ఇప్పుడు సంగీత సాహిత్యాలతో వర్ధిల్లిన గడ్డే ద్రవిడ భూమి. ఈ గడ్డపై పుట్టిన మేం జై శ్రీ రావణ అని స్మరించుకోవడం చాలా సంతోషంగా ఉంది. ద్రవిడ భూమి ఆత్మ గౌరవం అనే నినాదంతో ద్రవిడ భూమి గొప్ప తనాన్ని ప్రపంచం మరింత అర్థం చేసుకోవడానికే ఈ సినిమా చేస్తున్నామే తప్ప ఎవరినీ వ్యతిరేకించడానికి ఈ సినిమా తీయడంలేదు. ఈ మూడు భాగాల .ప్రాజెక్టు చేయడం ఒక దశాబ్ద కాలం పట్టే యజ్ఞం. ఇప్పటి వరకు మేము మూడవ వంతు పని మాత్రమే చేశాం' అని తెలిపారు.

మెప్పించే సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్

సాహస్, దీపిక నటించిన సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ '7:11 పీఎమ్'. ఈ చిత్ర ఫస్ట్ లుక్, ఫస్ట్ సింగిల్ తర్వాత విడుదలైన టీజర్‌తో అందరిలో ఈ సినిమాపై క్యురియాసిటీ పెంచింది.

చైతు మాదాల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆర్కస్ ఫిల్మ్స్ పతాకంపై నరేన్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది.


సాహస్, దీపిక

ఆదివారం ఈ సినిమా విడుదల తేదీని నిర్మాతలు అనౌన్స్ చేశారు. మైత్రి ద్వారా ఈనెల 30న విడుదల చేస్తున్నామని, ప్రముఖ ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ హౌస్ తమ చిత్రానికి సపోర్ట్ ఇవ్వడంతో సినిమాని భారీగా విడుదల చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. 'ఇదొక హైలీ స్క్రీన్‌ప్లేతో నడిచే కమర్షియల్ చిత్రం. 1999లో ఒక ముఖ్యమైన రోజున, భవిష్యత్తులో 400 సంవత్సరాలలో వేరే గ్రహం నుండి మానవుల మనుగడకు కీలకమైన సమాధానాల కోసం 'హంసలదీవి' అనే చిన్న ఇండియన్ టౌన్‌కి చేరుకుంటారు. అదే రోజున ఆ టౌన్ ని నాశనం చేయడానికి కొన్ని సంఘటనలు జరుగుతాయి. ఇవన్నీ ఫాస్ట్ ఫేస్డ్ థ్రిల్లర్‌గా సీట్ ఎడ్జ్ అనుభూతిని పంచుతాయి' అని చిత్ర బృందం తెలిపింది.

వేటాడతా షూటింగ్ షురూ..

అంకయ్య ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై అనిత మూవీస్ సమర్పణలో అరుణ్, సృజనలను హీరో, హీరోయిన్లుగా పరిచయం చేస్తూ రూపొందుతున్న చిత్రం 'వేటాడతా'. సురేష్ రెడ్డి దర్శకత్వంలో అంకయ్య ఎమ్ నిర్మిస్తున్న ఈ చిత్ర ప్రారంభోత్సవం ఆదివారం ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నిర్మాత రామసత్య నారాయణ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించగా, సాయి వెంకట్ క్లాప్ కొట్టారు. వైజాగ్ మాజీ మేయర్ దాడి సత్యనారాయణ కెమెరా స్విచాన్ చేశారు. నాగులపల్లి పద్మిని స్క్రిప్ట్ అందించారు.


సృజన, అరుణ్

ఈ సందర్భంగా నిర్మాత అంకయ్య ఎమ్ మాట్లాడుతూ, 'మా బ్యానర్‌లో మా అబ్బాయి అరుణ్‌ని హీరోగా పరిచయం చేస్తూ నిర్మిస్తున్న నాలుగో చిత్రమిది. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై సినిమా ఉంటుంది. ఇందులో నేను టైటిల్ రోల్ చేస్తున్నా' అని అన్నారు."బరి' సినిమా దర్శకుడుగా నాకు మంచి పేరు తెచ్చింది. ఇది నా రెండో సినిమా. సస్పెన్స్, మర్డర్ మిస్టరీతో రూపొందుతున్న చిత్రమిది. ఈ నెలాఖరులో షెడ్యూల్ ప్రారంభించనున్నాం. అరకు, నంద్యాల, హైదరాబాద్ ప్రాంతాల్లో షూటింగ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని దర్శకుడు సురేష్ రెడ్డి చెప్పారు. హీరోగా నటిస్తున్న నా తొలి సినిమా ఇది. మా నాన్న మంచి కథ సిద్ధం చేశారు. డైరక్టర్ సురేష్ రెడ్డి మంచి ప్లానింగ్‌తో షూటింగ్ ప్లాన్ చేస్తున్నారు' అని హీరో అరుణ్ చెప్పారు.

ఆటలు

ఐసీసీ టైటిళ్ల వేటలో టీమ్ ఇండియా దశాబ్ది నిరీక్షణ కొనసాగుతుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్ వరుసగా రెండోసారి నిరాశపరిచింది. 444 పరుగుల ఛేదనలో 234 పరుగులకే కుప్పకూలిన రోహిత్‌సేన.. గద వేటలో అభిమానులకు వ్యధ మిగిల్చింది!. 209 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది.

స్లో ఓవర్ రేట్ జరిమానాతో రెండేండ్ల క్రితం ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు కోల్పోయిన ఆస్ట్రేలియా.. ఇప్పుడు ప్రతీకారం తీర్చుకుంది. అనుకూల పరిస్థితుల్లో అందరూ రాణించగా ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌గా అవతరించింది. 1987, 1999, 2003, 2007, 2015 వన్డే వరల్డ్‌కప్.. 2006, 2009 చాంపియన్స్ ట్రోఫీలు సహా 2021 టీ20 ప్రపంచకప్ నెగ్గిన ఆస్ట్రేలియా తాజాగా 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌తో మెన్స్ క్రికెట్‌లో పరిపూర్ణ జట్టుగా నిలిచింది. ఐసీసీ నాలుగు టోర్నీల్లో విజేతగా నిలిచిన ఏకైక జట్టుగా ఆస్ట్రేలియా రికార్డు సృష్టించింది.


ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ గదతో ఆసీస్ క్రికెటర్ల విజయోత్సాహం

గద వాళ్లకు.. వ్యధ మనకు!

- ప్రపంచ టెస్టు చాంపియన్‌గా ఆస్ట్రేలియా
- ఐసీసీ గద కంగారూల సొంతం
- 444 ఛేదనలో భారత్ 234/10

రెండోసారి భారత్‌కు భంగపాటు

నవతెలంగాణ-కెన్నింగ్టన్

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్ ఆస్ట్రేలియా. ది ఓవల్‌లో జరిగిన ప్రపంచ టెస్టు మహా సంగ్రామంలో భారత్‌పై 209 పరుగుల తేడాతో గెలుపొందిన ఆస్ట్రేలియా.. 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ గదను సొంతం చేసుకుంది. 444 పరుగుల ఛేదనలో భారత్ 234 పరుగులకే కుప్పకూలింది. విరాట్ కోహ్లి (49, 78 బంతుల్లో 7 ఫోర్లు), అజింక్య రహానె (46, 108 బంతుల్లో 7 ఫోర్లు)లు చివరి రోజు భారత్ ఆశలను సజీవంగా నిలిపినా.. ఆట మొదలైన కొద్దిసేపటికే ఆశలూ ఆవిరయ్యాయి!. 63.3 ఓవర్లలోనే భారత్ 234 పరుగులకు చేతులెత్తేసింది. కంగారూ స్పిన్నర్ నాథన లయాన్ (4/41) మాయజాలానికి తోడు పేసర్లు స్కాట్ బొలాండ్ (3/46), మిచెల్ స్టార్క్ (2/77) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో విధ్వంసక శతకం సాధించిన ట్రావిశ్ హెడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ గదతో పాటు రూ.13 కోట్ల నగదు బహుమతి అందుకున్నాడు. రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు సిల్వర్ మెడల్స్‌తో పాటు రూ.6.6 కోట్ల ప్రైజ్‌మనీ దక్కించుకుంది.

లంచ్‌లోపే ఆలౌట్ : ఓవర్‌నైట్ స్కోరు 164/3తో ఐదో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ మరో 280 పరుగులు చేయాల్సి స్థితిలో నిలిచింది. క్రీజులో విరాట్ కోహ్లి, అజింక్య రహానెలు అజేయంగా ఆడుతున్నారు. చేతిలో ఏడు వికెట్లు ఉండటంతో చివరి రోజు మనోళ్ల గెలుపు కోసం అమీతుమీ తేల్చుకుంటారనే అంచనాలు కనిపించాయి. కానీ ఉదయం సెషన్ ఆరంభంలోనే ఆశలు ఆవిరయ్యాయి. లంచ్ విరామానికి ముందే టీమ్ ఇండియా చేతులెత్తేసింది. 23.3 ఓవర్లలోనే చివరి ఏడు వికెట్లు చేజార్చుకుంది. వ్యక్తిగత స్కోరుకు మరో ఐదు పరుగులు జోడించిన విరాట్ కోహ్లి తీవ్రంగా నిరాశపరిచాడు. ఆసీస్ పేసర్ స్కాట్ బొలాండ్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టి భారత్‌ను ఓటమి కూరల్లోకి నెట్టాడు. బొలాండ్ ఓవర్లో ఆఫ్‌సైడ్ బంతిని వెంటాడిన విరాట్ కోహ్లి.. స్లిప్స్‌లో క్యాచ్ ఇచ్చాడు. కోహ్లి వికెట్‌తో భారత్ మానసికంగా ఓటమిని అంగీకరించగా.. ఆస్ట్రేలియా శిబిరంలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. రవీంద్ర జడేజా (0) ఎదుర్కొన్న రెండో బంతికే వికెట్ల వెనకాల దొరికిపోయాడు. ఒకే ఓవర్లో విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా వికెట్లతో భారత్ పనైపోయింది. అజింక్య రహానె (46) సైతం ఎంతోసేపు వికెట్ కాపాడుకోలేదు. శార్దుల్ ఠాకూర్ (0) డకౌట్‌గా నిష్క్రమించగా.. ఉమేశ్ యాదవ్ (1), మహ్మద్ సిరాజ్ (1) ఆసీస్‌ను పెద్దగా కష్టపెట్టలేదు. లంచ్ విరామం లోపే చివరి ఏడు వికెట్లు కోల్పోయిన భారత్ 209 పరుగుల తేడాతో ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో పరాజయం పాలైంది.


ఈ గద.. అందని ద్రాక్షేనా?! రన్నరప్ మెడల్‌తో నిష్క్రమిస్తూ కోహ్లి..!

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 469/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 296/10

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : 270/8 డిక్లేర్డ్

భారత్ రెండో ఇన్నింగ్స్ : రోహిత్ (ఎల్బీ) లయాన్ 43, గిల్ (సి) గ్రీన్ (బి) బొలాండ్ 18, పుజార (సి) అలెక్స్ (బి) కమిన్స్ 27, కోహ్లి (సి) స్మిత్ (బి) బొలాండ్ 49, రహానె (సి) అలెక్స్ (బి) స్టార్క్ 46, జడేజా (సి) అలెక్స్ (బి) బొలాండ్ 0, భరత్ (సి,బి) లయాన్ 23, శార్దుల్ (ఎల్బీ) లయాన్ 0, ఉమేశ్ (సి) అలెక్స్ (బి) స్టార్క్ 1, షమి నాటౌట్ 13, సిరాజ్ (సి) బొలాండ్ (బి) లయాన్ 1, ఎక్స్‌ట్రాలు : 13, **మొత్తం : (63.3 ఓవర్లలో ఆలౌట్) 234.**

వికెట్ల పతనం : 1-41, 2-92, 3-93, 4-179, 5-179, 6-212, 7-213, 8-220, 9-224, 10-234. **బౌలింగ్ :** పాట్ కమిన్స్ 13-1-55-1, స్కాట్ బొలాండ్ 16-2-46-3, మిచెల్ స్టార్క్ 14-1-77-2, గ్రీన్ 5-0-13-0, లయాన్ 15.3-2-41-4.

అక్కడే చేజారింది!

వరుసగా రెండో ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్. రెండేండ్ల క్రితం ఇదే పరిస్థితుల్లో గద వేటలో భంగపాటు నుంచి భారత్ పాఠాలు నేర్చుకోలేదు. 2021లో న్యూజిలాండ్‌తో ఫైనల్లో, 2023లో ఆస్ట్రేలియాతో తుది పోరులో టీమ్ ఇండియాను విజయానికి దూరం చేసింది బ్యాటర్లే!. కివీస్‌పై తొలి ఇన్నింగ్స్‌లో 217 పరుగులే చేసిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలింది. ఇప్పుడూ తొలి ఇన్నింగ్స్‌లో 296 పరుగులు చేసి, రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు చేతులెత్తేసింది. తాజా టైటిల్ పోరులో బౌలర్ల వైఫల్యం సైతం కాస్త కనిపించినా.. ఓవరాల్‌గా రెండు ఐసీసీ టెస్టు ఫైనల్స్‌లో బ్యాటింగ్ విభాగం దారుణంగా విఫలమైంది.



ది ఓవల్‌లో టాస్ భారత్ వశం. ప్రణాళిక ప్రకారం తొలుత ఆసీస్ బ్యాటింగ్. బౌలర్లు రాణించగా 24.1 ఓవర్లలోనే 76/3తో కంగారూ శిబిరంలో ఒత్తిడి. ఇక్కడి వరకు బాగానే నడిచినా.. ఇక్కడ్నుంచే ఐసీసీ టెస్టు గద భారత్‌కు దూరమవుతూ వచ్చింది. ట్రావిశ్ హెడ్ (163), స్టీవ్ స్మిత్ (121) నాల్గో వికెట్‌కు 285 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేసి.. రోహిత్‌సేనను మానసికంగా వెనక్కి నెట్టారు. రిషబ్ పంత్ ప్రత్యర్థి జట్లకు ఇచ్చే ఝలక్ ది ఓవల్‌లో ట్రావిశ్ హెడ్ భారత్‌కు రుచి చూపించాడు. హెడ్, స్మిత్ భాగస్వామ్యాన్ని కట్టడి చేసి ఉంటే ఫలితం భిన్నంగా వచ్చేందుకు అవకాశాలు ఉండేవి. ఇక పిచ్ బ్యాటింగ్‌కు సహకరిస్తున్న సమయంలో టాప్ ఆర్డర్ కుప్పకూలటం కొంప ముంచింది. రోహిత్ (15), గిల్ (13), పుజార (14), కోహ్లి (14) పెవిలియన్‌కు క్యూ కట్టారు. రెండో ఇన్నింగ్స్‌లోనూ పరిస్థితిలో పెద్ద మార్పు లేదు. 91/1తో మెరుగ్గా సాగుతున్న దశలో రోహిత్, పుజార వికెట్లతో భారత్‌పై ఒత్తిడికి అధికమైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 285 పరుగుల నాల్గో వికెట్ భాగస్వామ్యం ఆ జట్టును ఐసీసీ ప్రపంచ టెస్టు విజేతగా నిలుపగా.. బ్యాటర్ల సమిష్టి వైఫల్యం భారత్‌ను వరుసగా రెండోసారి రన్నరప్‌గా నిలిపింది.

జకోవిచ్ స్లామ్ నం.23

రికార్డు గ్రాండ్‌స్లామ్ సాధించిన నొవాక్



పారిస్ : టెన్నిస్ చరిత్రలో నొవాక్ జకోవిచ్ సరికొత్త రికార్డు. పురుషుల సింగిల్స్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన ఆటగాడిగా నొవాక్ జకోవిచ్ (సెర్బియా) చరిత్ర సృష్టించాడు. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ ఫైనల్లో కాస్పర్ రూడ్ (నార్వే)పై 7-6(7-1), 6-3, 7-5తో వరుస గేముల్లో గెలుపొందిన జకోవిచ్ కెరీర్ 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో మూడో టైటిల్ సాధించి.. నాలుగు గ్రాండ్‌స్లామ్‌లను కనీసం మూడేసి సార్లు ముద్దాడిన ఏకైక క్రీడాకారుడిగా నిలిచాడు.

టైటిల్ పోరులో జకోవిచ్ 11 ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో విరుచుకుపడ్డాడు. పాయింట్ల పరంగా 118-89తో రూడ్‌పై ఆధిపత్యం చెలాయించిన జకోవిచ్.. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో సొంతం చేసుకుని చారిత్రక విజయం సాధించాడు.

లంకలో భారత్ మ్యాచులు!

ఆసియా కప్ హైబ్రిడ్ మోడల్



దుబాయ్ : 2023 ఆసియా కప్‌పై నెలకొన్న సందిగ్ధతకు త్వరలోనే తెరపడనుంది. ఆసియా కప్ కోసం పాకిస్థాన్‌లో పర్యటించేందుకు బీసీసీఐ నిరాకరించగా.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సరికొత్త హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదనతో ముందుకొచ్చింది. ఆసియా కప్‌లో భారత్ ఆడే మ్యాచులను శ్రీలంకలో నిర్వహించనున్నారు. భారత్ భాగస్వామ్యం లేని మ్యాచులను పాకిస్థాన్‌లో నిర్వహిస్తారు. 13 రోజుల పాటు సాగే ఆసియా కప్‌లో ఆరు జట్లు 13 మ్యాచులు ఆడనున్నాయి. భారత్ ఫైనల్స్‌కు చేరుకుంటే.. టైటిల్ పోరు సైతం శ్రీలంకలోనే జరుగనుంది. పీసీబీ నూతన ప్రతిపాదనకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ త్వరలోనే ఆమోద ముద్ర వేయనుందని సమాచారం. ఇక తాజా ప్రతిపాదనతో 2023 వన్డే వరల్డ్‌కప్, 2025 చాంపియన్స్ ట్రోఫీల్లో భారత్, పాకిస్థాన్ ఇరు దేశాల్లో పర్యటించే అంశంపై సైతం ఓ స్పష్టత వచ్చినట్టు తెలుస్తుంది. వన్డే వరల్డ్‌కప్ కోసం పాకిస్థాన్ జట్టు భారత్‌కు రానుండగా.. చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత్ సైతం పాక్ గడ్డపై అడుగుమోపనుందని క్రికెట్ వర్గాలు అంటున్నాయి.

తెలుగు టాలన్స్ ఓటమి

ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్

జైపూర్ : తెలుగు టాలన్స్ తొలి ఓటమి చవిచూసింది. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్)లో ఆదివారం జైపూర్‌లో జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహారాష్ట్ర ఐరన్‌మ్యాన్ చేతిలో 26-30తో పరాజయం పాలైంది. ప్రథమార్థం ముగిసే సరికి 14-12తో రెండు గోల్స్ ముందంజలో నిలిచిన తెలుగు టాలన్స్ విరామం అనంతరం మ్యాచ్‌పై పట్టు కోల్పోయింది. తెలుగు టాలన్స్ ఆటగాడు నసీబ్ సింగ్ 10 గోల్స్‌తో మెరిసినా.. ఐరన్‌మ్యాన్ ప్లేయర్ అంకిత్ కుమార్ 9 గోల్స్ ప్రదర్శనతో ఆ జట్టును విజేతగా నిలిపాడు. నేడు ఢిల్లీ పాంజర్స్‌తో తెలుగు టాలన్స్ తలపడనుంది.

మెరిసిన సిక్కిరెడ్డి జోడీ

డెన్మార్క్ మాస్టర్స్ టైటిల్ వశం

న్యూఢిల్లీ : తెలుగు తేజం, డబుల్స్ స్టార్ సిక్కి రెడ్డి టైటిల్ దాహం తీర్చుకుంది. రోహన్ కపూర్ జోడీగా డెన్మార్క్ మాస్టర్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో సిక్కి రెడ్డి, రోహన్ కపూర్ జోడీ 21-16, 21-17తో మాడ్స్, క్రిస్టెన్ (డెన్మార్క్)లపై వరుస గేముల్లో గెలుపొందారు. 42 నిమిషాల్లోనే నాల్గో సీడ్ డెన్మార్క్ జోడీని మట్టికరిపించిన సిక్కి రెడ్డి, రోహన్ కపూర్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886